thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 55 | కరీంనగర్ మంగళవారం, 6 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదు

కోచి : రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సబబేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి నిర్ణయం అవసరమని తెలిపారు. కోచిలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'గవర్నర్ల అధికారాల్లో న్యాయ వ్యవస్థ' పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉంది

## రూ. 3,900 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ రహదారుల ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్ర మంత్రి గడ్కరీ

కాగజ్నగర్ రూరల్ : తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. రూ. 3,900 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ రహదారుల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి,ఎమ్మెల్యే హరీష్ బాబు తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రారంభించిన ప్రాజెక్టులు: మంచిర్యాల నుండి వాంకిడి (మహారాష్ట్ర సరిహద్దు వరకు) NH-363 ఫోర్ లైన్ రోడ్డు నిర్మల్-ఖానాపూర్ NH-61 రెండు వరుసల రహదారి నాగపూర్-హైదరాబాద్ NH-44లో అండర్‌పాస్‌లు, జంక్షన్‌లు. గడ్కరీ మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధిలో జల సంరక్షణ కీలకమైంది. ఇంటి నీళ్లు ఇంటిలోనే, పొలం నీళ్లు పొలంలోనే నిల్వ చేసుకునే విధంగా సీఎం ప్రణాళికలు రూపొందించాలి" అని సూచించారు. పేదలకు వసతి, ఆహారం, వస్త్రాలు అందించడమే నిజమైన రాజకీయమని అభిప్రాయపడ్డారు.దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేగె ప్రభుత్వం చీకటి ప్రాంతాలకు వెలుగు చిమ్ముతోందని చెప్పారు. రైతుల అభివృద్ధిని కేంద్ర బిందువుగా తీసుకుని ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**గడ్కరీ హామీలు – భవిష్యత్తు అభివృద్ధి...** రాబోయే 3 సంవత్సరాల్లో రూ. 2 లక్షల కోట్లతో తెలంగాణలో రహదారుల అభివృద్ధి,రాష్ట్ర వ్యాప్తంగా మరో లక్ష కోట్లతో గ్రీన్ హైవేలు,మేడారం రహదారి విస్తరణ,నాగపూర్-హైదరాబాద్ మార్గాన్ని ఆరు వరుసల జాతీయ రహదారిగా విస్తరింపు,శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు రహదారి కలను నిజం చేయనున్నాం.

**వ్యక్తిగత అనుభవాలను వెల్లడి...** "నాకు 7 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను డ్రోన్ తో ఎరువులు పిచికారీ చేస్తున్నాను," అని తన అనుభవాన్ని పంచుకున్నారు. గడ్చిరోలి జిల్లా పరిసర ప్రాంతాల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తెలంగాణలో పేదరిక నిర్మూలన తన ఆకాంక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు గూడెం నాగేష్, గడ్డం వంశీ, ఎమ్మెల్సీ దండే విట్టల్, కలెక్టర్ వెంకటేష్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.






## బెంగళూరులో ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బెంగళూరులో కలుసుకుంటున్నారు.ఒకే వేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచుకుంటున్నారు. ఈ నెల 9వ తేదీన ఈ నెల 9న బెంగళూరుకు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి లు హాజరు కానున్నారు. ఓ మీడియా సంస్థ సదస్సులో పాల్గొననున్న ఇద్దరు సీఎంలు వివిధ అంశాలపై చర్చించనున్నారు.

వేర్వేరు అంశాలపై...సదస్సులో పాల్గొననున్న కేంద్రమంత్రులు, పలువురు ప్రముఖులు కూడా హాజరు కానున్నారు. సామాజిక న్యాయం, తెలంగాణ ప్రభుత్వం సర్వేపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వాంటమ్ వ్యాలీ, ఎడ్యుకేషనల్ హబ్స్, సంకీర్ణ రాజకీయాలు, సుపరిపాలనపై ప్రసంగించనున్నారు.




న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. 2025 మే 5వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో ఢిల్లీలోని మోదీ ఆఫీస్‌లో ఈ భేటీ జరిగింది. మోదీ, రాహుల్ గాంధీ అధికారికంగా సమావేశం కావడంతో ఈ భేటీపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొత్త సీబీఐ డైరెక్టర్ నియామకంపై రాహుల్ గాంధీ, మోదీ మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో మోదీ, రాహుల్ గాంధీతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కూడా ఉన్నారు. ప్రస్తుతం సీబీఐ డైరెక్టర్?గా కొనసాగుతున్న ఐపీఎస్ అధికారి ప్రవీణ్ సూద్ పదవీ కాలం ఈ నెలతో ముగియనుంది. మే 2023లో రెండేళ్ల పదవీ కాలంతో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. మే 2025తో ఆ రెండేళ్ల పదవీ కాలం ముగియనుంది. కొత్త సీబీఐ డైరెక్టర్ నియామకంపై రాహుల్ గాంధీతో, సీజేఐతో ప్రధాని మోదీ చర్చించారు.




**మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. వందకు పైగా దేశాల నుంచి వచ్చే అందాల భామలకు స్వాగతం చెప్పేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో విదేశీ ప్రతినిధులకు స్వాగతం పలికేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇవాల్టి నుంచి విదేశీ ప్రతినిధులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక లాంజ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.**




## ప్రపంచానికి తెలిసేలా పాక్ పై....

# త్రిముఖ దాడులు

## బ్లూప్రింట్ సిద్ధం.. మోదీ భారీ వ్యూహం!

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు అండగా ఉంటున్న పాకిస్తాన్ పైన భారత్ యుద్ధానికి సిద్ధమైందా? ప్రపంచ దేశాలకు భారత సత్తా తెలిసేలాగా, పాకిస్తాన్ ను దెబ్బ కొట్టి దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అయ్యేలాగా పక్కా ప్లాన్ తో ముందుకు వెళుతుందా? పహల్గామ్ లో ఉగ్రదాడి ప్రతీకారంలో భాగంగా పాకిస్తాన్ తోక కత్తిరించడానికి భారత్ రెడీ అయిందా? త్రివిధ దళాలతో త్రిముఖవ్యూహంతో భారత్ వడివడిగా అడుగులు వేస్తోందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తుంది.

**పాకిస్తాన్ పై దాడికి బ్లూ ప్రింట్ రెడీ...** పక్కా ప్లాన్ తో భారత్ యుద్ధానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం భారత్ తీసుకుంటున్న చర్యలు, వేస్తున్న అడుగులు పాకిస్తాన్ పైన భారీ దాడికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. భారత్ పాకిస్తాన్ బోర్డర్ లో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. ఇప్పటికే త్రివిధ దళాలతో సమావేశాలు నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ త్రిముఖ దాడులకు సిద్ధమయ్యారు. పాకిస్తాన్ కు ఊపిరి సలపనివ్వకుండా దాడి చేసేందుకు బ్లూ ప్రింట్ కూడా రెడీ చేస్తున్నట్టు సమాచారం.

**అరేబియా సముద్రంలో నేవీ సిద్ధం...** వారం రోజుల్లో కార్యచరణ చేపట్టి, నిర్దిష్ట చర్యలు కూడా తీసుకోవడానికి భారత్ సిద్ధమైంది .ఇక అరేబియా సముద్రంలో నేవీ సర్వ సన్నద్ధమైంది. ఎల్ ఓ సి వెంబడి ఎనిమిది చోట్ల పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడితే అక్కడ భారత్ దీటుగా సమాధానం ఇచ్చింది. ఇప్పటికే సరిహద్దుల్లో భారీ సైన్యాన్ని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించి భారత్ సిద్ధమవుతోంది.

**వ్యూహ ప్రతివ్యూహాలతో సిద్ధం అవుతున్న భారత్.. మోదీ వరుస భేటీలు...** పెద్ద ఎత్తున ఆర్మీ కదలికలు కూడా పాకిస్తాన్ పైన త్వరలో భారీ దాడి జరగబోతుంది అన్న సంకేతాలను ఇస్తున్నాయి. రష్యా నుంచి ఇగ్లా ఎస్ క్షిపణులను కొనుగోలు చేసి భారత్ సమరానికి సై అంటుంది. అటు ప్రధాని మోదీ వరుసగా త్రివిధ దళాధిపతులతో భేటీ అవుతూ యుద్ధ సన్నద్ధత పైన ఆరా తీస్తున్నారు.

పాకిస్తాన్ తమపైన ఎదురు దాడి చేస్తే తిప్పి కొట్టేందుకు భారత్ అన్ని రకాల అస్త్ర, శాస్త్రాలతో సిద్ధమవుతోంది.

**ఈ వారం కీలక నిర్ణయం...** వ్యూహ, ప్రతివ్యూహాలతో త్రివిధ దళాలు పాకిస్తాన్ ను చుట్టుముట్టి కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏ క్షణమైనా యుద్ధం ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు దఫాలుగా భద్రతా వ్యవహారాల క్యాబినెట్ భేటీ జరిగింది. ఈవారం మరో మారు సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వేగంగా మారుతున్న పరిణామాలు భారత్ పాకిస్తాన్ కు చుక్కలు చూపిస్తుంది అన్న భావన కలిగిస్తుంది. యుద్ధమే జరిగితే భారత్ ప్రపంచానికే తమ సత్తా తెలిసేలా చెయ్యాలనే ప్లాన్ లో ఉంది.




హైదరాబాద్: బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ ఫ్యామిలీ అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. వివిధ పనుల మీద వాళ్లు అమెరికా వెళ్లనున్నారు. హిమాన్షు గ్రాడ్యుయేషన్ డే కోసం గులాబీ బాస్ అమెరికా వెళ్లారని తెలుస్తోంది.

ఇందుకోసం కేసీఆర్, తన సతీమణి శోభతో కలిసి ఈ ఏడాది ఫిబ్రవరిలో సికింద్రాబాద్ పాస్ పోర్టు కార్యాలయానికి వెళ్లారు. డిప్లమాట్ పాస్ పోర్టును జనరల్ కేటగిరీకి మార్చుకున్నారు. ఆతర్వాత ఇటీవలే గచ్చిబౌలిలోని అమెరికా కాన్సులేట్ కు వెళ్లి వీసా కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. కేటీఆర్ కుమారుడు హిమాన్షు, కుమార్తె అలేఖ్య ప్రస్తుతం అమెరికాలోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. వాళ్లను చూసేందుకు, కొద్ది రోజుల పాటు గడిపేందుకు కేసీఆర్ తన సతీమణి శోభతో కలిసి అమెరికా వెళ్తారని ప్రచారం జరుగుతోంది. అయితే హిమాన్షు గ్రాడ్యుయేషన్ డేకు వెళ్లారని ఓ వైపు ప్రచారం జరుగుతుండగా.. అది సరికాదని హిమాన్షు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేందుకు ఇంకా సమయం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కేసీఆర్ అమెరికా టూర్ పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**22 తర్వాత కేటీఆర్...** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఈ నెల 22వ తేదీ తర్వాత అమెరికా వెళ్లబోతున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాసెస్ దాదాపు పూర్తయింది. ఇటీవలే జిమ్ లో వర్కవుట్ చేస్తూ స్వల్పంగా గాయపడ్డ కేటీఆర్ ప్రస్తుతం రెస్టు లో ఉన్నారు. జూన్ 2వ తేదీన అమెరికాలో ప్రవాస తెలంగాణ వాసులు నిర్వహించే రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు.

**16న ఎమ్మెల్సీ కవిత...** ఈ నెల 16న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు వెళ్లనున్నారు. తమ కుమారుని గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి కవిత దంపతులు హాజరుకానున్నారు. విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇవ్వడంతో? ఆమె ఈ నెల 16 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న కవిత విదేశీ పర్యటన కోసం ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి అనుమతి కూడా తీసుకున్నారు.

## కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీని పెంచడమే మోదీ సర్కార్ లక్ష్యం: కిషన్‌రెడ్డి

కాగజ్‌నగర్: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీని పెంచడం మోదీ సర్కార్ లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రూ.3,900 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. "జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయి. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 7 టెక్స్‌టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కింది. రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశాం. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే 'సమరం' అంటే ఎలా?: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారు? అని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. "ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా? సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం." అని రేవంత్‌రెడ్డి అన్నారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

## యూరియా అధికంగా వాడి.. పోషించే భూతల్లిని నాశనం చేయొద్దు: మంత్రి తుమ్మల




హైదరాబాద్: వ్యవసాయంలో మరిన్ని మార్పులు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వికారాబాద్ జిల్లా ధరూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి సాగులోనూ పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలన్నారు. పురుగు మందులు, యూరియా వాడకం బాగా తగ్గించాలని సూచించారు. యూరియా అధికంగా వాడి.. మనల్ని పోషించే భూతల్లిని నాశనం చేయొద్దని పేర్కొన్నారు. "ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దీని సాగు పెరగాలి. ఇప్పుడు అన్ని జిల్లాల్లో ఈ పంట సాగుకు అనుమతి ఉంది. ఆయిల్‌పామ్‌లో మూడేళ్ల పాటు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. గతంలో ఈ పంట దిగుబడి ఆరేళ్లకు వచ్చేది.. ఇప్పుడు మూడేళ్లకే వస్తోంది. దీని సాగుతో నెలకు రెండుసార్లు జీతం వచ్చినట్లు రైతులకు ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్లీ పునరుద్ధరించనుంది. ఖజానా ఖాళీగా ఉండటం వల్ల కొన్ని ఆలస్యం అవుతున్నాయి" అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## మే 7న ఆర్టీసీ సమ్మె..హైదరాబాద్‌లో భారీ కవాతు




హైదరాబాద్: ఈ నెల 7న సమ్మెకు పిలుపునిచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ.. సమ్మె సన్నద్ధతలో భాగంగా భారీ ఎత్తున కార్మికులతో కవాతు నిర్వహిస్తోంది. ఆర్టీసీ కళాభవన్ నుంచి ప్రారంభమైన కవాతు.. బస్ భవన్ వరకు కొనసాగనుంది. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసులు కూడా ఇచ్చామని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. అయినప్పటికి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించకపోవడంతో సమ్మె సన్నద్ధతలో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల కవాతు దృష్ట్యా పోలీసులను భారీగా మోహరించారు.

## మద్యం తాగుతూ ఫుల్ స్పీడ్‌తో రైడ్..

హైదరాబాద్, మే 5: భాగ్యనగరంలో మందు బాబులు రెచ్చిపోతున్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని పోలీసులు ఎన్ని సార్లు చెప్పినప్పటికీ మందుబాబులు తమ పందాను వీడటం లేదు. మరింతగా రెచ్చిపోయి మద్యం తాగి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పరిస్థితి. ఎప్పటికప్పుడు పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేసిన వారిని పట్టుకోవడం.. చలానా వేయడం.. అవసరమైతే శిక్ష వేయడం కూడా జరుగుతోంది. అయినప్పటికీ మేం ఇంతే అన్నట్లుగా మందు బాబులు పెట్రేగిపోతున్నారు. పోలీసులు ఉంటారన్న భయం లేకుండా మందు తాగేసి విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతున్నారు. వీరి వల్ల ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. మద్యం సేవించి వాహనం నడపడమే కాకుండా రోడ్డు ప్రమాదాలకు కూడా వీరు కారకులుగా నిలుస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. మద్యం సేవిస్తూ యదేచ్ఛగా వాహనాన్ని నడిపాడు ఓ వ్యక్తి. ఇతగాడికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకీ ఏం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం. టోలీచౌకి ఫ్లై ఓవర్‌పై ఓ వ్యక్తి ఫుల్‌గా మద్యం సేవించి హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి 1:45 గంటల ప్రాంతంలో మద్యం సేవిస్తూ యదేచ్ఛగా వాహనాన్ని నడిపాడు ఆ మందుబాబు.కారు నడపడం కూడా మామూలుగా కాదండయో.. అత్యంత వేగంగా వాహనాన్ని నడిపాడు. ఇతగాడు మద్యం సేవిస్తూ వాహనాన్ని నడుపటాన్ని ఓ బైకర్ వీడియో తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఇలా మద్యం సేవించి అడ్డదిడ్డంగా వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి పట్ల నెటిజన్లు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా చేసి ఎంత మంది ప్రాణాలను బలితీసుకుంటారని మండిపడుతున్నారు.




పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఆ ట్రోలింగ్‌ను ఖండించింది.

ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో మృతి చెందినవారిలో నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు చేయడం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ తరుణంలోనే మహిళా కమిషన్ నుంచి స్పందన వచ్చింది. "పహల్గాం ఉగ్రదాడిలో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడింది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి, ప్రాణాలు తీశారు. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో ఆయన భార్య హిమాన్షి నర్వాల్ వ్యక్తంచేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఆమె వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండించదగినది. ఏదైనా కామెంట్ చేసేటప్పుడు మర్యాదగా, రాజ్యాంగ సరిహద్దులకు లోబడి వ్యవహరించాలి. జాతీయ కమిషన్ ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉంది" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. హరియాణాకు చెందిన వినయ్–హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వచ్చింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. పెళ్లై వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది.




హైదరాబాద్: ఆర్టీసీ సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు మంత్రిని కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమస్యలను వినడానికి సీఎంతో పాటు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమంతో పాటు ప్రయాణికుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సంస్థ ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి కోలుకుంటోందని, సమస్యలు తగ్గుతున్నాయని వివరించారు. ఈ దశలో సమ్మె చేయవద్దని కార్మిక సంఘాల నేతలకు సూచించారు. "సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీని నిర్వీర్యం చేసింది. కొత్తగా ఒక్క బస్సు కొనలేదు.. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. ఉద్యోగుల సీసీఎస్, పీఎఫ్ డబ్బులు వాడుకున్నారు. కాంగ్రెస్ హయాంలో సంస్థ ఉద్యోగులకు బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించాం. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రూ.1039 కోట్లు చెల్లించాం. సీసీఎస్ బకాయిలు రూ.345 కోట్లు చెల్లించాం. 1500 మందికి కారుణ్య నియామకాలు పూర్తి చేశాం. ఆర్టీసీలో కొత్తగా 3,038 మంది నియామకానికి అనుమతి ఇచ్చాం." అని పొన్నం ప్రభాకర్ వారికి వివరించారు.

## కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు




నిజామాబాద్: కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలు ఒకే కంపెనీకి చెందిన డైరెక్టర్లలాంటి వారని విమర్శలు చేశారు. ఇవాళ(సోమవారం) జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో పసుపు పరిశ్రమను ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ముందుకు వస్తే సబ్సిడీలు ఇస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. దేశంలోనే నిజామాబాద్ ప్రాంతంలో ప్రగతిశీల రైతులు ఉన్నారని అన్నారు. ప్రతి పంటపై అవగాహన కలిగి ఉన్నారని చెప్పారు. కో ఆపరేటివ్ సెక్టార్‌లో ఏర్పడే పరిశ్రమలకు ఇందూరు ప్రాంతం ఎంతో అనుకూలమని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు లక్ష కోట్ల నిధులు మంజూరు చేస్తామని అన్నారు. తెలంగాణలో ఉన్న పాకిస్తానీయులను వెంటనే పంపించి వేయాలని ప్రభుత్వాన్ని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. బోధన్ రోహింగ్యాలకు అడ్డాగా మారిందని ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనదేశానికి జగద్గురువు అని అభివర్ణించారు. వచ్చే 2029 ఎన్నికల్లో ఇందూరు సెగ్మెంట్‌లో బీజేపీకి 70 శాతం ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఏనాడైనా ముస్లింలు బీజేపీకి ఓట్లు వేస్తారా అని ప్రశ్నించారు. హిందూ ప్రాణాలకు లెక్కేలేదని చెప్పారు. తెలంగాణలో పాకిస్తానీయులు ఒక్కరూ కూడా ఉండవద్దని అన్నారు. హిందూ రాష్ట్ర స్థాపనకు ఇందూరు నుంచే పునాది పడుతోందని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## అవి సాధారణ మరణాలు కావు.. ప్రభుత్వ హత్యలే..




సిద్దిపేట జిల్లా: బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో పర్యటించారు తడిచిన దాన్యాన్ని పరిశీలించారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు ప్రక్రియ జరగడం లేదని విమర్శించారు.

**ఐదుగురు రైతులు మృతి..** మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ధాన్యపు కుప్పల మీదనే ప్రాణాలు వదిలారన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలపై సీఎం రివ్యూల మీద రివ్యూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. ధాన్యం ఐదు కిలోల తరుగు తీస్తున్నారని.. దీనిపై యాక్షన్ ఏదని అన్నారు. తాలు, తరుగు పేరిట కోతలు పెడుతున్నారని.. ప్రభుత్వం నుంచి రైతులకు ధైర్యం చెప్పే మాటలు రావడం లేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ళ మీద ఓట్టు పెట్టీ మాట తప్పిన ఫలితమేమో ఈ అకాల నష్టం అనిపిస్తుందన్నారు. సీఎం మాట తప్పడం వల్లే ప్రకృతి పగ పట్టినట్లు కనిపిస్తోందన్నారు.

## శ్రీతేజ్‌ను పరామర్శించి అల్లు అరవింద్, బన్నీ వాసు




సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను కిమ్స్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినా సంగతి తెలిసిందే. అక్కడి నుంచి ఏషియన్ ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించారు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న శ్రీతేజ్‌ను సోమవారం ఉదయం నిర్మాత అల్లు అరవింద్, బన్నీ వాసు పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ హాస్పిటల్‌లో ఉన్నప్పటి నుంచి అతని యోగ క్షేమాలను అల్లు అర్జున్, అల్లు అరవింద్, బన్నీ వాసు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. అతని హాస్పిటల్ ఖర్చులతో పాటు, అతని కుటుంబానికి హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, మైత్రీ మూవీస్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచలి రవిశంకర్‌లు ఆర్థికంగా సహాయం చేసిన సంగతి తెలిసిందే. శ్రీతేజ్ మళ్లీ ఎప్పటిలానే సాధారణ స్థితికి వచ్చి, అందరితో కలిసి స్కూల్‌కు వెళ్లే వరకు, అలాగే భవిష్యత్‌లో అతనికి ఏ అవసరం వచ్చినా అతనికి, అతని ఫ్యామిలీకి అండగా ఉండేందుకు అల్లు అర్జున్ సైతం కమిటై ఉన్నారు.

# ఆంధ్రప్రదేశ్ తొలి ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ౦ మే 6...కోకా సుబ్బారావు వర్ధంతి



రాజ్యాంగ సంక్రమిత ప్రాథమిక హక్కులను, సవరించేందుకు చట్టసభలకు వీలులేదని, అలాగే చట్ట సభలకు (పార్లమెంట్ కి) కూడా ప్రాథమిక హక్కులు ఉల్లంఘన చేసే అధికారం లేదని చారిత్రాత్మక తీర్పులు వెలువరించిన న్యాయమూర్తి కోకా సుబ్బారావు. కోకా సుబ్బారావు (జులై 15, 1902 – మే 6, 1976) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తి, తొమ్మిదవ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి. రాజమండ్రిలో 1902 జూలై 15న కోకా సుబ్బారావు విద్యావంతులైన వెలమ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి సుబ్రమణ్యేశ్వర నాయుడు కూడా రాజమండ్రిలో ప్రముఖ న్యాయవాదిగా పేరెన్నిక గన్నారు. తండ్రి చిన్నతనంలోనే మరణించారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పొందిన తరువాత, మద్రాసు లా కాలేజీలో న్యాయశాస్త్రం చదివారు. అక్కడ మంచి క్రీడాకారునిగా రాణించారు. టంగుటూరి ప్రకాశం పంతులుకు జూనియరుగా ఉన్న తన మామయ్య పి. వెంకట రమణారావు నాయుడు వద్ద సుబ్బారావు జూనియర్ గా వృత్తి ప్రారంభించారు. . వెంకట రమణారావు మద్రాసు ఉన్నత న్యాయస్థానంకు జడ్జిగా పదోన్నతి పొందిన తర్వాత, సుబ్బారావు తన బావమరిది పి.వి.రాజమన్నార్ తో కలిసి ప్రాక్టీసు కొనసాగించారు. రాజమన్నార్ ఆ తరువాతి కాలంలో అడ్వకేట్ జనరల్, తర్వాత మద్రాసు ఉన్నత న్యాయస్థానం యొక్క ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. వీరిద్దరు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రధాన కేసులన్నీ చేపట్టారు. 1948లో సుబ్బారావు బెంచికి నియమించ బడ్డారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజాజీ, సీనియర్ జడ్జి అయిన గోవింద మీనన్ ను 1954లో గుంటూరులో ఏర్పాటు కానున్న ఆంధ్ర రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పంపాలను కున్నారు, అయితే ప్రకాశం పంతులు... హైకోర్టు ఏర్పాటును పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిగా సుబ్బారావే కావాలని పట్టుబట్టిన కారణంగా గుంటూరులో హైకోర్టు ఏర్పాటు అయిన తర్వాత సుబ్బారావు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు సుబ్బారావు హైదరాబాదు లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగారు. 1954లో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపన సమయంలో, సుబ్బారావు విశ్వ విద్యాలయపు తొలి సంచాలకులుగా నియమించ బడ్డారు. విశ్వ విద్యాలయల చట్టాన్ని సవరించి రాష్ట్ర గవర్నరుకు విశ్వవిద్యాలయాల సంచాలక పదవిని పునరుద్ధరించే వరకు సుబ్బారావు ఆ పదవిలో కొనసాగారు. మద్రాసు హైకోర్టులో జడ్జిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తర్వాత 1958 జనవరి 31న ఆయన సుప్రీంకోర్టు జడ్జిగా నియమించ బడ్డారు. 1966 జూన్ 30న కోకా సుబ్బారావు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితుడయ్యారు. ఆయన వ్రాసిన తీర్పులలో ప్రసిద్ధ గోలక్‌నాథ్ – పంజాబ్ రాష్ట్రం కేసు అత్యంత ప్రముఖమైనది. ఈ కేసులో భారత రాజ్యాంగం ఆపాదించిన ప్రాథమిక హక్కులను చట్టసభలు సవరించేందుకు వీలులేదని తీర్పునిచ్చారు. చట్ట సభలకు (పార్లమెంట్ కి) కూడా ప్రాథమిక హక్కులు ఉల్లంఘన చేసే అధికారంలేదని చారిత్రాత్మక తీర్పులో పేర్కొన్నారు. ప్రధాన న్యాయవాది సుబ్బారావు, జస్టిస్ షా, సిక్రి, షిలత్, వైదియలింగంతో కూడిన ధర్మాసనం ఈ తీర్పుని ప్రకటించింది. అలా పౌరుల ప్రాథమిక హక్కుల భంగంకు సంబంధించిన కేసుల విషయం వచ్చినప్పుడల్లా కోకా సుబ్బారావు పేరు గుర్తుకు రాక మానదు. సుబ్బారావు భారత నాలుగవ రాష్ట్రపతి ఎన్నికలలో, ప్రతిపక్ష పార్టీల యొక్క ఏకగ్రీవ అభ్యర్థిగా పోటీ చేయటానికి వీలుగా 1967 ఏప్రిల్ 11న న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. అయితే ఆ ఎన్నికలలో జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి అయిన జాకీర్ హుస్సేన్ చేతిలో ఓటమి చవి చూశారు. సుబ్బారావు మే 6, 1976న బెంగుళూరులో మరణించారు. బెంగుళూరు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. సుమారు 55 ఏళ్ల తర్వాత మరో తెలుగు వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణ కు ఈ అరుదైన అవకాశం లభించడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఒక్క బాంబుతో సిటీ ఖతం.. అయినా వేల టన్నుల అణ్వాయుధాలు ఎందుకు ?



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రెండు దేశాల మధ్య యుద్ధం జరిగే అవకాశం ఉందని కూడా కొందరు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మరోసారి భారత్ మీద అణుదాడి చేస్తామంటూ బెదిరిస్తోంది. ఒకవేళ భారత్ దాడి చేస్తే తాము అణుబాంబులు ఉపయోగిస్తామని పదే పదే హెచ్చరిస్తోంది. ఒకవేళ నిజంగా యుద్ధం జరిగితే దాని ఫలితాలు ఊహించలేనంత భయంకరంగా ఉండనున్నాయి. భారత్, పాకిస్తాన్ రెండూ అణ్వాయుధాలు కలిగిన దేశాల జాబితాలో ఉన్నాయి.ఈ రెండు దేశాల వద్ద అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల అనేక క్షిపణులు ఉన్నాయి. ఈ క్షిపణులు రెండు దేశాలలోని అనేక నగరాలను టార్గెట్ చేయగలవు. ఒకవేళ భారత్, పాకిస్తాన్ ఈ క్షిపణులను ఉపయోగిస్తే భారీ విధ్వంసం జరుగుతుంది.

**కేవలం 9 దేశాల వద్దే అణుబాంబులు...** భారత్ , పాకిస్తాన్‌తో సహా ప్రపంచంలో కేవలం తొమ్మిది దేశాల వద్ద మాత్రమే అణ్వాయుధాలు ఉన్నాయి. అవి..రష్యా, అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, భారత్, పాకిస్తాన్, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్. ఈ దేశాల వద్ద మొత్తం 12,121 అణ్వాయుధాలు ఉన్నాయి. వాటిలో రష్యా వద్ద అత్యధికంగా 5580 అణ్వాయుధాలు ఉన్నాయి. ఈ జాబితాలో అమెరికా రెండో స్థానంలో ఉంది. దాని వద్ద 5044 అణ్వాయుధాలు ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం అణ్వాయుధాలలో 90 శాతం రష్యా, అమెరికా వద్దనే ఉన్నాయి.

**ఒక్క బాంబుతో నగరం బూడిద....** అణుబాంబులను ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలుగా చెబుతారు. చివరిసారిగా ఈ బాంబును రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా జపాన్‌పై ఉపయోగించింది. ఆ దాడిలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పూర్తిగా నాశనమయ్యాయి. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నేడు ప్రపంచంలోని ఈ తొమ్మిది దేశాల వద్ద రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన అణుబాంబుల కంటే ఎన్నో రెట్లు శక్తివంతమైన అణ్వాయుధాలు ఉన్నాయి. ఇవి ఒక్క క్షణంలో ఒక పెద్ద నగరాన్ని కూడా బూడిద చేయగలవు.

**వేల సంఖ్యలో అణుబాంబులు ఎందుకు?...** ఒక్క బాంబుతోనే ఒక నగరం నాశనమైపోతే ప్రపంచంలోని కొన్ని దేశాలు వేల సంఖ్యలో అణుబాంబులు ఎందుకు తయారు చేశాయి అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతుంది. ప్రస్తుతం అమెరికా, రష్యా వద్ద మాత్రమే 5000 కంటే ఎక్కువ బాంబులు ఉన్నాయి. తర్వాత చైనా వస్తుంది. దాని వద్ద 500 అణ్వాయుధాలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో అణుబాంబులను తయారు చేయడానికి ప్రధాన కారణం అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య చాలా కాలంగా కొనసాగిన ఆధిపత్య పోరు.

ఈ రెండు దేశాలు ప్రపంచంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పెద్ద మొత్తంలో అణ్వాయుధాలను తయారు చేశాయి. అయితే, ఈ బాంబుల వల్ల జరిగే విధ్వంసాన్ని చూసిన తర్వాత ఇప్పుడు ఏ ఇతర దేశానికి కూడా అణుబాంబులు తయారు చేయడానికి అనుమతి లేదు.

# సింధూ జలాలపై పాక్‌కు పరిమిత ఆప్షన్లే..!



పహల్గాంలో అమాయకులపై ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఈ చర్యలను ఏమాత్రం ఊహించని పాక్ షాక్‌కు గురైంది. 1960లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగ్గా.. 1965, 71, 99ల్లో యుద్ధాలు, సైనిక ఘర్షణలు చోటుచేసుకొన్నాయి. అయినా భారత్ ఈ ఒప్పందంలో కొనసాగింది. కానీ తాజా చర్యలతో పాక్‌లో ఆందోళన నెలకొంది. ఈ జలాలను మళ్లించడం లేదా ఆపడం చేస్తే.. దాన్ని యుద్ధానికి కవ్వింపు చర్యగా పరిగణిస్తామంటూ బీరాలు పలుకుతోంది.

**పాక్‌కు పరిమిత ఆప్షన్లు..** భారత్ నిర్ణయంతో పాకిస్థాన్ ఎదుట ఇప్పుడు ఆప్షన్లు పరిమితంగానే ఉన్నాయి. తాజాగా దీనిపై ఆ దేశ న్యాయశాఖ మంత్రి అకీల్ మాలిక్ స్పందించారు. న్యాయపోరాటం చేసేందుకు మూడు ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించారు. ఈ ఒప్పందం కుదిర్చిన ప్రపంచ బ్యాంకు వద్దకు కూడా వెళ్లే అంశం కూడా దానిలో ఉందని పేర్కొన్నారు. తొలుత భారత్ నిర్ణయాన్ని పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ లేదా అంతర్జాతీయ న్యాయస్థానం (హేగ్)లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. దీనికి భారత్ అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒడంబడికను ఉల్లంఘించినట్లు సాకు చెప్పవచ్చు. న్యాయ వ్యూహంపై ఇప్పటికే చర్చలు దాదాపు పూర్తయ్యాయని పాక్ మంత్రి మాలిక్ వెల్లడించారు. త్వరలోనే ఏ కేసులు దాఖలు చేయాలనే దానిపై నిర్ణయానికి వస్తామన్నారు. ఈ మూడో ఆప్షన్ కింద.. దౌత్యపరంగా ఈ అంశాన్ని ఐరాస భద్రతా మండలిలో లేవనెత్తే అవకాశం ఉందని మాలిక్ పేర్కొన్నారు. అన్ని బలమైన వేదికల పైకి ఈ అంశాన్ని తీసుకెళ్లే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఒప్పందం ఏకపక్షంగా నిలిపివేయడం ఏమాత్రం కుదరదని మాలిక్ వెల్లడించారు. ఆ ఒడంబడిక రద్దుకు సంబంధించి ఎటువంటి క్లాజ్ లేదని పేర్కొన్నారు.

**పాక్ ఆప్షన్లు పని చేస్తాయా..?...** అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుటకు పాక్ వెళ్లే అవకాశాలు దాదాపుగా లేవు. ఎందుకంటే ఐసీజే పరిధిలోకి వెళ్లాలంటే.. ఆయా దేశాల అంగీకారం తప్పనిసరి. ఇది పూర్తి లేదా పరిమిత అంగీకారం కావచ్చు. ఇందుకు ఆ దేశం తీర్మానం చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ నియమ నిబంధనల క్రమాన్ని పాటించే భారత్.. ఈ అంశాలకు సంబంధించి ఐసీజే చట్టపరిధికి కట్టుబడి ఉంటామని ఆమోదిస్తూ 27 సెప్టెంబర్ 2019లో డిక్లరేషన్ ఇచ్చింది కానీ, దీనికి 13 మినహాయింపులను తీసుకొంది. ఈమేరకు మన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. 13 మినహాయింపుల్లోనే ఓ మెలిక ఉంది. కామన్‌వెల్త్ గ్రూపులోని దేశాలతో వివాదాలు ఏర్పడితే మాత్రం.. అవి ఐసీజే పరిధిలోకి రావని నాడు పేర్కొంది. పాకిస్థాన్‌కు కామన్‌వెల్త్‌లో సభ్యత్వం ఉంది. దీంతో ఆ దేశంతో వివాదం ఐసీజే పరిధిలోకి రాదు. ఇస్లామాబాద్ ఆ దిశగా చేసే ప్రయత్నాలు వృథా అవుతాయి. దీనికితోడు సాయుధ ఘర్షణలు, ఆత్మరక్షణ కోసం సమష్టి చర్యలు తీసుకొనే వేళ, దౌర్జన్యాలను అడ్డుకొనేటప్పుడు, తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన బాధ్యతలు వంటి పలు అంశాల్లో కూడా ఐసీజే పరిధి చెల్లదని వెల్లడించింది. దీంతో పాక్ అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లినా ఒరిగేది ఏమీ ఉండదు.

**ప్రపంచ బ్యాంక్ ఎందుకు జోక్యం చేసుకోదు..** భారత్–పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందాన్ని మధ్యవర్తిగా వ్యవహరించి కుదిర్చింది ప్రపంచ బ్యాంక్. కానీ, దానికి చట్టబద్ధమైన పాత్ర ఏమీ లేదు. అంతేకానీ ఒప్పందాన్ని అమలుచేసే అధికారం లేదు.

ఏమైనా అభిప్రాయభేదాలు వస్తే.. చర్చలకు మాత్రమే ప్రోత్సహించగలదు. తటస్థ నిపుణుల నియామకం, కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఛైర్మన్లను నియమించడం వరకే దాని పాత్ర పరిమితం. లేకపోతే.. వివాద పరిష్కార వ్యవస్థను ప్రపంచ బ్యాంక్ ఏర్పాటుచేసే అవకాశం ఉంది. కానీ, సూచనలు, సిఫార్సులకు భారత్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

# 9-5 జాబ్ చేస్తూ 108 దేశాలు చుట్టేసిన టెకీ

సాధారణంగా 9–5 ఫుల్ టైమ్ ఉద్యోగం అంటే ఇక ప్రయాణాలకు, వ్యక్తిగత ఆసక్తులకు సమయం దొరకడం కష్టమని చాలామంది భావిస్తారు. వారాంతాలు, సెలవులు కుటుంబంతోనో, విశ్రాంతి తీసుకోవడానికో సరిపోతాయని అనుకుంటారు. కానీ తమిళనాడుకు చెందిన ఓ టెకీ ఈ అభిప్రాయాన్ని మార్చేసింది. పక్కా ప్లానింగ్‌తో ఫుల్ టైమ్ జాబ్ చేస్తూనే ఏకంగా 108 దేశాలు చుట్టేసి, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. ఆమే అంకితా రాజేంద్రన్. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న అంకితకు చిన్నప్పటి నుంచి ప్రపంచం చుట్టేయాలని కల. ఆ కలను నెరవేర్చుకోవడం కోసం ఆమె ఉద్యోగాన్ని వదులుకోలేదు, సమయం వస్తుందని ఎదురుచూడలేదు. బదులుగా, తెలివిగా ప్లాన్ చేసుకుంది. తన ఆదాయంలో దాదాపు 30 శాతాన్ని ప్రయాణాల కోసమే కేటాయించుకుంది అంకిత. వచ్చిన ప్రతి లాంగ్ వీకెండ్‌ను, దొరికిన ప్రతి సెలవును ట్రావెలింగ్‌కు ఉపయోగించుకుంది. ఇలా ఒక్కో అడుగు



వేస్తూ ఏకంగా 7 ఖండాల్లోని 108 దేశాలను సందర్శించింది. ఉద్యోగం తన ట్రావెలింగ్ ప్యాషన్‌కు అడ్డుకాదని, సరిగ్గా ప్రణాళిక వేసుకుంటే రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చని ఆమె నిరూపించింది. ప్రయాణాలపై తనకున్న దృక్పథాన్ని పంచుకుంటూ, వాటిని ఏదో ఒక రోజు దొరికే 'రివార్డ్' లా కాకుండా, తమ జీవితంలో ఓ 'ప్రాధాన్యత'గా గుర్తించాలని అంకిత సూచిస్తోంది. పెద్దగా సమయం దొరికే వరకు ఎదురుచూడకుండా, చిన్న చిన్న ప్లాన్‌లతో, స్మార్ట్‌గా ప్రయాణాలను ప్రారంభించాలని ఆమె చెబుతోంది. అంకిత ప్రయాణ కథ ఉద్యోగం చేస్తూ కూడా తమ కలలను, అభిరుచులను ఎలా కొనసాగించవచ్చో చెప్పడానికి ఓ గొప్ప ఉదాహరణ. ఆమె అనుభవం స్పష్టం చేసేదేమిటంటే.. ప్యాషన్ ఉంటే దానికి సమయం కేటాయించడం పెద్ద కష్టమేమీ కాదు. పక్కా ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ, దొరికిన సమయాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా ఉద్యోగం చేస్తూనే ప్రపంచాన్ని చుట్టేయాలన్న కలను కూడా నిజం చేసుకోవచ్చు.

# పాకిస్తాన్ గగనతల నిషేధం

## హైదరాబాద్, దక్షిణాది నగరాలకు నో ఎఫెక్ట్

పహల్గామ్ దాడి నేపథ్యంలో పాకిస్తాన్ విధించిన ఆంక్షల కారణంగా ఎయిర్ ఇండియా ఉత్తర అమెరికాకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. దేశంలోని మరో నగరానికి విమానం నడిపి, పై ఉత్తర అమెరికా రాష్ట్రాలకు వెళ్లే అవకాశాన్ని పరిశీలిస్తోంది. దీనివల్ల పాకిస్తాన్ గగనతలాన్ని నివారించే ఖర్చు తగ్గుతుందని వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఉత్తర అమెరికాకు 71 విమానాలను నడుపుతోంది. వీటిలో 54 సర్వీసులు ఢిల్లీ నుండి బయలుదేరుతాయి. కంపెనీ ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నట్లు తెలియజేసింది. ఇతర దేశాలలో టెక్–స్టాప్‌లను తగ్గించి, యుఎస్ కు మరిన్ని నాన్–స్టాప్ విమానాలను ప్రవేశపెట్టాలని చూస్తున్నట్లు పేర్కొంది. ఢిల్లీ , ఉత్తర నగరాల నుండి బయలుదేరే అన్ని విమానాలు అరేబియా మహాసముద్రం మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల సమయం , ఖర్చులు పెరుగుతున్నాయి. న్యూఢిల్లీ నుండి వెళ్లే విమానాలు ముంబై లేదా అహ్మదాబాద్‌ను టెక్–స్టాప్‌లుగా తీసుకుంటే, యూరోపియన్ నగరాల్లో ఆగాల్సిన అవసరం ఉండదని వార్తలు వస్తున్నాయి. అందుకే




ఎయిర్ ఇండియా ఈ అవకాశాన్ని పరిశీలిస్తోంది. పాకిస్తాన్ గగనతలం మూసివేయబడటంతో ఎయిర్ ఇండియా రూ. 5200 కోట్ల నష్టాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇతర భారతీయ విమానయాన సంస్థలు ప్రతి నెలా అదనంగా రూ. 306 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. యాదృచ్ఛికంగా పాకిస్తాన్ భారతీయ విమానయాన సంస్థల కోసం తన గగనతలాన్ని మూసివేసింది. అయితే అంతర్జాతీయ విమానయాన సంస్థలు స్వచ్ఛందంగా ఇతర విమాన మార్గాల కోసం చూడాలని నిర్ణయించుకున్నాయని చెబుతున్నారు. దీనివల్ల పాకిస్తాన్ తన గగనతలాన్ని ఉపయోగించుకున్నందుకు వాటి నుండి పొందే మిలియన్ల డాలర్లను కోల్పోతుంది. 2019లో పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసివేసినప్పుడు అది 10 కోట్ల డాలర్లను కోల్పోయింది. గత రెండు రోజులలో లుఫ్తాన్స, బ్రిటిష్ ఎయిర్‌వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఐబీఎ, లాట్ ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఇది ప్రయాణానికి అదనంగా ఒక గంట సమయం తీసుకుంటుంది. ఇంధన ఖర్చులను ప్రయాణీకులు భరిస్తున్నారు. పాకిస్తాన్ కూడా భారతదేశం తన గగనతలాన్ని మూసివేయడంతో సమస్యలను ఎదుర్కొంటోంది. కౌలాలంపూర్ విమానం 5.30 గంటలకు బదులుగా 8.30 గంటలు పడుతుంది. బంగ్లాదేశ్ , శ్రీలంకకు కూడా ఎక్కువ మార్గాలను తీసుకోవలసి వస్తుంది. అయితే భారతదేశంలోని ఉత్తర నగరాలకు ఈ సమస్య ఎక్కువ. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై , అహ్మదాబాద్ నుండి బయలుదేరే విమానాలు ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇక్కడి నుంచి బయలు దేరే విమానాలు పాకిస్తాన్ మీదుగా వెళ్లవు.. ఇటు అరేబియా సముద్రం.. ఇటు బంగాళాఖాతం నుంచి వెళతాయి కాబట్టి పాకిస్తాన్ గగనతల నిషేధం దక్షిణాది నగరాలపై ఎలాంటి ప్రభావం చూపించదు. సో ఎయిర్ ఇండియా కూడా అమెరికా సహా వివిధ నగరాలకు ఇక నుంచి ముంబై, అహ్మదాబాద్, దక్షిణాది నగరాల నుంచే ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

# ఆ పురుగులను ఏరిపారేయాలి : గణపతి సచ్చిదానంద స్వామి

అనంతపురం జిల్లా: భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలన్న దృష్టి కేంద్రానికి ఉన్నట్లు తెలుస్తోందని.... ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి తన ఆశీస్సులు అంటూ ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో, దేశ సరిహద్దుల్లో పురుగులు ఉన్నాయని, అన్నింటినీ ఏరి వేయాలని అన్నారు. మనల్ని రక్షించుకోవాలంటే చీడపురుగులకు పురుగుల మందు కొట్టాల్సిందేనన్నారు. మనదేశమే కాదు ప్రపంచంలో ఎక్కడా ఉగ్రవాదం ఉండకూడదని ఆయన ఆకాంక్షించారు. ధర్మం ఆధారంగా చంపడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే శక్తి దేశ పౌరులందరికీ కల్పించాలని... శాంతి కలగాలని కోరుకుంటున్నానని అన్నారు. ఉగ్రవాదులకు శిక్ష పడుతుందని... ఇవాళ దేశానికి పటిష్టమైన నాయకత్వం ఉందని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు.

**జయలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు..** కాగా రాప్తాడు మండలంలోని బుధవారం బొమ్మేపర్తి గ్రామంలో వెలసిన జయలక్ష్మీ మాత విగ్రహానికి శ్రీ గణపతి సచ్చి దానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి బొమ్మేపర్తి ఆశ్రమంలో జయలక్ష్మీ మాత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా గణపతి సచ్చిదానందస్వామి జయలక్ష్మి మాతకు పలు రకాలు పూజలు చేశారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. జయలక్ష్మి పురం గ్రామంలో బుధవారం (ఏప్రిల్ 30వ తేదీ) నుంచి మే 4వ తేదీ వరకు శ్రీ జయలక్ష్మీ మాత జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి పాల్గొంటారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

# చురకలు

## సంపాదకీయం

### మోడీ అభిమానం...ఎన్టీఆర్ కి అరుదైన గౌరవం

దేశ ప్రధాని నరేంద్ర మోడీకి పెద్దలు అంటే ఎంతో గౌరవం. బీజేపీలో ఆయన వాజ్ పేయి ఎల్ కే అద్వానీ శిష్యుడిగా ఉంటూ అంచెలంచెలుగా పైకి వచ్చారు. మోడీ అలాగే దేశంలో ఇతర పార్టీలకు చెందిన ప్రముఖులను కూడా గుర్తు పెట్టుకుని వారిని సైతం గౌరవిస్తారు. ఆయా సందర్భాలలో వారి సేవలను గుర్తు తెచ్చుకుని ప్రస్తుతిస్తారు. అంతే కాదు వారి గురించి సభలలో గొప్పగా చెబుతారు. సరైన సమయంలో వారికి పౌర పురస్కారాలను అందచేస్తారు. ఇక నరేంద్ర మోడీ పూర్తి స్థాయిలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినప్పటికే ఎన్టీఆర్ ఈ లోకం నుంచి నిష్క్రమించారు. ఆయన 1996లో కన్ను మూసే నాటికి మోడీ గుజరాత్ లో బీజేపీకి కీలకంగా పనిచేస్తున్నారు. మోడీ తెర వెనక వ్యూహాలను రచిస్తూ బీజేపీని సొంత రాష్ట్రంలో నిలబెడుతూ అనూహ్యంగా 2001లో గుజరాత్ సీఎం గా ఒకేసారి అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు. ఇక మోడీ 2013లో జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన 2014 ఎన్నికల ప్రచారం కోసం తెలుగు రాష్ట్రాలకు వచ్చినపుడు తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ని మనసారా తలచుకున్నారు. కాంగ్రెస్ ప్రాభవాన్ని దక్షిణాదిన ఎదురొడ్డి నిలిచిన మొనగాడుగా కూడా అభివర్ణించారు. అలాగే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కి వ్యతిరేకంగా విపక్షాన్ని కూడగట్టడంలో ఎన్టీఆర్ పాత్ర చాలా కీలకంగా ఉందని అనేక సార్లు చెప్పారు. తాజాగా అమరావతి సభలో సైతం ఎన్టీఆర్ గురించి చెబుతూ మోడీ ఆయన ఆశయాలను నెరవేరుస్తామని అన్నారు. ఇలా సమయం సందర్భం వచ్చినపుడల్లా ఎన్టీఆర్ ని కొనియాడుతున్న మోడీ ఆయనకు అరుదైన గౌరవాన్ని అందిస్తారా అన్న చర్చ మొదలైంది. ఎన్టీఆర్ సినీ నటుడిగానే కాదు రాజకీయ నేతగా సంచలనాలు సృష్టించారు. ఆయన చిరస్మరణీయమైన సేవలను తెలుగు జాతికి అందించారు. వారి ముద్దు బిడ్డగా నిలించారు. అలాగే నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా జాతీయ స్థాయిలో కూడా తన రాజకీయ నాయకత్వాన్ని రుజువు చేసుకున్నారు. అటువంటి అన్న గారికి భారత రత్న ఇవ్వాలన్నది అందరి కోరిక. ఆయన మరణించి మూడు దశాబ్దాలకు దగ్గర అవుతోంది. ఆయన భారత రత్నకు అన్ని విధాలుగా అర్హులు అని అంతా అంటారు. అయితే అన్న గారు మరణించిన తరువాత కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పదమూడేళ్లు మాత్రమే అధికారంలో ఉంది. మిగిలిన సమయం అంతా ఎన్డీయే ప్రభుత్వమే కేంద్రంలో పవర్ లో ఉంది. అందులో వాజ్ పేయి సర్కార్ ఆరేళ్ళు ఉంటే మోడీ ప్రభుత్వం పదకొండేళ్ళుగా ఉంది. మరో వైపు చూస్తే ఎన్డీయే ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కూడా కీలక భాగస్వామిగా ఉంటూ వస్తోంది. అయినా అన్న గారికి భారత రత్న బహుదూరంగానే ఉంది. అయితే భారత రత్నను ఆయనకు ప్రకటించాలని అంతా ముక్త కంఠంతో కోరుతున్నారు. తాజాగా చూస్తే అమరావతి పర్యటనలో సైతం మోడీ అన్న గారిని తలచుకుని పులకించిపోయారు. దాంతో ఈసారి భారత రత్న పురస్కారం తప్పకుండా ఆయనకు దక్కుతుందని అంతా భావిస్తున్నారు. ఏపీలో టీడీపీ ఉంది కేంద్రంలో బీజేపీ మనుగడకు టీడీపీ ఎంపీలే కారణంగా ఉన్నారు. ఇక బీజేపీ ఏపీ ప్రెసిడెంట్ గా దగ్గుబాటి పురంధేశ్వరి ఉన్నారు. ఒక విధంగా ఏపీలో అన్న గారి అభిమానులందరినీ ఆకర్షించేందుకు కూడా ఇదే సరైన సమయం అని అంటున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సహా అంతా ఎన్టీఆర్ కి అరుదైన గౌరవం ఇవ్వాలని గట్టిగా కోరుతున్నారు. దాంతో ఈసారి భారత రత్న ఆయనకు ఇచ్చేందుకు నరేంద్ర మోడీ సుముఖంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఎపుడు భారత రత్న పురస్కారాలు ప్రకటించినా అందులో ఒక పేరుగా ఎన్టీఆర్ ది ఉంటుందని అంటున్నారు. ఇక్కడ ఒక విషయం ఉంది ఎన్టీఆర్ కి భారత రత్న అంటే అది తెలుగు జాతికే గౌరవం. అంతా ఆనందిస్తారు. దేశ విదేశాలలో విస్తరించిన 18 కోట్ల మంది తెలుగు వారికే ఆ అవార్డు దక్కుతుంది. సో కేంద్రం ఈసారి ఆ దిశగా అడుగులు వేసి అన్న గారిని భారత రత్న చేస్తుందని అంతా నమ్ముతున్నారు.

## దీర్ఘ కాలిక పార్లమెంటేరియన్ అజిత్ సింగ్ - మే 6... చౌదరి అజిత్ సింగ్ వర్ధంతి



మాజీ ప్రధాన మంత్రి చరణ్ సింగ్ రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సీనియర్ రాజకీయ నాయకుడు చౌదరి అజిత్ సింగ్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ భాగంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అయిన రాష్ట్రీయ లోక్‌దళ్ వ్యవస్థాపకులు. పలుమార్లు కేంద్రమంత్రి. అజింత్ ఉన్నత చదువులు చదువుకున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్, చికాగోలోని ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యను అభ్యసించారు. , జాట్ ఆధిపత్య పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో ఆర్ఎల్‌డి సంబంధిత శక్తివంతమైన నేతగా ఎదిగారు. రాజకీయాల్లోకి వచ్చే ముందు అజిత్ సింగ్ అమెరికాలో కంప్యూటర్ పరిశ్రమలో 15 సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత తండ్రి అడుగు జాడల్లో రాజకీయాల్లోకి వచ్చారు. అజిత్ సింగ్ 1986 లో తన తండ్రి, మాజీ ప్రధాని చరణ్ సింగ్ అనారోగ్యానికి గురైన తరువాత తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1987 మరియు 88 లో ఆయన లోక్‌దళ్(ఏ) మరియు జనతా పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. అజిత్ సింగ్ భాగ్‌పట్ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందారు. 1989 లో ఆయన తొలిసారిగా కేంద్ర కేబినెట్ మంత్రివర్గంలో చేరారు. దీంతోపాటు 1995, 2001 మరియు 2011 లోనూ ఆయన కేంద్ర మంత్రిగా సేవలందించారు. కాంగ్రెస్, బీజేపీలో పొత్తుపెట్టుకొని ఏదో విధంగా కేంద్రంలో పలు మార్లు కేంద్రమంత్రిగా అజిత్ సింగ్ పనిచేశారు. మొదట విపీ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా సేవలందించారు. ఆ తర్వాత పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆహార శాఖ మంత్రిగా పనిచేశారు. 1996లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి.. ఆర్ఎల్డీ పార్టీని స్థాపించారు. అనంతరం ఎన్డీయేలో చేరారు. 2001లో వాజ్‌పేయీ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. 2003 మేలో ఎన్డీయే నుంచి బయటకు వచ్చి.. మళ్లీ కాంగ్రెస్‌తో జతకట్టారు. రాష్ట్రీయ లోక్‌దళ్ (%=ాణ%) పార్టీ అధినేత చౌధరి అజిత్ సింగ్ కరోనాతో మరణించారు. 82 ఏళ్ల అజిత్ సింగ్ ఏప్రిల్ 22న కరోనా బారినపడ్డారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో వైద్యుల సలహా మేరకు గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతన్న క్రమంలో ఊపరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ పెరిగి పోయింది. పరిస్థితి విషమించడంతో అజిత్ సింగ్ 6 మే, 2021, గురువారం ఉదయం 8.20 గంటలకు కన్నుమూశారు. ఆయన కుమారుడు జయంత్ చౌదరి... తాత చరణ్ సింగ్, తండ్రి అజిత్ సింగ్ ల రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని , ఉత్తర ప్రదేశ్ లోని మధుర నుండి 15 వ లోక్ సభకు ఎన్నికైనారు. 2014లో ప్రముఖ నటి హేమామాలిని చేతిలో పరాజయం పాలయ్యారు. రాష్ట్రీయ లోక్‌దళ్ ఉపాధ్యక్షులుగా ఉన్నారు. రైతు సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## జంతువుల హక్కులను పరిరక్షించాలి - మే 6...ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవం.


మానవులకు పెంపుడు జంతువులు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. కొద్దిపాటి ప్రేమాభిమానాలకు, సంరక్షణకే పెంపుడు జంతువులు ప్రేమను, విశ్వాసాన్నీ కలిగి ఉంటాయి. పెంచే వారినే సర్వస్వంగా భావిస్తాయి. అవి మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలుగజేస్తు, కుటుంబంలో సభ్యులుగా మారి చేదోడువాదోడుగా నిలుస్తున్నాయి. ఒక రకంగా వ్యాయామాన్ని, ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాధమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. కుక్క, పిల్లి, చేపలు, పక్షులు - ఏవైనా మనం పెంచే మూగజీవాలను ప్రేమగా చూసుకోవాలి. వాటికి అధికంగా స్వేచ్ఛ కల్పించాలి. విశాలమయిన తిరుగాడే సౌకర్యాన్ని కలిగించాలి. పెంపకంలో జాగ్రత్తలు తీసుకుని, వాటిని సంతోషంగా ఉంచుతూ మచ్చిక చేసుకోవాలి. పెంపుడు జంతువుల నివాస, తిరుగాడే స్థలాలను, ఉపయోగించే వస్తువులను శుభ్రపరచాలి. వాటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జంతువులకు ముందు జాగ్రత్తగా టీకామందులు వేయించడం, నిర్లక్ష్యం వహించక, క్రమం తప్పకుండా వాటిని పశు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళడం విధిగా చేయాలి. జంతువుల పట్ల ప్రేమ, ముద్దు మురిపాలు పరిమితులు దాటరాదు. కానీ వాటితో మూతులు, ముక్కులు నాకించుకోవడం, అస్తమానం అంటిపెట్టుకుని ఉండడం మంచిది కాదు. కొన్నిచోట్ల పెంపుడు జంతువుల పట్ల ఎలా




మసలు కోవాలనే అంశంపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే...మాంసం కోసం, వినోదం కోసం కొందరు అనేక రకాలుగా జంతువులకు కష్ట నష్టాలు కలిగిస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతు వులను ఉపయోగించు కుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం, అలాగే కొన్నింటిని పోటీల్లో గెలుపు కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువుల పట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన పలు ప్రాయోజితాలైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, మానవీయ కోణంలో చూడడం, తగిన స్వేచ్ఛ కల్పించడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియ జేయడం అవసరం, అనివార్యం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## సినీ సరస్వతీ ప్రియ పుత్రుడు...పింగళి నాగేంద్రుడు - మే 6...పింగళి నాగేంద్రరావు వర్ధంతి




పింగళి నాగేంద్రరావు ... తెలుగు సినిమా రంగంతో విడదీయరాని బంధం, సంబంధం అనుబంధం ఉన్న గొప్ప రచయిత. తెలుగు సినిమా రచయిత మాత్రమే కాదు. పాత్రికేయుడు, నాటక రచయిత కూడా. కృష్ణా పత్రిక, శారద పత్రికల్లో ఆయన ఉపసంపాదకుడుగా పనిచేసారు. వింధ్య రాణి, నా రాజు, జేబున్నీసా, మేవాడు రాజ్య పతనం, క్షాత్ర హిందు, నా కుటుంబం, గమ్మత్తు చావు తదితర నాటకాలు ఆయన రాసినవే. అయన ఒక రచయితగా తెలుగు సినీ రంగానికి చేసిన సేవ మరిచి పోలేనిది. సినిమా సంభాషణలలో కొత్త హాస్య పదాలు సినిమాలలో కొత్త పాత్రలు సృష్టించి మరెన్నో ప్రయోగాలు చేసి సినీ సాహిత్య స్వరూపాన్ని మార్చివేసిన సినీ సరస్వతీ పుత్రుడు. జానపదమైనా, పౌరాణికమైనా, సాంఘికమైనా జానపదులు సైతం మెచ్చే సరళ భాషను ఉపయోగించిన సినీ ఆదికవి. "సాహసం శాయరా డింభకా", "చూపులు కలిసిన శుభవేళ", "లాహిరి లాహిరి లాహిరిలో", "అహ నా పెళ్ళంట" వంటి సినిమాల పేర్లు పింగళి పాటల్లోనుంచి తీసుకున్నవే. 1939లో తీసిన గుణ సుందరి సినిమాలో పింగళి రాసిన 'శ్రీతులసి ప్రియతులసి జయమునీయవే' పాట నేటికీ మంగళ హారతి గా పాడుకోవడం వింటూనే ఉన్నాం. పింగళి నాగేంద్రరావు 29 డిసెంబరు 1901న శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో జన్మించారు. నాగేంద్రరావు తండ్రి గోపాలకృష్ణయ్య, తల్లి మహాలక్ష్మమ్మ. పింగళి బాల్యం, విద్యాభ్యాసం మచిలీపట్నంలోనే జరిగింది. పింగళి చిన్నతనంలోనే సాహిత్యంతోబాటు వృత్తి విద్యలను కూడా అధ్యయనం చేశారు. పింగళి లోని సాహిత్య పిపాసను గమనించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, మట్నూరి కృష్ణారావు పింగళిని ప్రోత్సహించారు. 1917లో పింగళి మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లొమా తీసుకున్నారు. తరవాత మచిలీపట్నంలోనే కొంతకాలం ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1918లో ఖరగ్పూర్ రైల్వే వర్క్ షాపులో అప్రెంటీసుగా చేరారు. ప్రముఖ యోగా గురువు బులుసు రామజోగారావు ఉపన్యాసాలకు ప్రభావితుడై 1920లో రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పింగళి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన దివ్యజ్ఞాన సమాజం (థియోసాఫికల్ సొసైటీ) సభ్యుడిగా నమోదై ఉత్తర భారత దేశ మంతా పర్యటించి సబర్మతీ ఆశ్రమంలోచేరి బ్రహ్మచర్యం పాటించాలని నిర్ణయించుకుని జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోయారు. కొంతకాలం కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారు. అప్పుడే 'జన్మభూమి' అనే దేశభక్తి పద్యకావ్యాన్ని రచించారు. ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వాధికారులకు ఆగ్రహానికి గురై, పింగళి జైలు పాలు కావాల్సి వచ్చింది. విడుదలయ్యాక పట్టాభి సీతారామయ్య సలహా మేరకు 1923లో 'శారద' అనే పత్రికకు సహసంపాదకుడుగా చేరి తన సాహిత్య రచనా వ్యాసంగం మీద దృష్టి సారించారు. అదే సమయంలో బెంగాలి నాటకకర్త డి.ఎల్.రాయ్ రచించిన 'మేవార్ పతన్', 'పాషాణి' నాటకాలను తెలుగులోకి అనువదించారు. అనువాద నాటకాలు కృష్ణాపత్రికలో ధారావాహికలుగా వెలువడ్డాయి. అదే స్ఫూర్తితో 'జేబున్నీసా', 'వింధ్యరాణి', 'నారాజు', 'క్షాత్రహిందూ', 'ఒకే కుటుంబం' వంటి నాటకాలను రాసి నాటక రచయితగా మంచి పేరు సంపాదించారు. వాటిలో 'ఒకే కుటుంబం' నాటక రచనకు 1939లో నవ్యసాహితి సమితి సంస్థ ఉత్తమ నాటక రచనా బహుమతిని ప్రదానం చేసింది. విజయా సంస్థకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం ఆస్థాన కవిగా భాసిల్లిన సాహిత్య వేత్త పింగళి. 1955 లో మిస్సమ్మలో లీల పాడిన రావోయి చందమామ మా వింత గాథ వినుమా, ఏమిటో ఈ మాయ ఓ చల్లని రాజా వెన్నెల రాజా అనే పాటలు ఇప్పటికీ బహుళ వ్యాప్తంగా ఉన్నాయి. మిస్సమ్మ పాత్రకోసం పింగళి ఆత్మాభిమానం, పెంకితనం, తలబిరుసుతనంతో కూడిన సంభాషణలు రచించారు. పాండవుల వేషాలకు తగిన వారు దొరక లేదని, పాండవుల ప్రస్తావన అడుగడునా వస్తూనేవున్నా వారు తెరమీద కనపడకుండా పింగళి చిత్రకథను రూపొందించి హిట్ చేసిన పౌరాణిక సినిమా 'మాయాబజార్'. భారతీయ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా సి ఎన్ ఎన్, ఐ బి ఎన్ సంస్థ వంద ఆల్ టైం గ్రేట్ భారతీయ సినిమాల గుర్తింపుకోసం సర్వే నిర్వహిస్తే, మాయాబజార్ సినిమా ప్రథమ స్థానంలో నిలిచింది. ఘటోత్కచ రాక్షస గణం లోని గురువు పేరును చినమయ అని నామకరణం చేశాడు. పింగళి... "మాయ" తెలుగు పదానికి 'బజార్' అనే ఉర్దూ పదం చేర్చి పౌరాణిక చిత్రానికి మకుటంగా పెట్టడం, ఎక్కడా 'బజార్' అనే పదాన్ని చిత్రంలో రానీయకుండా జాగ్రత్తపడడం పింగళి రచనా సామర్థ్యానికి ఉదాహరణ. ఈ సినిమా అద్భుత విజయాలను నమోదు చేసిన విషయం అవగతమే. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో యేకకాలంలో నిర్మించిన సంగతి కూడా తెలిసిందే. ఈ సినిమాలో సత్యపీఠం, ప్రియదర్శిని, తస్మదీయులు, దుష్టచతుష్టయము, జియ్యా, వీరతాళ్ళు, రత్నగింబళి, గిల్పం, శాకంబరీ దేవి ప్రసాదం వంటి కొత్త పదాలను పింగళి ప్రవేశపెట్టారు. 'ఎవరూ కనిపెట్టకుండా మాటలెలా పుడతాయి' అంటుండే వారు. 'రసపట్టులో తర్కం కూడదు', 'భలే మామా భలే', 'ఇదే మన తక్షణ కర్తవ్యము' వంటి మాటల్ని కూడా ప్రయోగాత్మకంగా వాడగా, నేటికీ అవి వాడుకలో వుండటం విశేషం.. 1958లో పింగళి నాగేంద్రరావు జయంతి సంస్థ కె.వి.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రానికి, 1960 లో సారణీ వారి 'మహాకవి కాళిదాసు' సినిమాకి కథ, మాటలు, పాటలు సమకూర్చారు. 1959లో విజయావారి 'అప్పుచేసి పప్పుకూడు' సాంఘిక కామెడీ చిత్రానికి పాటలు మాత్రం రాశారు. 'మహాకవి కాళిదాసు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా రజత పతాకాన్ని పొందింది. తమిళంలోని 'జగదల్ ప్రతాపన్' చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని విజయా సంస్థ 1961లో 'జగదేకవీరుని కథ' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రంలో పౌరాణిక అంశాలను మేళవిస్తూ పింగళి ఈ చిత్రానికి నవరస భరితంగా రచన చేశారు..1962లోనే బి.ఎస్. రంగా నిర్మించిన 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రానికి కథ, మాటలు పాటలు పింగళి సమకూర్చారు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రాష్ట్రపతి రజత పతకం దక్కింది. గుమ్మడి చలనచిత్ర జీవితంలో ఈ చిత్రం ఒక కలికి తురాయి. 1963లో కె.వి.రెడ్డి జయంతి పిక్చర్స్ బ్యానర్ మీద 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు పింగళి సమకూర్చారు. అర్జునుడు వేసే వేషానికి సరదాగా 'అజిభీదఫపా స్వాములు' అని అర్జునుని వివిధ నామాలను గుర్తుచేస్తూ పేరు పెట్టారు పింగళి. 'సి.ఐ.డి' (1965), రాజకోట రహస్యం' (1971) చిత్రానికి, 'శ్రీకృష్ణసత్య' (1971) చిత్రానికి పింగళి మాటలు, పాటలు సమకూర్చారు. ఎన్ టి ఆర్ 1977లో నిర్మించిన 'చాణక్య చంద్రగుప్త' సినిమాకు చివరి సారిగా పింగళి కథ, మాటలు సమకూర్చాడు. పింగళి నాగేంద్రరావు 1971 మే 6న కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## తెలుగు నవలా నందనవనంలో నిత్య పుష్పం: బలివాడ కాంతారావు - మే 6...బలివాడ కాంతారావు వర్ధంతి

తెలుగు నవల పరిణామంలో సమగ్ర దృక్కోణం, సామాజిక స్పృహ, మానవీయ విలువల ప్రతిబింబంగా వెలుగొందిన రచయితల్లో బలివాడ కాంతారావు (జూలై 3, 1927 - మే 6, 2000) ప్రముఖులు. ఆయన రచనలు మానవ స్వభావంలోని మంచిని, సామాజిక న్యాయం మరియు సమానత్వం సాధించడానికి ఉత్ప్రేరకాలు. సమకాలీన భారతీయ జీవితాన్ని విశ్లేషించే ఘనత ఆయన రచనలకు సమకూరింది. శ్రీకాకుళం జిల్లాలోని మడపాం గ్రామంలో జన్మించిన బలివాడ కాంతారావు, చిన్ననాటి నుంచే జ్ఞానార్జన పట్ల ఆసక్తిని కనబరిచారు. తండ్రి సూర్యనారాయణ, తాత రామమూర్తి ద్వారా ఇతిహాస, పౌరాణిక నేపథ్యం ఆయన లో లోతుగా ప్రవేశించింది. విశాఖపట్నంలో విద్యాభ్యాసం అనంతరం, భారత నౌకాదళంలో సివిలియన్ అధికారిగా పని చేశారు. ఉద్యోగ బాధ్యతల నడుమ సాహిత్యంతో ఆయన బంధం ఎక్కడా వీడ లేదు. 1947లో మొదటి నవల "నేరస్తులు" రచనతో ప్రారంభమైన సాహిత్య పయనం దశాబ్దాల పాటు కొనసాగింది. మానవ స్వభావ విశ్లేషణ, సాంఘిక విమర్శ, మానవతా భావనల సమన్వయంతో ఆయన రచనలు తెలుగులో నవల అనే ప్రక్రియకు కొత్త రూపాలు ఇచ్చాయి. బలివాడ కాంతారావు రచనా శైలిలో వ్యవహారిక భాష, చిన్నచిన్న భావోద్వేగాలకు పెద్ద పీట, కథన సరళత కనిపిస్తాయి. ఆయన పాత్రలు నమ్మదగినవిగా, మనకు ఎదురయ్యే జీవిత మాండలికాల్లోంచి వచ్చినవిగా ఉంటాయి. కథలో ఏ దశలోనూ ఆంతర్యం గల్లంతుకాదు. 38 నవలలు, 400 కథలు, 5 నాటకాలు, అనేక రేడియో నాటకాలు, ప్రయాణ కథనాలు - ఇలా విస్తృత రచనా సంపద ఆయనకే సొంతం. ఆయన రచనలు హిందీ, తమిళం, కన్నడ, ఒడియా, గుజరాతీ, ఆంగ్ల భాషల్లోకి అనువదించ బడ్డాయి. ప్రముఖ నవలలు: నేరస్తులు (1947): సామాజిక న్యాయం కాంక్షించే నవల. పరాజయం (1949): వ్యక్తిగత పరాజయం వెనుక సమాజపు పాత్రపై ప్రశ్నించే రచన. గోడమీద బొమ్మ (1953): భావోద్వేగాలను ఆకళింపు చేసుకునే కథనం. మత్స్యగంధి (1962), పుణ్యభూమి (1969), ఇదే నరకం ఇదే స్వర్గం (1974), వంశధార (1982) - ఇవన్నీ రచయిత కలం సామాజిక స్పృహకు దర్పణాలవంటి నవలలు. కథా సంకలనాలు: బలివాడ కాంతారావు కథలు (1998): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సంకలనం. కథాకలాసం: రచయిత తన కథా ప్రపంచాన్ని విశాలంగా పరిచయం చేసిన సంకలనం.



బలివాడ కాంతారావు రచనా కృషికి అనేక గౌరవాలు లభించాయి. 1998లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, గోపీచంద్ సాహితీ పురస్కారాలు, కళాసాగర్ విశిష్ట పురస్కారం వంటి అనేక అవార్డులు ఆయన ప్రతిభకు వందనం చెప్పాయి. బలివాడ కాంతారావు రచనలు ఒక తాత్విక గంభీరతను కలిగి ఉండగా, సమకాలీన సమస్యల పట్ల స్పందనతో కూడుకున్నవి. నిజాయితీ, నిక్కచ్చితనం, కరుణ వంటి వ్యక్తిగత లక్షణాలు ఆయన రచనల్లో అంతర్భావంగా నిక్షిప్తమై ఉంటాయి. 2000 మే 6న బలివాడ కాంతారావు ఈ లోకాన్ని వీడినా, ఆయన రచనలు తెలుగు సాహిత్యంలో చిరంజీవిగా నిలిచి పోయాయి. భవిష్యత తెలుగు పాఠకులకు ఆయన రచనలు సామాజిక అవగాహన, మానవతా దృష్టి, సాహిత్య విలువల పాఠాలు నేర్పిస్తూనే ఉంటాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు



# ఎగువ గ్రామాలకు ఏటా కన్నీరే!

గంగాధర : గోదావరి జలాలను బీడు భూములకు తరలించాలనే ఉద్దేశంతో నిర్మించిన గంగాధర, నారాయణపూర్ ఎల్లంపల్లి జలాశయాలు పూర్తికాక వేలాది ఎకరాల భూములు బీళ్లుగానే ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు దాదాపు 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ చెరువుల సామర్థ్యం పెంచకపోవడం, అసంపూర్తి కాలువలతో సగం విస్తీర్ణానికి కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

**1100 మీటర్ల మేర తవ్వితేనే ఫలితం**

గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద రెండు ప్రధాన సాగునీటి కాలువలు, వాటి కింద ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి వైపు కుడికాలువ 19 కి.మీ నిర్మించాల్సి ఉండగా 18.2 కి.మీ మేరకు కాలువ తవ్వారు. గంగాధర ప్రధాన కూడలిలో ఇంకా 1100 మీటర్ల మేరకు తవ్వితేగానీ ఎగువ గ్రామాలకు నీరందించలేని దుస్థితి నెలకొంది. రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల, వెంకంపల్లి, పోతుగంటిపల్లి గ్రామాలతోపాటు బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరందడం లేదు.



గంగాధర, నారాయణపూర్ చెరువులను ఎల్లంపల్లి నీటితో పైపులైన్ల ద్వారా నింపి ఇక్కడి నుంచి కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి జలాశయాల సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా చెరువుల్లో నీరు ఎప్పటికీ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోలేదు. చెరువుల కట్టల ఎత్తు 1.45 మీటర్లు పెంచాల్సి ఉండగా, కేవలం మత్తడి ఎత్తు పెంచి వదిలేశారు. గతేడాది వానాకాలంలో చెరువులు నిండి ప్రమాద స్థాయికి చేరడంతో మత్తడిని ధ్వంసం చేసి నీటిని కిందకు వదిలారు.

కాలువలు పూర్తికాక 27,500 ఎకరాలకు నీరందడంలేదు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో 210 ఎకరాలు 147 ఎకరాల భూసేకరణ జరగక కాలువల పనులు పూర్తవడం లేదు. రామడుగు మండలంలో లక్ష్మీపూర్, దత్తోజీపేట, షానగర్, రామడుగు, ఇతర గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. చొప్పదండి మండలం గుమ్లాపూర్, చిట్యాలపల్లి, కాట్నపల్లి, ఇతర గ్రామాల్లోనూ ఏటా సాగునీటికి ఇబ్బందులు గురవుతున్నారు.

నారాయణపూర్ చెరువు కట్ట కింద దాదాపు 35 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని ఏడాది కిందటే అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. మంగపేట చెరువు నుంచి 800 మీటర్ల మేరకు కుడికాలువ తవ్వాల్సి ఉంది. కాగా గంగాధర ప్రధాన కూడలిలో జగిత్యాల రోడ్డు క్రాసింగ్ 300 మీటర్ల మేరకు భూమి లోపలి నుంచి కాలువ తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాలువ కింద మల్లాపూర్ నుంచి వేములవాడ వరకు ఉపకాలువలు తవ్వాల్సి ఉండగా భూసేకరణ సమస్య తలనొప్పిగా మారింది. ఈ చిత్రంలోని రైతు పేరు ఐతం తిరుపతి. ఈయనది రంగారావుపల్లి. వ్యవసాయ బావి ఆధారంగా మూడెకరాల్లో పంటలు సాగు చేయగా.. బావిలో నీరు అడుగంటిపోయింది. రూ.1.50 లక్షలు వెచ్చించి రెండు బోర్లు 650 అడుగుల లోతు తవ్వినా చుక్క నీరు రాలేదు. నారాయణపూర్ జలాశయ కుడికాలువ పూర్తయితే తప్ప తమకు సాగునీటి కష్టాలు తీరేలా లేవని వాపోతున్నారు.

# అసంపూర్తి నిర్మాణం.. భయం నీడన ప్రయాణం

ఇల్లంతకుంట : ఏళ్ల తరబడి ఇబ్బందులు తొలగేలా వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వంతెన వద్ద వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఇల్లంతకుంటకు నుంచి అనంతారం వెళ్లే మార్గంలో బిక్కవాగుపై గత ప్రభుత్వ హయాంలో లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన మంజూరు చేశారు. నిధులు మంజూరైన కొన్ని సంవత్సరాల తర్వాత నిర్మాణం ప్రారంభించారు. వంతెన మొదట్లో, చివరలో పనులు పూర్తి చేయక పోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు వైపుల రక్షణ గోడలు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారు అరకొర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేదా రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సిరిసిల్ల, కరీంనగర్, సిరిసిల్లకు నిత్యం బస్సులు వెళుతుంటాయి. రాత్రి వేళ, కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను పూర్తి చేయాలని గ్రామసులు, యువకులు గతంలో ఆందోళనలు చేపట్టారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపడితే బాగుంటుందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సానిక ప్రజాప్రతినిధులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు**

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. వంతెన నిర్మించినా రెండు వైపుల రక్షణ గోడలు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వంతెన ఎత్తుగా ఉండటంతో ఆదమరిచితే ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిసితి ఎదురవుతోంది. పాలకులు స్పందించి ఇబ్బందులను పరిష్కరించాలి. అక్కెం నాగరాజు, అనంతారం

**ప్రమాదకరంగా మారింది** రక్షణ గోడలు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించే వీలులేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం చోటుచేసు కునే అవకాశం ఉంది. ఈ మార్గంలో ప్రైవేట్ బస్సుల్లో విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళతా. ఈ ప్రాంతంలో ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికర పరిసితి ఎదురవుతోంది. పండుగ వేణు, జంగంరెడ్డిపల్లె

# పుట్టిస్తారు.. ధ్రువీకరణ పత్రం



హైదరాబాద్ : ప్రపంచంలో ఎక్కడ జన్మించినా సరే హైదరాబాద్‌లో జనన ధ్రువీకరణపత్రం పొందొచ్చు. దళారులు చెబుతోన్న మాట ఇది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20వేల నుంచి రూ.50 వేలు సమర్పించుకుంటే చాలు మీ చేతిలో సర్టిఫికేట్ పెట్టేస్తారు. చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం తదితర సర్కిళ్లలో గతంలో బర్మా, బంగ్లాదేశ్, ఇతర దేశీయులు ఈ సరిఫికెట్లు పొందినట్లు పోలీసులు గతంలో గుర్తించారు. తాజాగా అలాంటి మరికొన్ని తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో, తెలంగాణలోని వేర్వేరు జిల్లాల్లో జన్మించిన పలువురు శిశువులకు జీహెచ్ఎంసీ నుంచి జనన ధ్రువీకరణపత్రాలు జారీ అయినట్లు తేలింది. వాటిని రద్దు చేయాలని ఆరోగ్యవిభాగం నిర్ణయం తీసుకుంది.

**ఇంట్లో పుట్టారని చెబుతూ..**

పేదలకు సైతం మెరుగైన ప్రసూతి సేవలు నగరంలో అందుబాటులో ఉన్నాయి. అయినా జీహెచ్ఎంసీ ప్రతి నెలా 150-200 జనన ధ్రువీకరణపత్రాలను ఇంట్లో జన్మించిన శిశువులకు జారీ చేస్తోంది. పాతబస్తీ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోనే ఇలాంటివి ఎక్కువగా ఉంటున్నాయి. ఓ అఫిడవిట్, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, ఇంటితోపాటు పక్కింటిలోని వ్యక్తుల విచారణతో హెూమ్ బర్త్, హెూమ్ డెత్‌లకు సర్టిఫికెట్లు ఇచ్చేస్తుండటంతో.. కేటుగాళ్లు ఆ మార్గాన్ని ఉపయోగించుకుంటున్నారు.

**నెలలో ఆరు కేసులు.**

నెలరోజుల వ్యవధిలో ఆరు నకిలీ సర్టిఫికెట్లు జారీ అయినట్టు జీహెచ్ఎంసీ అంతర్గత విచారణలో తేలింది. విశాఖలో జన్మించిన ఓ శిశువుకు వనస్థలిపురంలో, తెలంగాణలోని వేర్వేరు జిల్లాల్లో జన్మించిన ఐదుగురికి నగరంలోని పలు సర్కిళ్ల పరిధిలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయి.

**మిగతా చోట్ల..**

జనన, మరణాల నమోదు వ్యవహారం కేంద్ర చట్టం పరిధిలో ఉంటుంది. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ఆఫ్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా పేరుతో ఉన్న వెబ్‌సైట్ ద్వారానే దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థలు వీటిని జారీ చేస్తుంటాయి. ఆసుపత్రుల్లో నమోదయ్యే జనన, మరణాల వివరాలను ఆయా యాజమాన్యాలు ఆ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తాయి. తర్వాత కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకుంటే వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా ధ్రువీకరణపత్రాలను జారీ చేస్తాయి.

**నగరంలో ఇలా..** తెలంగాణలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒక వెబ్‌సైట్, జీహెచ్ఎంసీ మరో వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తున్నాయి. దీంతో దేశ, విదేశాల్లోని జనన, మరణాలకు హైదరాబాద్‌లో సులువుగా సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గత కమిషనర్ ఇలంబర్తి కేంద్ర సర్కారు వెబ్‌సైట్‌ను ఉపయోగించేందుకు ఆసక్తి చూపారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఆయన బదిలీతో సమస్య మొదటికొచ్చింది.

# పైపై వంతెనలేనా?



హైదరాబాద్: కేబీఆర్ పార్కు కూడళ్లలో చేపట్టదలచిన పైవంతెనల నిర్మాణాల విషయంలో అయోమయం నెలకొంది. పర్యావరణవేత్తలు, భూములు కోల్పోతున్న వారు ప్రాజెక్టులో లోపాలున్నాయంటూ, పర్యావరణానికి హాని జరుగుతోందని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో కూడళ్లలో పైవంతెనల నిర్మాణం జరుగుతుందా, లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత సర్కారు హయాంలోనూ ఇలాంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. టెండర్లు పిలిచి, గుత్తేదారుతో ఒప్పందం చేసుకున్నప్పటికీ.. పర్యావరణవేత్తల పోరాటంతో జీహెచ్ఎంసీ ప్రాజెక్టును రద్దు చేసుకుంది. సరిగ్గా.. మళ్లీ అదే వాతావరణం కనిపిస్తుండటం అయోమయానికి దారి తీస్తోంది.

**ఆరేళ్లుగా పోరాటం..**

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో పైవంతెనలు నిర్మించాలని గత సర్కారు 2017లో టెండర్లు పిలిచింది. చెట్లు, ఆస్తుల సర్వే మొదలవగానే.. కేబీఆర్ పార్కును రక్షించాలంటూ పర్యావరణవేత్తలు ఆందోళనలకు దిగారు. జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులోనూ వాదనలు జరిగాయి. నగరానికి ఊపిరి పోసే జాతీయ పార్కును పైవంతెనల కోసం ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణ ప్రేమికులు చేపట్టిన న్యాయ పోరాటంతో ప్రాజెక్టు రద్దయింది.

**కొత్త సర్కారు రాగానే..**

హైటెక్‌సిటీకి, నగరంలోని మిగిలిన ప్రాంతాలకు కేబీఆర్ పార్కు చుట్టూఉన్న రహదారులు వారధిలా ఉపయోగపడుతున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో పార్కు చుట్టు ఉన్న ఆరు కూడళ్లలోనూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కాలుష్యం, ఇంధన ఖర్చు, ప్రజలకు అసౌకర్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ప్రస్తుత సర్కారు పాత ప్రతిపాదనలను మళ్లీ భుజానికెత్తుకుంది. పర్యావరణవేత్తల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. పార్కు వైపు డిజైన్ చేసిన పైవంతెనలను అండర్‌పాస్‌లుగా మార్చింది. ప్రస్తుతం ఉన్న రహదారులపైనే పైవంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించేట్టు డిజైన్లు రూపొందించామని ఇంజినీర్లు చెబుతున్నారు. పర్యావరణ ప్రేమికులు మాత్రం మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఐదు కేసులు విచారణలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**టెండరుపై యథాతథ స్థితి..**

అటవీశాఖ, జీహెచ్ఎంసీలపై నమోదైన కేసులను విచారణకు తీసుకున్న న్యాయస్థానం, టెండరు ప్రక్రియపై యథాతథస్థితి ఆదేశాలిచ్చినట్టు ఇంజినీర్లు చెబుతున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అన్ని కూడళ్లలో కలిపి 222 ఆస్తుల సేకరణకు సంబంధించి సర్వే పూర్తయింది. న్యాయస్థానానికి వాస్తవ పరిస్థితులను తెలియజేసి అనుమతులు సాధిస్తామని సీనియర్ ఇంజినీరు తెలిపారు.

# పడవలకు కోట్లు.. నడవక తూట్లు!



కరీంనగర్ : ఇది క్రూయిజ్ బోట్. రూ.1.50 కోట్లు వెచ్చించి అయిదేళ్ల క్రితం ఎల్ఎండీ డ్యామ్‌లో పర్యాటకుల కోసం అందుబాటులోకి తెచ్చారు. ఒక్క ట్రిప్పులో దాదాపు వంద మందికి వినోదాన్ని అందించేలా, వేడుకల నిర్వహణకు అనుకూలంగా దీన్ని నీటిపై నడిపించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చినా అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. అడపాదడపా మొదట్లో కొన్ని రోజులు చక్కర్లు కొట్టినా మరమ్మతులు, ఇతర సౌకర్యాల్ని కల్పించాలనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి నీళ్ల మధ్యలో వదిలేశారు. ఫౌంటేన్ పడవ దుస్థితి ఇది. ఒకేసారి పది మంది వరకు విహరించేందుకు తీసుకొచ్చినా వినియోగానికి దూరంగా ఉంచడంతో తూట్లు పడి ఎల్ఎండీ జలాశయం గట్టున ఇలా పడి ఉంది. మరో స్పీడ్ బోట్ మరమ్మతుకు నోచుకోక ఎల్లమ్మగుడి సమీపంలో మూలనపడింది. గతేడాది వరదల సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు ఇంకొన్ని పడవలు పాడయ్యాయి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి తీసుకురాగా మున్నాళ్లకే మూలన పడ్డాయి. ఎల్ఎండీలో పడవల్ని నడుపుతూ పర్యాటకుల్ని ఆకట్టుకోవాలనే ఆశయం అటకెక్కుతోంది. ఎప్పటికప్పుడు పర్యాటక శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఇక్కడ ఎలాంటి ప్రగతి చూపించాలనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలవుతున్నాయి. నిత్యం డ్యామ్ కట్టపైకి 2 వేల మంది వరకు పర్యాటకులొస్తున్నారు. వీటి నిర్వహణ సరిగ్గా ఉంటే ఆదాయం కూడా బాగుంటుంది. ప్రస్తుతం నెలకు సగటున పడవలు నడిచే టికెట్‌ల రూపంలో రూ.1.50 లక్షలు వస్తున్నా.. అవి సిబ్బంది వేతనాలకే సరిపోతోంది.

**ఇదీ పరిస్థితి**

రెండు జెట్‌స్కీలు, హైస్పీడ్ బోట్లు, ఒక క్రూయిజర్‌ను రూ.2.60 కోట్ల వ్యయంతో 2018 సంవత్సరం సెప్టెంబరులో కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధుల నుంచి కొనుగోలు చేసినా వీటి నిర్వహణ ప్రస్తుతం ఎవరికీ పట్టడం లేదు. పర్యాటక శాఖ వీటి నిర్వహణ బాధ్యతల్ని చూడాలి కానీ.. ఎల్ఎండీ జలాశయంలో వీటి నిర్వహణ విషయంలో ప్రత్యేకమైన కార్యాచరణను అమలు చేయలేదు. దీంతో ఏడాదిలో కొన్ని నెలలు మాత్రమే అరకొరగా చిన్న పడవలను నడిపిస్తున్నారు.

ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్‌లో నలుగురు, కాంట్రాక్ట్ విధానంలో ఒకరు వీటి నిర్వహణ బాధ్యతల్ని చూస్తున్నారు. ప్రజాధనం వెచ్చించినా వీటి ఆలన ఎవరికీ పట్టడం లేదు. నాలుగేళ్ల కిందట క్రూయిజర్ పడవ నడిచేందుకు వీలుగా రూ.2 కోట్లు వెచ్చించి పెద్ద కాలువను కిలోమీటరు మేర తవ్వారు. పడవ నడిచేందుకు వీలుగా చేపట్టిన ఈ పనులు మధ్యలోనే నిలిచాయి. మిగులు పనులు చేపట్టకపోవడం, తవ్విన కాలువ పూడుకుపోవడంతో ప్రజాధనం పరిహాసమైంది.

నిర్వహణ విషయమై పర్యాటక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి మేనేజర్ రాంబాబును వివరణ అడుగగా క్రూయిజర్ పడవను నడపడానికి రూ.50 లక్షలతో జెట్టీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని.. ప్రతిపాదనల్ని పంపామన్నారు. మిగతా బోట్లను నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మున్సిపాల్టీలో ప్రమాద ఘంటికలు

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ మున్సిపాల్టీకి నీటి ఎద్దడి తప్పేలా లేదు. దశాబ్దాలుగా పట్టణ ప్రజల దాహం తీరుస్తూ వరప్రదాయినిగా పేరొందిన పట్టణ శివారులోని లాండసాంగ్వి వాగు ఎండిపోవడం అందరిని కలవరపెడుతోంది. దానిపై ఆధారపడ్డ పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగరథ నీళ్లు సరిపడా రావడం లేదు. ఆదినుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు పట్టణ డిమాండ్‌కు సరిపడా ఇవ్వడం లేదనేది పుర అధికారుల వాదన. ఈ కారణంతోనే పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని లాండసాంగ్వి గ్రామ సమీపంలో వాగు వద్ద నిర్మించిన పాత పథకాన్ని వినియోగిస్తున్నారు. గతంలో సాత్నాల ప్రాజెక్టులో నీటిబొట్టు లేకున్నా, గోదావరి నది ఎండిపోయినా లాండసాంగ్వి వాగులో నీరుండేది. వాగుల్లో అక్కడక్కడ ఉన్న ఊటల నుంచి నీరు రావడంతో ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉండేది. సాత్నాల



వరద నీరు ఇందులోనే కలుస్తుంది. ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా జైనథ్‌లోని నిరాల, పెండల్‌వాడల మీదుగా పెన్‌గంగలో కలిసే ఈ వాగు ఇప్పుడు ఎండిపోయింది.

**ఇక్కట్లు మొదలు..**

వాగులోనే తవ్విన రెండు ఊటబావుల నుంచి పథకంలోని ఇన్‌టేక్‌వెల్‌కు నీరు పంపిస్తే మోటార్ల ద్వారా పట్టణంలోని మున్సిపల్ ట్యాంకుల వద్దకు నీరు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని క్లోరినేషన్ చేసిన అనంతరం పలు కాలనీల్లో ఇంటింటికి అందిస్తున్నారు. ముఖ్యంగా తిర్పల్లి, మహాలక్ష్మీవాడ, బ్రాహ్మణవాడ, కుమర్‌పేట్, చించర్‌వాడ, కోలిపుర, బొక్కల్‌గూడ, ఖుర్షాపూర్, ఖిల్లా, వినాయక్‌చౌక్, మోచీగల్లి, రవీంద్రనగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డులకు ఈ పథకం నుంచి నీరందిస్తున్నారు. ఊటబావుల్లో నీరు లేక బుధవారం నుంచి సరఫరా నిలిచిపోనుంది. ఈ కాలనీల్లో భగీరథ సైతం సరఫరా అవుతున్నా సరిపోక సమస్య తీవ్రంకానుంది.

# అప్పుడు అక్రమం.. ఇప్పుడెలా సక్రమం

ఆసిఫాబాద్: ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాదార్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్లాట్లుగా రూపాంతరం చెంది భవనాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇవి ఆక్రమణలేనని నిర్ధారించిన అధికారులు కట్టడాలను కూల్చేశారు. అనంతరం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో.. రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కలెక్టరేట్కు సమీపంలోనే ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ అటువైపు వెళ్లకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కారీ స్థలాలకు కాపాడాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల ఆవిర్భావం అనంతరం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో భూ మాఫియా వ్యక్తులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో తాము కన్నేసిన భూములను కాజేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 11, 64, 42లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. రెండేళ్ల కిందట ఈ ప్రాంతంలో 12 నివాస సముదాయాలను, మరికొన్ని తాత్కాలిక కట్టడాలను, ప్రహరీలను



అధికారులు తొలగించారు. జేసీబీతో కూల్చివేశారు. మళ్లీ తాజాగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. సమీపంలోనే కలెక్టరేట్ భవనం ఉన్నా.. కబ్జాలు కొనసాగడం గమనార్హం.

అదనంగా ఇవ్వాల్సిందే..

నస్పూర్‌లో సర్వే నం.11, 64, 42లలో లావుణి పట్టాలు ఉన్నాయి. ఇక్కడ క్రయ విక్రయాలు, నిర్మాణాలు నిషేధం. అయితే 2023లో కూల్చివేసిన చోటే ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఓ నాయకుడి ప్రధాన అనుచరుడు అన్నీ తానై ముందుండి వ్యవహారం నడిపిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. కూల్చేసిన చోటుతోపాటు, ఖాళీగా ఉన్న సర్కారీ స్థలాల్లో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతోపాటు, భవన నిర్మాణ పనులు సైతం సదరు నేతకు సంబంధించిన బిల్డర్ చేస్తున్నారు. అంటే భవనానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయితే మరో రూ.5 లక్షలు అదనంగా ఇవ్వాలన్నమాట. ఈ తరుణంలో కొందరు వ్యక్తులు సదరు నేతకు అడిగినంత ఇచ్చి భవన నిర్మాణ పనులు ప్రారంభించారని సమాచారం.

# ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు

మంచిర్యాల: భానుడు భగభగ మండుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో మంచిర్యాల కూడా ఉంది. ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుందే తప్ప తగ్గడం లేదు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బ బారిన పడే అవకాశముంది. దీంతోపాటు వేసవికాలంలో ఎక్కువగా వచ్చే డీహైడ్రేషన్ తదితర రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. వీటి నియంత్రణకు ఆరోగ్యశాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్యకేంద్రాలకు సరిపడా మాత్రలు, సూది మందు, సెలైన్లను సరఫరా చేసినట్లు ఇక్కడి సీఎంఎస్(కేంద్ర ఔషధ గిడ్డంగి) బాధ్యులు తెలుపుతున్నారు.

**ఓఆర్ఎస్ నుంచి డీఎన్ఎస్ వరకు..** వేసవికాలంలో ఆరోగ్యకేంద్రంతో పాటు ఇళ్లలోనూ ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం వీటి నిల్వలు జిల్లాలోని జీజీహెచ్ నుంచి సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో సరిపడా ఉన్నట్టు సీఎంఎస్‌లోని లెక్కలు చెబుతున్నాయి. వేసవిలో అత్యవసరమయ్యే ఓఆర్ఎస్ నుంచి ఎన్ఎస్, ఆర్ఎల్, డీఎన్ఎస్, మెట్రోజిల్ సెలైన్లు సరిపడా ఉన్నాయని, ఎప్పటికప్పుడు నిల్వలు అందుబాటులో ఉంచుకుంటున్నట్లు, ఆరోగ్యకేంద్రాల అవసరం మేరకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బందికి సైతం కొంత మేరకు అత్యవసర మందులను వెంట ఉంచుకోవాలని సూచించినట్టు వైద్యాధికారులు వివరించారు.

చురకలు



# తుది దశకు విజిలెన్స్ విచారణ

కరీంనగర్ : కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో అవినీతి, అక్రమాలు జరిగాయని విద్యార్థి, ప్రజా సంఘాలు ఆరోపణలు, నిరసనలు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 15 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. దీనిపై ప్రభుత్వం గత జులైలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీని విచారణకు ఆదేశించింది. అప్పటినుంచి 8 నెలలుగా ఒక్కో అంశంపై కూలంకుశంగా విచారణ చేపడుతూ వస్తున్నారు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరత, ఫిర్యాదు అంశాలు ఎక్కువగా ఉండటంతో ఆలస్యమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**అనర్హులను నియమించారని..**

గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలో నియామకాలు చేపట్టారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. కనీస అర్హత లేనివారిని ఆచార్యులు, సహా ఆచార్యులుగా నియమించారని ఫిర్యాదులో తెలిపారు. రెగ్యులర్ కోర్సులుగా ఉన్న నాలుగు విభాగాలను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా చూపి యూజీసీ-12బీ గుర్తింపు కోసం తప్పుడు నివేదికను సమర్పించారని ఆరోపించారు. పరిపాలన భవనం మొదటి అంతస్తు నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించక నిధులు దుర్వినియోగం చేశారని చెబుతున్నారు.

**ఉద్యోగం వదిలేయడంపై అనుమానాలు..**

2021-22, 2022-23లో జరిగిన ఆడిట్ నివేదికలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు తమ పిటిషన్‌లో కోరారు. జులైలో




విజిలెన్స్ విచారణ ప్రారంభం కాగానే అప్పటి ఫైనాన్స్ అధికారి సెలవుపై వెళ్లారు. అనంతరం ఉద్యోగం నుంచి తప్పుకొంటున్నట్లు వెల్లడించారు. ఎక్కడ తన మెడకు చుట్టుకుంటుందోనని ఆ అధికారి పక్కకు తప్పుకొన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. విచారణ ప్రారంభించే కంటే 2 నెలలముందే అప్పటి ఉపకులపతి ఉద్యోగ విరమణ కావడంతో.. ఆరు నెలలుగా ఇన్‌ఛార్జి వీసీ పాలనలో కొనసాగింది. ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్ అక్టోబరులో బాధ్యతలు చేపట్టారు. మరో 15 రోజుల్లో విచారణ నివేదికను విజిలెన్స్ ఉన్నత కార్యాలయానికి పంపి.. అనంతరం అటునుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు కరీంనగర్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అచ్చేశ్వర్‌రావు తెలిపారు.

**సిబ్బంది పీఎఫ్ డబ్బులపై..** పరీక్ష పేపర్ లీకేజీలు, టెండరు లేకుండానే పరీక్ష జవాబుపత్రాల స్కానింగ్ ప్రక్రియపై ఓ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని.. గత ఉపకులపతి రెసిడెన్స్ నిర్వహణలో ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. బోధనేతర సిబ్బంది పీఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా.. ఫైనాన్స్ అధికారి, అప్పటి రిజిస్ట్రార్ వద్దనే అంటిపెట్టుకున్నట్లు తెలిపారు.

# సేకరిస్తారా.. మూసేస్తారా!

పెద్దపల్లి : సీజన్ చివరి దశకు రావడం, పత్తిలో నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయనే సాకుతో కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసేందుకు సీసీఐ చర్యలు చేపడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే కేంద్రాలను ఎత్తివేయడంతో అక్కడి రైతులు మన జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తితో మిల్లులు నిండిపోతుండగా, ఇక్కడి రైతులు అమ్మకానికి అవస్థలు పడుతున్నారు. మరోవైపు మన జిల్లాలోనూ సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం నుంచి సేకరణ ప్రక్రియ నుంచి సంస్థ తప్పుకొంటుందన్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో సీసీఐ(భారత పత్తి సంస్థ) కొనుగోలు కేంద్రాలను ఎత్తివేయడంతో బీమారం మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం సాంబయ్య మంగళవారం 15 క్వింటాళ్ల పత్తిని పెద్దపల్లిలోని ఒక జిన్నింగ్ మిల్లుకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎత్తివేయ డంతో ఇక్కడికి తీసుకురావాల్సి వచ్చిందని చెప్పారు. ఆయనొక్కడే కాదు.. ఆ జిల్లాకు చెందిన చాలా మంది రైతుల వాహనాలు మిల్లు వద్ద బారులు తీరాయి.

**ధరలపై డాలర్ ప్రభావం**

సాధారణంగా మార్చి నెలలో పత్తి ధరలు పెరుగుతాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు పలికిన సందర్భాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం పత్తి ధరలపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు(ముఖ్యంగా దిగుమతి చేసుకునే వస్తువులు) గత నెల రోజుల వ్యవధిలో బాగా పెరిగాయి. రూపాయి



మారకం విలువ పడిపోవడంతో పత్తి బేళ్ల ధర కూడా తగ్గిపోయింది. దీని ప్రభావం ఎగుమతులపై పడటంతో పాటు పత్తి ధరలను ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితుల కారణంగానే గతానికి భిన్నంగా మార్చి నెలలో ధరలు తిరోగమనంలో ఉన్నాయి. ఇదే సమయంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఎత్తివేస్తారన్న ప్రచారంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ధాన్యం సీజన్‌లో చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం పత్తి సేకరణలో ఇందుకు వ్యవహరించడం సరికాదని అభిప్రా యపడుతున్నారు.

**ఇళ్లలోనే 40 శాతం నిల్వలు**

ఇప్పటివరకు జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 3.13 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇదే సమయంలో ప్రైవేటు కొనుగోలుదారులు 90 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో గతేడాది 52,578 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం కనీసం 7 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 4.03 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే రైతులు విక్రయించారు. ఇందులో ఇతర జిల్లాలకు చెందిన సరకు కూడా ఉంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం రైతుల వద్ద మరో 40 శాతం నిల్వాలులన్నాయి. ప్రైవేటులో ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో రైతులు పత్తిని అమ్మకుండా అట్టిపెట్టుకున్నారు.

# పల్లె రమ్మంటోంది



వెల్గటూరు : దేశానికి పల్లె సీమలే పట్టుగొమ్మలు.. భావి పౌరులు పల్లెతల్లి ప్రేమానురాగాలను చూసేందుకు వేసవి సెలవులు నెలవులు కావాలి. విద్య, ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధి రీత్యా గ్రామాల నుంచి పట్టణాలకు తరలి వెళ్లడం నేటి కాలంలో పరిపాటి. విద్యాభ్యాసం చేస్తున్న వారికి వార్షిక పరీక్షలు ముగిసాయి. ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీలు పట్టిన చిట్టి చేతులు మట్టివాసన పరిమళాలు అందిపుచ్చుకునేందుకు పల్లెబాట పడితే నేర్చుకునే కొత్త విషయాలెన్నో. ఇన్నాళ్లూ పట్టణాలు, నగరాల్లో యాంత్రిక జీవనానికి అలవాటు పడిన పసి మనసులు కొత్త ప్రపంచంలో విహరించేందుకు వేసవి సెలవులు ఎంతో తోడ్పాటునిస్తాయి.

**ప్రకృతి సోయగం**

గ్రామీణ ప్రాంతాలు ప్రకృతి సోయగానికి ప్రతిరూపాలు. సూర్యోదయం, సూర్యాస్తమయం, పచ్చని పైర్లు, పొంగి పొరలే జలాశయాలు, పక్షుల కిలకిలారావాలు, మామిడి తోటలు, ముంజ కాయలు, ఈత పండ్లు ఇలా ప్రతీ దృశ్యం పల్లె సీమ అందాలను కనువిందు చేసేలా ఉంటుంది. చిన్నారులు ప్రకృతి అందాలను ఆస్వాదించి జ్ఞాపకాలను మదిలో నిలుపుకునే అవకాశం ఉంది.

**సమష్టి జీవనం.. శ్రమైక సౌందర్యం**

పల్లె జీవన విధానం పట్టణ జీవనానికి భిన్నంగా ఉంటుంది. గ్రామీణ వాతావరణంలో వ్యవసాయం, చేతి వృత్తులు, విభిన్న ఆచారాలు, సంప్రదాయాలకు నెలవై ఉంటాయి. గ్రామాల్లో పండగలు, ఉత్సవాలను కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకుంటారు. సమష్టితత్వం గ్రామీణ జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. సాటివారికి కష్టం వచ్చినప్పుడు సాయం చేసుకుంటూ మనోధైర్యం నింపుతారు. చిన్నారులు పల్లెల్లో విహరిస్తే ఇక్కడి జీవన విధానంపై అవగాహన పెరుగుతుంది. తద్వారా నిస్వార్థ జీవన విధానం, ఆత్మవిశ్వాసం అలవడుతాయి.

**పంటల సాగుపై అవగాహన**

తినే అన్నం నుంచి మొదలు ప్రతి పంటల సాగుపై చిన్నారులకు పల్లె సందర్శన ద్వారా అవగాహన పెరుగుతుంది. చిన్నారులకు వ్యవసాయంపై అవగాహన పెంపొందించడానికి పల్లెసీమలే వేదికలు. గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శింపజేస్తే వరి, మక్క, కూరగాయలు, ఆకుకూరలు, సేంద్రియ సాగు విధానాలు, ప్రయోజనాలు, ప్రస్తుతం వ్యవసాయంలో చోటు చేసుకున్న ఆధునిక పరిజ్ఞానం వంటివి చిన్నారులు తెలుసుకుంటారు. **ఆప్యాయత, ఆత్మీయతల కలబోత** పల్లెటూరు అంటేనే ఆప్యాయత, అనురాగం తొణికిసలాడుతుంది. కులాలు, మతాలకు అతీతంగా వరసలతోనే పిలుచుకుంటారు. పట్టణాల్లో అంకుల్, ఆంటీల పిలుపులకు భిన్నమైన అనుబంధాలు ఇక్కడ పెనవేసుకుని ఉంటాయి. ఎవరిని ఎలా పరిచయం చేసుకోవాలి, ఎలా గౌరవించాలి అనే విషయం చిన్నారులకు ఇక్కడే బోధపడుతుంది. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్య, వినోదాన్ని నింపేలా, కుటుంబ బంధాలు, అనుబంధాలు బలపడేలా ఉంటాయి. పెద్దలచే నీతికథలు చెప్పించి వినేలా ప్రోత్సహిస్తే నైతిక విలువలు పెంపొందుతాయి. పెద్దవారు కనిపించినప్పుడు లేచి నిల్చునే గౌరవభావం, పాదాభివందనం చేసే సంస్కృతి వంటి వాటిని గమనించడం వల్ల సమాజం పట్ల వారికి గౌరవభావం పెంపొందు తుంది.

# ప్రతిపాదనలు సిద్ధం.. నిధులే లేవు



సారంగాపూర్ : ఏటా చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడడమే కాకుండా పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. సాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధుల విడుదల లేక పనులు పట్టాలెక్కడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే సాగునీటి సమస్య పరిష్కారం కానుంది. గోదావరిపై రెండు బ్యారేజీ(చెక్ డ్యాం)లు నిర్మిస్తే బీర్‌పూర్‌తో పాటు ధర్మపురి మండలాల రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా ఉండనుంది. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ మొసళ్లమడుగు, చిన్న కొల్వాయి ప్రాంతాలను పరిశీలించారు. అనువైన ప్రాంతాలను గుర్తించి రూ.275 కోట్ల చొప్పున ప్రతిపాదనలు తయారు చేశారు. బ్యారేజీ నిర్మాణాలతో నీటి నిల్వతో పాటు గోదావరి తీరం వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీటి సమస్య తొలగనుంది. ఈ ఏడాది యాసంగి పంటల ప్రారంభంలో గోదావరి ఎండిపోవడంతో ఎస్సారెస్పీ నుంచి టీఎంసీ నీటిని వదలాల్సి వచ్చింది. బ్యారేజీలు నిర్మిస్తే గోదావరిలో నీటిని నిలువ చేసుకునే అవకాశం ఏర్పడనుంది.

సారంగాపూర్ చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని మళ్లించేందుకు ఇప్పటికే పలు మార్లు సర్వే చేపట్టి నివేదిక తయారు చేశారు. కాలువ నిర్మాణంతోపాటు, చెరువు మరమ్మతు, ఇతర పనులకు రూ.20 కోట్లతో అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మండలంలోని రంగపేట ఊరకుంటకు రూ.కోటి, బీర్‌పూర్ మండలంలోని అరగుండాల ప్రాజెక్టు 0.00 నుంచి 6.00 కి.మీ. వరకు కాలువ లైనింగ్ చేపట్టాల్సిన అవసరముంది. రూ.2.75 కోట్లు, కమ్మునూర్ రావికుంట మరమ్మతుకు రూ.3.50 కోట్లు మంజూరు చేస్తే ఇబ్బంది తొలగనుంది.

**మరమ్మతు చేపడితేనే చివరికి నీరు**

డి53, 12ఎల్, 1ఆర్ ప్రధాన కాలువలతోపాటు ఉప కాలువ మరమ్మతు లేకపోవడంతో పైప్రాంతంలో నీరు వృథాగా పోయి, చివరి ఆయకట్టుకు నీరందడంలేదు. ఇందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినా నిధులు విడుదల చేయకపోవడంతో ఏటా రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. తూములు కూలిపోవడమే కాకుండా షట్టర్లు లేకపోవడంతో నీరంతా వృథా అవుతోంది. అంతేకాకుండా పలు కాలువలు ధ్వంసం అయినా మరమ్మతుకు నోచుకోవడంలేదు. ప్రస్తుతం వేసవిలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మరమ్మతు పనులు పూర్తి చేసుకొని వర్షాకాలం పంటలకు సాగునీటి ఇబ్బంది తొలగనుంది.

**మూలన పడ్డ ఎత్తిపోతల పథకాలు** బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్, చిత్రవేణిగూడెం, తాళ్లధర్మారం గ్రామాల్లో 1988లో రూ.15 లక్షలతో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. నాణ్యత పాటించకపోవడంతో ప్రారంభించిన ఏడాదికే పైపులైన్లు, మోటార్లు పాడవడంతో పథకాలు నిలిచిపోయాయి. దాదాపుగా రూ.50లక్షలకు పైగా వ్యయం చేసినా ఏనాడు పనిచేయకపోవడంతో ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా పథకాలకు రూ.60 కోట్ల చొప్పున మరమ్మతు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నూతనంగా పైపులైన్, మోటార్లు, రహదారుల నిర్మాణాలను చేపట్టనున్నారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు చేసిన కమ్మునూర్, మంగెళ, చిన్న కొల్వాయి ఎత్తిపోతల పథకాలకు కూడా పైపులైన్‌తో పాటు రహదారి నిర్మాణాలకు రూ.2కోట్ల చొప్పున నిధులు అవసరముంటుందని అధికారులు నివేదిక తయారు చేశారు.

# మారదాం.. మార్చుదాం!

వికారాబాద్ : పది పరీక్షల్లో జిల్లా వరుసగా మూడోసారీ అట్టడుగు స్థానంలో నిలవడం సర్వత్రా చర్చ మొదలైంది. దీని వెనుక బాధ్యులెవరని ఎవరికివారు మల్లగుల్లాలు పడుతున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించని ఉపాధ్యాయులదా? బడికి సక్రమంగా పంపించని తల్లిదండ్రులదా? అనేది చర్చిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో 'మనం మారదాం..విద్యార్థులను, తల్లిదండ్రులను మార్చుదాం' అంటూ జిల్లా విద్యా వ్యవస్థలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోందని సమాచారం.

**ఇతర వ్యాపకాల్లో విద్యార్థులు**

పలువురు విద్యార్థులు అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు చెప్పింది పెడచెవిన పెడుతున్నారు. బడి పేరుతో జులాయిలుగా తిరుగుతూ గంజాయి తదితరాలకు అలవాటు పడుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టం**

చెప్పి చెప్పి విసిగి పోయామని, విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపించక పోవడంతో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నామని ఓ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు అన్నారు. ఫలితాల పట్ల కేవలం విద్యార్థులను, తల్లిదండ్రులను మాత్రమే బాధ్యులను చేయడం సమంజసం కాదని, అధికారుల పర్యవేక్షణ లోపం ప్రభుత్వ పాఠశాలల్లో దిగజారుతున్న విద్యా ప్రమాణాలకు ఫలితాలు నిదర్శనమని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొందరు ఉపాధ్యాయులకు సొంత వ్యాపకాలపైనే ఎక్కువ శ్రద్ధ ఉంటోందని విమర్శలొస్తున్నాయి.

**తల్లిదండ్రులు ఏంచేస్తున్నారు?**

జిల్లాలో చాలావరకు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, పేదవారు. దీంతో తమ పిల్లలు ఎలా చదువుతున్నారనేది గమనించడంలేకపోతున్నారు. పొలం పనులు జోరుగా సాగుతున్న దశలో తల్లిదండ్రులే విద్యార్థులను బడి మాన్పించేసి పొలంబాట పట్టిస్తున్నారు. దీన్ని పిల్లలు అలుసుగా తీసుకుంటున్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్!

ఆసిఫాబాద్ : అనధికార భూముల క్రమబద్ధీకరణకు అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు దారులకు ఫోన్‌లు చేస్తూ సహకారం అందించేలా కలెక్టరేట్, పురపాలికల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 31 లోపు క్రమబద్ధీకరించుకుంటే 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కలెక్టర్, అదనపు కలెక్టర్లు సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. గత నెల నుంచి ప్రభుత్వ రాయితీ ప్రకటించడంతో స్పందన కనిపిస్తోంది.

**పుర పరిధిలో..**

జిల్లాలోని రెండు పురపాలికల పరిధిలో మొత్తం 3,529 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 92 మంది పూర్తి స్థాయిలో పత్రాలు సమర్పించలేదు. 15 తిరస్కరించారు. 311 మంది భూములకు సంబంధించి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. మిగతా 3,027 మందికి ఫీజు చెల్లించాలని అధికారులు సమాచారమిచ్చారు. గత నెలలో 30 మంది మాత్రమే రూ.11 లక్షల వరకు చెల్లించి ధ్రువపత్రాలు పొందారు.



రాయితీ ప్రకటించడంతో.. ఆ సంఖ్య పెరుగుతోంది. తాజాగా 125 మంది రూ.27 లక్షల వరకు ఫీజు చెల్లించారు. వీరిలో 64 మందికి అధికారులు ప్రొసీడింగ్స్ అందించారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో అన్ని సవ్యంగా ఉన్న వారి వివరాలను రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కి పంపించారు. ఆ సర్వే నంబర్ల ఆధారంగా భూముల క్రమబద్ధీకరణకు అక్కడి నుంచి సమాచారమిస్తున్నారు. బల్దియాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల నుంచి సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వార్డు ఆఫీసర్లు, కార్యదర్శులు సైతం ఫోన్లు చేసి రాయితీపై వివరిస్తున్నారు. 2020 ఆగస్టు 26కు ముందు భూములు కొని ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారు ఫీజును చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. అప్పుడు దరఖాస్తు చేయని వారు మాత్రం రిజిస్ట్రేషన్ కార్యాలయం వెళ్లి చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు.. గతంలో భూ యజమాని దరఖాస్తు చేసుకొని తరువాత మరొకరికి విక్రయించారు అనుకుంటే.. అలాంటి వారు ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. అయితే ఆ భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తాజాగా క్రమబద్ధీకరించుకోవచ్చని, ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించింది భూమికే కానీ వ్యక్తికి కాదని అధికారులు చెబుతున్నారు.

**పంచాయతీల్లో..** పంచాయతీల పరిధిలో మొత్తం 3,665 దరఖాస్తులు రాగా.. 2,299 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని సమాచారమిచ్చారు. నెల కిందటి వరకు ఒక్కరూ చెల్లించలేదు. రాయితీ ప్రకటించాక ఇప్పటి వరకు 172 మంది రూ.25 లక్షల వరకు ఫీజు చెల్లించారు. దరఖాస్తు నిషేధిత జాబితాలో ఉన్నా, ఏదైనా కారణాలతో తిరస్కరించినా, పూర్తి స్థాయిలో ధ్రువపత్రాలు లేకపోయినా, అనుమతి ఇవ్వకుండా తిరస్కరిస్తే.. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు తీసుకొని మిగతా మొత్తాన్ని దరఖాస్తుదారుడి ఖాతాల్లో జమ చేస్తారు.

# మత్స్యకారులకు ప్రోత్సాహం.. ఉపాధికి సహకారం

ఖమ్మం : చేపల పెంపకంపై ఆధారపడి జీవించే మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇటీవల పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సంచార చేపల విక్రయ వాహనాన్ని అందజేశారు. దీని విలువ రూ.10 లక్షలు కాగా 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. మత్స్య సహకార సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటిని మంజూరు చేస్తున్నారు. సంఘాల సభ్యులు కేవలం రూ.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

**వాహనంలో ప్రత్యేక వంటలు...**

చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఈ సంచార వాహనం ద్వారా ఉపాధి లభిస్తుంది. ఇదే వాహనంలో చేపలతో వివిధ రకాల వంటలు తయారు చేసే వెసులుబాటు ఉంటుంది. చేపల బిర్యానీ, ఫ్రై, కూర, చేపలతో పలు రకాల వంటలకు ఇది అనువుగా ఉంటుంది. ఇదే వాహనంలో బతికున్న చేపలను నిల్వ చేసుకుని తాజా వంటలను తయారు చేస్తారు. చేపలతో విలువ ఆధారిత ఉత్పత్తులను సైతం తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. నగర, పట్టణ ప్రాంతాలు లేదా రద్దీగా ఉన్న ప్రాంతాలకు వాహనం తీసుకెళ్లి వంటలు చేసుకోవచ్చు. డిమాండ్ ఎక్కడ ఉంటే అక్కడకు వాహనం చేరుకునే అవకాశం ఉంటుంది.



**మరో రెండు వాహనాలకు ప్రతిపాదనలు...**

పాలేరు నియోజకవర్గంలో ఒక వాహనం పంపిణీ చేసిన తర్వాత ఇప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు రెండు అందజేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్వయం సహాయ సంఘాల వారు డీఆర్‌డీఓ అధికారులకు దరఖాస్తు చేస్తే అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చిన తర్వాత ఇవి మంజూరయ్యే అవకాశం ఉంది. ఇలా పలు ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తులను పరిచయం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం చికెన్ ధరలు పడిపోయిన తరుణంలో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. గతంలో కిలో రూ.100 నుంచి రూ.120 ధర ఉంటే ప్రస్తుతం రూ.140 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. దీనిపై ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సంచార వాహనాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# హారన్.. మోత మోగుతోంది


హైదరాబాద్ : కూడళ్లలో గ్రీన్ సిగ్నల్ పడిన వెంటనే వాహనాల హారన్ల ధ్వనితో చెవులకు చిల్లులు పడుతున్నాయి. పలువురు వాహనదారులు అత్యంత ధ్వని తీవ్రత ఉన్న సైరన్లు, మాడిఫైడ్ సైలెన్సర్లతో బెంబేలెత్తిస్తున్నారు. పంజాగుట్ట, ఖైరతాబాద్, సంగీత్, కోఠి, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇది నిత్య కృత్యమైంది.

**ధ్వనితో దుష్పరిణామాలు..**

సాధారణంగా 85 డెసిబుల్లకు మించిన ధ్వని ఎక్కువ సమయం ఉంటే వినికిడి శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గుండె కొట్టుకునే వేగం, రక్తపీడనం పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. పనిచేసే శక్తి కోల్పోవడం, నిద్రలేమి, అలసట, తలనొప్పి, మానసికంగా, శారీరకంగా మనిషిని కుంగదీస్తుంది.

**నిర్దేశిత పరిమితులు ఇవీ...**

కాలుష్య నియంత్రణ మండలి జూబ్లీహిల్స్, తార్నాక ప్రాంతాలను నివాస ప్రాంతాలుగా, వాణిజ్య ప్రాంతాలుగా అబిడ్స్, జేఎన్టీయూ, పారిశ్రామిక ప్రాంతాలుగా సనత్‌నగర్, జీడిమెట్ల, సున్నిత ప్రాంతాలుగా జూపార్కు, హెచ్‌సీయూను గుర్తించింది. పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం 75, రాత్రి 70 డెసిబుల్లు, వాణిజ్య ప్రాంతంలో ఉదయం 65, రాత్రి 55, నివాస ప్రాంతంలో ఉదయం 55, రాత్రి 45, సున్నిత లేదా నిశ్శబ్ద ప్రాంతంలో ఉదయం 50, రాత్రి 40 డెసిబుల్ల శబ్ద తీవ్రత ఉండాలని సూచిస్తోంది. పారిశ్రామిక ప్రాంతంలో మినహా



ఇతర ప్రాంతాల్లో నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువ ధ్వని నమోదవుతోంది.


**నిబంధనలు ఉల్లంఘిస్తూ..**

ఇటీవల ఓ గ్రామ మాజీ సర్పంచ్..శంషాబాద్ నుంచి నగరంలోకి వస్తూ కూడళ్ల వద్ద, రద్దీ ప్రదేశాల్లో సైరన్ మోగించడాన్ని పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. మరో వ్యక్తి ఏకంగా ప్రభుత్వ వాహనం అని స్టిక్కర్ అతికించి సైరన్ మోగిస్తూ వెళ్తుండగా పోలీసులు బంజారాహిల్స్ వద్ద అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఫైర్ సర్వీస్, పోలీసు వాహనాలే సైరన్లు వాడాలి. అంబులెన్స్ సైరన్‌ను సైతం అత్యవసర సమయాల్లోనే వినియోగించాలని లేదంటే చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1015 సైరన్‌లను, 525 మల్టీటోన్ హారన్‌లను సీజ్ చేశారు. కోఠిలో మాడిఫైడ్ హారన్‌లు, సైరన్‌లు అమర్చుతున్న కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాటిపై చర్యలు తీసుకుంటే ధ్వని కాలుష్యం కట్టడి అవుతుందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

# పచ్చడికి.. కష్టమేనోయి..!

మేళ్లచెరువు : జిల్లాలో ఈసారి పచ్చడికి మామిడి కాయ కరవైంది. కనీసం తీపి మామిడీ జాడ లేదు. జనవరిలోనే కన్పించే పిందెలు తోటల్లో ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఈపాటికి రెండు కిలోల బరువుతో కాయలు, పండ్లు కోతకు సిద్ధంగా ఉండాలి. అక్కడక్కడ తోటల్లో మాత్రమే ఈ పరిస్థితి ఉంది. మిగతా చోట్ల ఎక్కడా ఆశించిన రీతిలో కాయ కన్పించడం లేదు.

దెబ్బతీసిన ప్రతికూల వాతావరణంగత సెప్టెంబరు నెలలో వచ్చిన వాన తొలుత మామిడి తోటల్ని దెబ్బకొట్టింది. పూత వచ్చే ముందు మామిడి తోటల్లో బెట్ట వాతావరణం ఉండాలి. దాదాపు నెల రోజులు పైనే తోటలకు నీటి అవసరం ఉండదు. వాస్తవంగా జూన్, జులై నెలల్లో వచ్చే వానలతోనే కొమ్మలు కొత్త చిగుర్లను తొడుక్కుంటాయి. రెండు నెలల తర్వాత చలి వాతావరణం ఏర్పడితే ఆ చిగుళ్లను కాస్త పూతగా మార్చుకుంటుంది. అప్పుడు కావాల్సిన నీరు పెట్టి ఎరువులు వేస్తారు.సాధారణంగా ఆగస్టు నుంచి నీరు పెట్టడం నిలిపివేస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పూత మొదలవుతుంది. ఈసారి భిన్నంగా సెప్టెంబరులో వానలొచ్చాయి. చలి కూడా అంతగా లేదు. వెరసి.. పూత రావడమే తగ్గింది. ఆలస్యం జరిగింది. నవంబరు, డిసెంబరు



నెలల్లో రావాల్సిన పూత జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనూ వస్తోంది. పూత డిసెంబరులో వస్తే జనవరిలో పిందె వస్తుంది.

సాధారణంగా పదేళ్లు దాటిన చెట్టు 1.20 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఈ ప్రాంతంలో దిగుబడి ఎకరానికి 3.5 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఏప్రిల్ ఆఖరు, లేదా మేలో కాయ కోసే అవకాశం ఉంది. ఇప్పుడు పూత వచ్చే సమయానికి ఎండలు ముదిరాయి. వెరసి.. వచ్చిన కాస్త పూత రాలుతోంది. ఈ క్రమంలో గతేడాదితో పోలిస్తే.. యాజమాన్య పద్ధతులు పాటించిన అరకొర ప్రాంతాల్లో మినహా.. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం నేపథ్యంలో తోటల్లో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు.

**విస్తీర్ణంలో స్వల్ప తేడా..**

సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 11,521 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. కొన్నేళ్ల నుంచి.. ఇరవై ఏళ్లు పైబడిన తోటలను తొలగిస్తున్నప్పటికీ.. వాటికి మూడింతల విస్తీర్ణంలో కొత్తగా మొక్కలు నాటుతున్నారు. గతేడాదితో పోలిస్తే కేవలం 200 ఎకరాల విస్తీర్ణం తగ్గింది. తోటల విస్తీర్ణంలో స్వల్ప తేడాలున్నప్పటికీ.. ఈసారి మామిడి తీపి తక్కువేనని చెప్పొచ్చు. పులుపు ఇంకా తక్కువే.

# జాబ్‌కార్డులు అందక.. ఉపాధి దొరక్క!

ఖమ్మం : ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేతతో కూలీలు ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుచేస్తున్న నేపథ్యంలో ఈ పనులకు డిమాండ్ పెరిగింది. వ్యవసాయ భూమి లేని ఉపాధి హామీ పథకం కూలీలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 2024లో ఉపాధి హామీ జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేశారు. ఈక్రమంలో గ్రామాల్లో వివాహాలైన యువతకు జాబ్‌కార్డులు లేకపోవడంతో పనులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా పల్లెల్లో జరుగుతున్న కాలువలు, ఫాంపాండ్, ఇంకుడుగుంతలు, ఫిష్‌పాండ్ వంటి పనులకు వెళ్లే అవకాశాలు లేకుండా పోయాయని దిగులు చెందుతున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ 2025-26 సంవత్సరానికి రోజువారీ వేతనాన్ని రూ.307గా నిర్ణయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.300 ఉండగా తాజా ఉత్తర్వులతో రూ.7 పెరిగింది.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో..

జాబ్ కార్డులు.. 2.23 లక్షలు

కూలీలు.. 4.59 జాబ్‌కార్డు లేకపోవటంతో ఉపాధి హామీ పనికి వెళ్లడం లేదు. కార్డు కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశాం. ఇంతవరకూ రాలేదు. ఈ విషయం గురించి ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఓ, ఎంపీడీఓ అధికారులను కలిశాం. అయినా ప్రయోజనం లేదు. తక్షణమే సమస్య పరిష్కరించి మాకు ఉపాధి హామీ జాబ్‌కార్డు ఇప్పించాలని వేడుకుంటున్నాం.

రాయరపు స్వరూప, ఊటుకూరు, కామేపల్లి మం.కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కార్డుల జారీని నిలిపివేశాం.. ఉత్తర్వులు వచ్చాక కొత్త కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నిధులు జారీ చేశాం. ఈ పథకంలో ఏడాదికి రూ.12 వేలు చెల్లింపులు ఉండగా మొదటి విడతగా రూ.6 వేలు మంజూరయ్యాయి. సీహెచ్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ఏపీడీ, ఖమ్మం

# యాదగిరి క్షేత్రంలో కన్వెన్షన్ హాల్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శుభకార్యాలు, సమావేశాల నిర్వహణకు ప్రత్యేక కన్వెన్షన్ హాల్ ఏర్పాటైంది. క్షేత్రాభివృద్ధిలో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యాన అధునాతన హంగులతో ప్రత్యేక ఫైబర్ షీట్ల ద్వారా హాల్ నిర్మితమైంది. 150 మంది పాల్గొనేలా చైర్లు ఏర్పాటు చేశారు. ఒక రోజుకు రూ.85,800 అద్దె చెల్లిస్తే హాల్ పక్కనే ఉన్న ఐదు గెస్ట్‌హౌస్‌లతో కూడిన విల్లా కేటాయిస్తామని వైటీడీఏ నిర్వాహకులు తెలిపారు. కొండ కింద ఆధ్యాత్మికవాడ సమీపాన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్ సముదాయంలోని



14 విల్లాలు సైతం యాత్రికులకు రోజు వారి అద్దెకిస్తారు. ఒక్కో విల్లాలో ఐదు గెస్ట్‌హౌస్‌లు ఉంటాయి. ఒక గెస్ట్‌హౌస్‌కు రూ.3వేలు అద్దె చెల్లించాలి. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా గెస్ట్ హౌస్ బుక్ చేసుకోవచ్చు. స్వయంభూ యాదగిరి క్షేత్రంలో వివాహాలు, కాన్ఫరెన్స్, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకుని పంచ నారసింహుల దివ్యాశీస్సులు పొందే అవకాశం కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు వైటీడీఏ చెబుతోంది.

# స్వీయ మదింపు.. జేబులు నింపు



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో కొందరు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు ప్రజల నుంచి ముడుపులు తీసుకోవడం, తర్వాత చేతులెత్తేయడం అలవాటుగా మారింది. శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్లలో ఈ తరహా వసూళ్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఆస్తిపన్ను స్వీయ మదింపు విధానాన్ని భారీగా దుర్వినియోగం చేస్తున్నారు. ఏళ్లుగా దరఖాస్తులను ఆమోదించట్లేదు. ముందుగానే ఆస్తిపన్ను తీసుకుని, ఇంటి నంబరు, పీటీఐఎన్(ఆస్తిపన్ను ఏకరూప సంఖ్య) ఇవ్వకుండా వేధిస్తున్నారు.

**దరఖాస్తులను ఆమోదించట్లేదు..**

ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఇంటి నంబరు పొందేలా జీహెచ్‌ఎంసీ 'స్వీయ మదింపు' విధానాన్ని అమలు చేస్తోంది. కొందరు అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకుంటూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో పన్ను చెల్లిస్తేనే ఇంటి నంబరు మంజూరవుతుంది. మంజూరైన ఇంటి, పీటీఐఎన్ నంబర్లు జారీ కావాలంటే సర్కిల్ అధికారి దస్త్రాన్ని ఆమోదించాలి. కానీ 70శాతం మంది సర్కిల్ అధికారులు దరఖాస్తులను ఆమోదించట్లేదు.

**పెండింగులో 5వేలు..**

30సర్కిళ్లలో 5వేల స్వీయ మదింపు దరఖాస్తులు ఏళ్లుగా పెండింగులో ఉన్నాయి. వారంతా ఆస్తిపన్ను చెల్లించారు. జీహెచ్‌ఎంసీకి పన్ను చెల్లించి, సిబ్బందికి లంచంగా ఇచ్చి కూడా పీటీఐఎన్ నంబరు పొందలేకపోతున్నామని జనాలు గగ్గోలు పెడుతున్నారు.

అడిగినంత ఇవ్వకపోతే.. రెండున్నరేళ్ల పన్నును జరిమానాగా చెల్లించాల్సి ఉంటుందని, ప్రామాణిక ధరను పెంచి ఎక్కువ చూపుతామని బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు భయపెడుతున్నారు. దాదాపు 90శాతం మంది బిల్ కలెక్టర్లు ప్రైవేటు సిబ్బందిని నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇవన్నీ తెలిసినప్పటికీ.. కేంద్ర కార్యాలయం దరఖాస్తులపై, ఏళ్లుగా 'బ్లాక్' కేటగిరిలో ఉన్న ఇంటి నంబర్లపై నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

పరిశీలనకు నోచుకోని దరఖాస్తులు 4,950

రెండేళ్లకుపైగా..490

ఏడాదిగా.. 1,495

# గుట్ట కొల్లగొట్టి.. గుల్ల చేసి..



తాండూరు : తాండూరు శివారు ప్రభుత్వ పరిధిలోని గుట్టలను అక్రమార్కులు మొరం కోసం తవ్వేస్తున్నారు. ఈ దందా రాత్రి 9 గంటలకు ప్రారంభమై తెల్లవారుజాము 4 గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ రాత్రి నుంచి తెల్లారే సరికి ఐదేసి లోడ్ల చొప్పున 40 ట్రిప్పులు తరలిస్తున్నాయి. ఒక్కో లోడ్‌కు రూ.4,000 వసూలు చేస్తున్నారు. ఇలా అనధికారిక లెక్కల ప్రకారం నిత్యం రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. గత నాలుగు నెలలుగా కొల్లగొట్టి విక్రయించిన మొరం విలువ రూ.కోట్లలో ఉందని సమాచారం. ముందస్తుగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఒప్పందం చేసుకుని తరలిస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ క్షేత్రాలు, వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**రహదారిగా మారి..:** ఎత్తైన గుట్టను మధ్యలో నుంచి తవ్వుకుంటూ వెళ్లడంతో రహదారిగా మారింది. చెట్లు తొలగిపోయాయి. యంత్రాన్ని, టిప్పర్లను ఎవరికి కనిపించకుండా నిలుపుతున్నారు. రాత్రి కాగానే రంగంలోకి దింపుతున్నారు. అయినా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. అనుమతి లేకున్నా, అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరపాలంటే, వివిధ రకాల అనుమతులకు రూ.లక్షల్లో వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేమీ లేకుండానే అక్రమార్కులు తమకున్న అండదండలతో దందా సాగిస్తున్నారు.

**8 టిప్పర్లపై కేసు నమోదు**

అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సై గిరి తెలిపిన ప్రకారం.. కోకట్ గ్రామ శివారులో అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతూ, 8 టిప్పర్లలో తరలించేందుకు సిద్ధం అవుతుండగా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి యాలాల ఠాణాకు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

# నిషేధమున్నా.. పట్టించుకోరే!

ధర్మపురి: ప్రాణాంతక వ్యాధులకు కారణమైన ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిషేధం విధించినా అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా అవసరాలు తీర్చుకోవాలని సూచించినా పాటించడం లేదు. ఉచితంగా వస్తోందని, తేలికపాటి కవర్లను వాడటానికి ప్రజలు, భక్తులు, వ్యాపారులు అలవాటు పడ్డారు. తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించినా విక్రయాలు, వినియోగం తగ్గడం లేదు.

**మొక్కుబడిగానే...**

జిల్లాలోని అయిదు పురపాలికల్లో మొక్కుబడిగానే పుర అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిషేధం అమలులో ఉన్నప్పటికీ స్థానిక అధికారులు దాడులు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నారు. జరిమానాలు అతి తక్కువ మొత్తంలో విధిస్తున్నారు. జిల్లాలోని అయిదు పురపాలికల్లో ఎక్కడ చెత్తను సేకరించినా అంతా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ సంచుల నిషేధం అమలు కమిటీలో కలెక్టర్‌తో పాటు, 10 మంది అధికారులు ఉన్నారు. నెలకోమారు ప్లాస్టిక్ నిషేధం అమలుపై చర్చించాల్సి ఉంటుంది. ఈ సమావేశాలు మొక్కుబడిగానే జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.

**నిత్యం 10 న్నులు..**

జిల్లాలోని ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పట్టణాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 10 హోల్‌సేల్ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను ఎలాంటి అమమతులు లేకుండానే విక్రయిస్తున్నారు. రోజుకు కనీసం జిల్లాలో 10 టన్నుల వరకు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయిస్తున్నారు. పురపాలికల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధించామని, సహకరించాలని వ్యాపారులను కోరడం, అడపాదడపా తనిఖీలు చేస్తూ జరిమానా



విధిస్తున్నా విక్రయాలు తగ్గడం లేదు. పట్టణాల్లో తిను బండారాలు, పండ్ల దుకాణాల ముందు పడేయడంతో ఆహార పదార్థాలు అనుకొని పశువులు కవర్లను తింటూ మృత్యువాతపడుతున్నాయి. ధర్మపురి లాంటి పుణ్యక్షేత్రాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం అధికంగా ఉంటోంది. కవర్లను కాల్చే సమయంలో వెలువడే పొగను పీల్చడం వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశముంది.

నెలనెలా దాడులుకల్లెడ రాజశేఖర్, పుర కమిషనర్, ధర్మపురి

50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే సమయంలో విక్రయదారులు, ఉత్పత్తి దారులకు ఆర్పీలు అవగాహన కల్పిస్తారు. నెలకోమారుల తప్పకుండా దాడులు చేస్తూ జరిమానాలు విధిస్తున్నాం. దుకాణాల దారులను కూడా కలిసి అవగాహన కల్పిస్తాం.

# సన్న బియ్యం.. తూకంలో వ్యత్యాసం

పెద్దపల్లి : సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ రేషన్ డీలర్లకు తలనొప్పిగా మారింది. సంచుల్లో తరుగు వస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల వరకు తగ్గుతోంది. ఇప్పటివరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది వినియోగదారులు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపక డీలర్ల వద్దనే ఉండిపోవడం, లేకుంటే డీలర్లకే విక్రయించడంతో సంచుల్లో తరుగు వచ్చినా భరించారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రతి కార్డుదారుడూ తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బస్తాల్లో తూకం వ్యత్యాసంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం మర పట్టిన తర్వాత బియ్యాన్ని సక్రమంగా తూకం వేయకపోవడంతో ఈ సమస్య నెలకొందని చెబుతున్నారు.

**ఒక్కో బస్తాకు రెండు కిలోల తేడా**

జిల్లాలో మొత్తం 413 రేషన్ దుకాణాల పరిధిలో 2,19,952 కార్డులుండగా 6,21,836 మంది సభ్యులుగా నమోదయ్యారు. జిల్లాకు ప్రతి నెలా 4,013.39 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు.





వాస్తవంగా ఒక్కో సంచి బరువు 50.500 కిలోలుండాలి. అయితే 48 కిలోలలోపే ఉంటోందని డీలర్లు పేర్కొంటున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల నష్టం వస్తోంది. అంటే ఒక డీలరుకు 100 సంచుల బియ్యం కేటాయిస్తే దాదాపు రెండు క్వింటాళ్లు తరుగు వస్తోంది. ఈ సమస్యపై డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

**సరఫరా ఆలస్యమవుతుందని..**


జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పౌరసరఫరాల శాఖ గోదాములున్నాయి. డీలర్లకు కేటాయించిన బియ్యం బస్తాలను గోదాముల్లో తూకం వేయాల్సి ఉంటుంది. సరఫరాలో ఆలస్యం అవుతుందనే కారణంతో తూకం వేయకుండానే లారీల్లో నింపుతున్నారు. బస్తాలను తూకం వేస్తే వ్యత్యాసం వచ్చే అవకాశం లేదు. తమ కోటా ఆధారంగా బియ్యం తరలిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. దొడ్డు బియ్యం సంచులు నెలల తరబడి నిల్వ ఉండటంతో చిరిగి తూకంలో వ్యత్యాసం ఉండేది, సన్న బియ్యం ఇటీవల మర పట్టినవే కావడంతో వ్యత్యాసం వచ్చే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు దుకాణాలపై ఆరా తీస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం బస్తాను తూకం వేశారు. సంచితో కలిసి 50.500 కిలోల బరువు ఉండటానికి బదులు 48.360 కిలోలు మాత్రమే ఉంది. అంటే 2.14 కిలోల బరువు తగ్గింది.

**ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం**

బియ్యం తూకంలో వ్యత్యాసం ఉండే అవకాశం చాలా తక్కువ. బస్తా కచ్చితంగా 50 కిలోల బరువు ఉంటుంది. అక్కడక్కడ తేడా ఉన్నట్లు చెబుతున్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తాం.శ్రీకాంత్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

# ఇల్లు చల్లగా.. ఇలా

భానుపురి : రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళితే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక ఇళ్లలో రాత్రిపూట ఉడికిస్తోంది. చల్లదనం కోసం అందరికీ ఏసీలు ఏర్పాటు చేయించుకునే స్తోమత ఉండదు. అందుబాటులో ఉన్న ఫ్యాన్లు, కూలర్లు నడిచినా ఇళ్లలో గదులోంచి వేడి బయటకు వెళ్లదు. కూలర్లు నడిచినప్పటికీ శరీరం జిగటగా మారుతుంది. ఈ నేపథ్యంలో గదిని ఎలా చల్లగా ఉంచుకోవాలనే విషయంపై అవగాహన పొందాల్సిన ఆవశ్యకత ఉంది.



**నిపుణుల సూచనలు...**ఇంట్లో ఫ్యాన్లు నడిచినా పైకప్పు నుంచి వచ్చే వేడి గదిలోనే తిరుగుతుంది. సీలింగ్ ఫ్యాన్‌ఉన్న వారు గది తలుపులు, కిటికీలు తెరిచి ఫ్యాన్ వేసుకోవాలి. ఇలా వేస్తే వేడి గాలి గడి నుంచి ఎప్పటికప్పుడు బయటకు పోతుంది. టేబుల్ ఫ్యాన్ ఉన్నవారు కిటికీ దిశగా అమర్చుకోవలి. ఇలా చేయడంతో బయట ఉండే చల్లగాలి కిటికీ ద్వారా గదిలోకి వచ్చి వాతావరణం చల్లగా ఉంటుందిచాలా మంది కూలర్లను గదిలో పెట్టుకొని నిద్రిస్తుంటారు. కిటికీకి ఎదురుగా అమర్చుకొంటే బయట నుంచి వచ్చే చల్లని గాలితో గది త్వరగా చల్లబడుతుంది.ఇంటి ఆవరణలో వీలైనన్ని మొక్కలు పెంచుకోవాలి. ఇంటి చుట్టూ చెట్లు ఉంటే ఆవరణ చల్లగా ఉంటుంది. ఆవరణలోని మొక్కలకు సరిగా నీళ్లు పట్టాలి.కాంక్రీట్‌తో నిర్మించిన ఇళ్లు త్వరగా వేడెక్కుతాయి. మార్కెట్‌లో కూల్‌సిమెంటు దొరుకుతుంది. నాణ్యమైనది ఎంచుకుని ఇంటిపైన వేసుకొంటే ఎండ నుంచి గదిని చల్లగా ఉంచుతుంది.టెర్రస్ గార్డెన్ నిర్వహించుకొంటే ఇళ్లు చల్లగా ఉంటాయి.

# పేద రోగుల పెన్నిధి

అనకాపల్లి : వ్యాధి నిర్ధారణ అయితే వైద్యం చేయడం సులభం. దీనికి ల్యాబ్‌లో పరీక్షలు అవసరం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేయడానికి వీలు లేకపోవడంతో పేద రోగులకు ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లా ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను నెలకొల్పాలని నిర్ణయించారు.
జిల్లా ఆసుపత్రిలో జనరల్ ల్యాబ్, మైక్రోబయాలజీ, ఐసీటీసీ, పీపీటీసీటీ, సీబీనాట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తున్నారు. దీంటో పాటు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారు. జనరల్ ల్యాబ్‌లో ఇటీవల సీబీసీ ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్ అందుబాటులోకొచ్చింది. ఒకేసారి 100 నమూనాలను ఇందులో పరీక్ష చేయొచ్చు. రోజుకు 600 నుంచి 800 రకాల పరీక్షలను చేస్తున్నారు. సెమీ ఆటోమెటిక్ సీబీసీ మిషన్ ఇదివరకు ఉండేది. ఇప్పుడు ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. థైరాయిడ్ పరికరంతో పరీక్షలు చేస్తున్నారు.



**మైక్రోబయాలజీలో..**
జనరల్ ల్యాబ్‌లో మూత్ర, రక్తపరీక్షలు కలిపి 63 వరకు జరుగుతున్నాయి. మైక్రోబయాలజీకి సంబంధించి 10 పరీక్షలు చేస్తున్నారు. గుండెకు సంబంధించి ట్రాఫిక్‌ఐ, ట్రాఫిన్‌టీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్ష చేస్తున్నారు. హెచ్‌బీఏఐసీలో మూడునెలలకు సంబంధించి రోగి శరీరంలో చక్కెరకు సంబంధించిన పరీక్ష ఇక్కడ జరగడం లేదు. ఇది బయట చేయించుకోవాల్సి వస్తోంది. 'జిల్లా ఆసుపత్రిలో ఇంటిగ్రెటెడ్ ల్యాబ్‌ను పెట్టాలని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించారు. దీంట్లో భాగంగా అనకాపల్లి ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసే ల్యాబ్ అందుబాటులోకి రానుంద'ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు.
**వ్యాధి నిర్ధారణ చేపట్టేలా...**
– డాక్టర్ ఉప్పాడ రమేశ్, పేథాలజిస్టు, జిల్లా ఆసుపత్రి
ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రక్తపరీక్షలు చాలావరకు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటుతో మరిన్ని పరీక్షలు అందుబాటులోకొస్తాయి. అనకాపల్లి ఆసుపత్రిలో ఇద్దరు పేథాలజిస్ట్‌లు ఉన్నా. మరిన్ని సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నాం.

# పోలీసు శాఖలో ప్రక్షాళన

చిత్తూరు : జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్యపై పలమనేరు ఎమ్మెల్యే పోలీసు శాఖపై తీవ్ర స్థాయిలో మండిపడిన విషయం విదితమే. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో వైకాపాకు ఒత్తాసు పలికే పోలీసులే విధులు నిర్వహిస్తున్నారని.. ప్రతి విషయాన్ని పార్టీకి చేరవేస్తున్నారని, వారి ద్వారా అక్రమ వ్యాపారాలన్నీ సాగుతున్నాయని ఆరోపించారు. ఇలా పోలీసు శాఖపై ఒక్కసారిగా ఆరోపణలు రావడంతో ఎస్పీ అప్రమత్తమయ్యారు. బదిలీ ప్రక్రియ ప్రారంభించారు. 45 మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 219 కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో పనిచేసే వారే సుమారు 25 మంది ఉన్నారు. అందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా ఉన్నారు.
**అసంతృప్తి సెగలు** పోలీసు శాఖపై విమర్శలు వస్తుండడంతో ఎస్పీ బదిలీల ప్రక్రియ ప్రారంభించినా.. అందులోనూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అడగకుండా బదిలీ చేసినా పర్వాలేదు కాని.. ఎలాంటి ఆరోపణలు లేని వారిని కూడా అడగకుండా బదిలీ చేయడంతో పోలీసు శాఖలోనే అసంతృప్తి సెగలు వస్తున్నాయి. 4-5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరిని బదిలీ చేయాల్సి ఉంది. దీని కోసం ఒక్కొక్కరి నుంచి మూడు ఆప్షన్‌లు తీసుకుని బదిలీ చేస్తుంటారు. 219 మందిని బదిలీ చేయాల్సి ఉండగా.. రాత్రే అందరి బదిలీలు పూర్తి చేశారు. 219 మందికి ఎలాంటి కౌన్సెలింగ్ లేదు. **ఉనికి చాటుకోవడానికేనా?**'పోలీసు శాఖలో ఎవరి మాట వినను. రాజకీయ నాయకుల సిఫార్సులొస్తే తిప్పికొడతా..' అని చెప్పిన ఎస్పీ విమర్శలు మూటగట్టుకున్న అనంతరం శాంతించారు. మొదట్లో సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని.. జూద స్థావరాలు, లాటరీ వ్యాపారాలు, మద్యం అక్రమ రవాణా, ఇతర అక్రమ వ్యాపారాలపై ఆకస్మిక దాడులు చేశారు. రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చినా మొండిగానే వ్యవహరించారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ ఒక్క సారిగా ప్రత్యేక బృందాల దాడులు ఆగిపోయాయి. అక్రమ వ్యాపారాలన్నీ ఒకొక్కటిగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుత బదిలీలు కూడా తన ఉనికి చాటుకోవడానికే అని పలువురు పేర్కొంటున్నారు.

# భూముల్లో తీగలు.. ఉండవిక బాధలు

గురుద్వారా : విపత్తుల సమయంలో విద్యుత్తు వ్యవస్థ చిన్నాభిన్నమై సరఫరాకు అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. ఈ సమస్య అధిగమించేలా భూగర్భ విద్యుత్తు తీగల వ్యవస్థ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు నిధులతో రూపకల్పన చేశారు. తొలి విడతగా నగరంలో ఇదివరకు రూ.800 కోట్లతో జోన్-1 పరిధిలో వన్‌టౌన్ మొదలుకొని రుషికొండ వరకు సముద్రతీర ప్రాంతంలో పనులు చేశారు. పలు కారణాల రీత్యా కొన్నేళ్లుగా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం ఆర్‌డీఎస్‌ఎస్(రీవేంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద రెండో విడత పనులు పునఃప్రారంభించారు. వీటికోసం రూ.973.44 కోట్లు కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో కూర్మన్నపాలెం నుంచి ఆనందపురం వరకు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో ఇంటి నుంచి విద్యుత్తు స్తంభాలకు వెళ్లే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకి సరఫరా చేసే హెచ్‌టీ తీగలు అంతా కలిపి భూగర్భంలోనే వేశారు. దీనివల్ల ఆర్థికభారం అధికమవ్వడంతో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో స్వల్ప మార్పులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 33, 11కేవీ విద్యుత్ తీగలు మాత్రమే భూగర్భంలోకి వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు.. 33కేవీకి సంబంధించి రూ.340 కోట్లతో 547 కిలోమీటర్ల వరకు, రూ.633 కోట్లతో 11కేవీ తీగలు 1740 కిలోమీటర్ల వరకు వేస్తున్నారు. ఆటోనగర్‌లో జరుగుతున్న పనులను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెళ్లి పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు.

# నట్టేట ముంచిన నాసిరకం నార




ముదిగుబ్బ: మిరపలో ఓ వైపు తెగుళ్లు వ్యాపించి నష్టం కలిగిస్తుంటే.. మరోవైపు వ్యాపారులు విక్రయించే నాసిరకం విత్తనాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. ముదిగుబ్బ మండలంలో మిరప సాగు చేసిన రైతులు దిగుబడి సక్రమంగా రాకపోగా కాయ రంగు మారడంతో లోపం ఉన్నట్లు గుర్తించారు. నార విక్రయించిన నర్సరీ యజమానిని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగుచేస్తే చివరికి దిగుబడి లేక ఆశలు అడియాశలయ్యాయి. ఆరుగాలం కష్టపడే రైతన్నలకు నాసిరకం విత్తనాలు శాపంగా మారడంతో నష్టాల్లో కూరుకుపోతున్నారు.
ధర్మవరం నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం మిరప పంట 65 ఎకరాల్లో సాగైంది. ముదిగుబ్బ మండలంలో ప్రధానంగా సంకేపల్లి, గాండ్లవారిపల్లి గ్రామాల్లో సాగు చేసిన మిరప కాయలు పసుపు రంగులోకి మారడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సంకేపల్లికి చెందిన పుల్లయ్య నార్పల మండలంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ నర్సరీలో ఆర్‌షాట్‌వన్ రకానికి చెందిన ఒక్కో మొక్క రూ.1తో 38 వేల మొక్కలు కొనుగోలు చేశారు. గత జనవరిలో ఒక ఎకరా విస్తీర్ణంలో మిరప సాగుచేయగా 70 రోజులకు కోతకొచ్చింది. కాయ చిన్నసైజు రావడంతోపాటు సగానికిపైగా పసుపు రంగులోకి మారాయి. మార్కెట్‌కు తరలించినా ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో పారబోశాడు. రూ.లక్షలు పెట్టుబడి పెడితే రూ.20వేలు మాత్రమే వచ్చిందని ఆవేదన చెందారు. నాసిరకం నార కొనుగోలు చేసి మోసపోయిన రైతులు చాలామంది ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.
**జోరుగా విక్రయాలు..**
ఉమ్మడి అనంతపురం జిల్లాలో మిరప నాసిరకం విత్తనాలు, నార విక్రయాల జోరు పెరిగింది. ప్రధానంగా అనంతపురం, నార్పల, ముదిగుబ్బ, బత్తలపల్లి, తనకల్లు, నల్లచెరువు, పులివెందుల నర్సరీల నుంచి కొనుగోలు చేసిన మొక్కల్లో నాసిరకం ఎక్కువగా ఉంటున్నాయి. మొలకలు సక్రమంగా రాకపోవడం, పూత దశలో ఎండిపోవడం, కాయ చిన్నసైజు రావడం, దిగుబడి లేకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. విత్తనాలు విక్రయించే దుకాణాలు, నర్సరీ యజమానులు నిబంధనలు పాటించడం లేదు.
మోసపోయాం..– శివప్రసాద్, గాండ్లవారిపల్లి
ఒక ఎకరాలో రూ.లక్షల పెట్టుబడి పెట్టి మిరప పంట సాగు చేశా. కోతకొచ్చే సమయానికి కాయలు పసుపు రంగులోకి మారడంతో మార్కెట్‌లో అమ్ముడుపోవడం లేదు. నర్సరీ యజమానికి అడిగితే సమాధానం ఇవ్వలేదు. అధికారులు నాసిరకం నార అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి.
**రసీదులు తప్పనిసరి– అమరేశ్వరి, ఉద్యానశాఖ అధికారిణి**
నర్సరీల్లో మొక్కలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. అవి ఉంటే నష్టపోయిన వారికి పరిహారం అందించేందుకు వీలుంటుంది. నాసిరకం నార విక్రయించే నర్సరీలను గుర్తించి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

# ఖాళీ జాగాయేగా.. కాజేద్దాం!



కడప : దక్షిణాన కేసీ కాలువ...ఉత్తరాన పాతకడప చెరువు, తూర్పున మత్స్యశాఖకు చెందిన భూమి, పడమరన నీటిమునక ప్రాంతం ...ఈ నాలుగు దిక్కుల మధ్యన గల భూమి మాదేనని కొందరు పెద్దలు మట్టితో చదును పనులు చేశారు. 1927లో ఈ భూమిలోని కొంత భాగాన్ని అక్షరాల రూ.48లకు, 1942లో మరికొంత భాగాన్ని అక్షరాలా రూ.830లకు క్రయవిక్రయాలు జరిగినట్లు పత్రాలను సిద్ధం చేశారు. నిన్నటివరకు చెరువులా కనిపించిన భూమిని చదును చేయడానికి టిప్పర్లతో వందల ట్రిప్పుల మట్టిని పోశారు. యంత్రాలతో భూమిని చదునుచేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కబ్జా చేస్తున్నారని పాతకడప చెరువు నీటి సంఘం నాయకులు, రైతులు గుర్తించి అడ్డుకున్నారు. తహసీల్దారుతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చదును పనులు చేస్తున్న వాహనాలను అధికారులు తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.
**మత్స్యశాఖ అమ్ముడుపోయిందా?**
పాత కడప చెరువుగా రైతులు పేర్కొంటున్న భూమిలోకి వాహనాలు వెళ్లడానికి ఎలాంటి మార్గం లేకపోగా, భారీ వాహనాలు వెళ్లడానికి మత్స్యశాఖాధికారులు దారి చూపించారు! దేవుని కడప రోడ్డులోని మత్స్యశాఖ కార్యాలయంలోకి ప్రైవేటు వాహనాలను అనుమతించరు. అలాంటిది టిప్పర్లు, జేసీబీలు వెళుతుంటే ఆ శాఖ అధికారులు ఏం చేస్తున్నట్టు ? ఆ శాఖకు చెందిన అధికారులను కొనేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ భూమిని పూర్తిగా చదును చేసి ప్లాట్లుగా మారిస్తే అక్కడకు రాకపోకలు సాగించడానికి కూడా ఈ దారిని ఇచ్చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
**అధికారులకు కనిపించలేదా?**
కేసీ కాలువ-పాతకడప చెరువు మధ్య గల ఈ భూమిలో గత పది పది రోజులుగా మట్టితో చదును పనులు చేస్తుంటే నీటిపారుదల, రెవెన్యూ శాఖలతోపాటు కడప నగరపాలక సంస్థ అధికారులు ఎందుకు ఊరుకున్నారు ? కేసీ కాలువకు పక్కన బండ్లబాటతోపాటు కొంత బఫర్ జోన్ ఉంది. దీనిని సైతం మట్టితో పూడ్చేస్తున్నా కేసీ కాలువ అధికారులు ఎందుకు ఇటువైపు చూడలేదు? కడప నగరపాలక సంస్థ పరిధిలోని అతిపెద్ద జలవనరు వద్ద ప్లాట్లు వేయడానికి సన్నాహాలు చేస్తుంటే నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం ఏం చేస్తున్నట్లు ? ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో అప్పటి నగర నాయకులకు అత్యంత సన్నిహితులైనవారు చెరువును కబ్జా చేసి ప్లాట్లు వేశారన్న అరోపణలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించి నిషేధిత లేఅవుట్ జాబితాలో చేర్చారు. దీనికి కొనసాగింపుగా తాజాగా పాతపత్రాల పేరుతో పాత కడప చెరువు ప్రాంతంలో మట్టితో చదును పనులు చేయడం కలకలం రేపుతోంది.
**పంటలు సాగు చేయొచ్చు గానీ...** – నిమ్మకాయల నారాయణరెడ్డి, పాతకడప చెరువు నీటి సంఘం అధ్యక్షుడుపాత కడప చెరువు విస్తీర్ణం 465 ఎకరాలు. గత ఐదేళ్లుగా ఈ విస్తీర్ణంలోని భూమిలో లేఅవుట్ వేయడం, ప్లాట్లు ఏర్పాటు చేయడం, ఇళ్లు కట్టడం చేస్తున్నారు. కేసీ కాలువకు పాతకడప చెరువుకు మధ్య పట్టా భూమి ఎవరిదైనా ఉన్నా ఆ భూమిలో పంటలు సాగు చేసుకోవాలే తప్ప నివాస ప్రాంతాలుగా మార్చకూడదు. పాతకడప చెరువు పరీవాహక ప్రాంతాన్ని నివాస స్థలాలుగా మారుస్తున్న వైనంపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని అధికారులను కోరుతున్నాం. సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

# పేరుకే పెద్దాసుపత్రి!



రాయచోటి: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అరకొర వైద్యసేవలందుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులకు గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వైకాపా నాయకులు ఆ పార్టీ రంగులద్ది అరకొర వసతులతోనే ప్రారంభించారు. రోగులకు మెరుగైన వసతులు కల్పించకపోవడంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వంద పడకలుగా ఉన్నతీకరించిన ఆసుపత్రిలో భవనాల నిర్మాణం పూర్తి కాకుండానే గుత్తేదారుపై వైకాపా నేతలు ఒత్తిడి తెచ్చి ప్రారంభించారు. కేవలం గదుల నిర్మాణం పూర్తికాగా, లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టలేదు. – ఆధునిక వసతులతో ఏర్పాటు చేయాల్సిన శస్త్రచికిత్స గది పనులు నేటికీ పూర్తికాలేదు. పాత గదిలోనే అరకొర వసతుల మధ్య శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. – మురుగునీటి పారుదల వ్యవస్థ పూర్తి చేయకపోవడంతో రోగుల గదుల నుంచి వచ్చే మురుగు నీరు దుర్వాసన వెదజల్లుతోంది. – దాత ఏర్పాటు చేసిన శుద్ధి జలం యూనిట్ తరచూ మరమ్మతులకు గురవ్వడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – రోగుల సహాయకులు అవసరమైన వసతులు లేకపోవడంతో ఆసుపత్రి ఆవరణలోనే నేలపై దోమల మధ్య విశ్రాంతి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.
ఆసుపత్రికి రాయచోటి, రాజంపేట, పీలేరుతోపాటు శ్రీసత్యసాయి జిల్లా నుంచి రోజు 700 మంది వరకు వస్తుంటారు. అందుకు తగ్గట్టుగా వసతులేకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలందడంలేదు. ఇక్కడ వివిధ వైద్య విభాగాలకు 24 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 21 మంది పనిచేస్తున్నారు. వీరిలో సగం మందికి ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీరు రోగులను తమ ఆసుపత్రులకు రెఫర్ చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మరోపక్క మందుల కొరత పీడిస్తోంది. వైద్యులు రాసిన మందుల్లో చాలా వరకు లేవని సిబ్బంది చెప్పి వెనక్కి పంపుతుండడం గమనార్హం.
నా పేరు ఖాదర్‌వలీ. మాది మాధవరం. ఇంటి వద్ద కాలువపై రాయి పెడుతుండగా ప్రమాదవశాత్తు పడడంతో కాలికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వస్తే పారిశుద్ధ్య సిబ్బందేగాయానికి కట్టుకట్టి కడపకు వెళ్లమన్నారు.
నా పేరు రాజేంద్ర. మాది సుండుపల్లి మండలం బెస్తపల్లి. తలకు గాయం కావడంతో ఆసుపత్రికి వస్తే సిబ్బంది కట్టుకట్టి కడపకు వెళ్లమని పంపించేశారు. కనీసం మందులు కూడా ఇవ్వ లేదు. కడపకు వెళ్లే పరిస్థితి లేక వైద్యుని కోసం వేచి ఉండాల్సి వచ్చింది. మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం
ఆసుపత్రిలో వసతుల కల్పన, సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాం. అత్యవసర పరిస్థితుల్లోనే రోగులను రెఫర్ చేస్తున్నాం.

# నీరు ఇంకింది.. ఇసుక ఆగింది

కర్నూలు : తుంగభద్రలో ఇసుక నిల్వలు ఖాళీ అయ్యాయి.. సుంకేసుల జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో డీసిల్టింగ్ పాయింట్లలో తవ్వకాలు నిలిపేశారు. ప్రస్తుతం 1,500 టన్నులు అందుబాటులో ఉంది ఉదయానికి ఖాళీ కానుంది. సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల పరిధిలో ఐదు డీసిల్టింగ్ పాయింట్లున్నాయి. సుంకేసుల జలాశయం వెనుక ప్రాంతంలో.. తుంగభద్ర నదిలో నీరు ఉంటేనే డ్రెడ్జింగ్ చేసి బోట్ల సాయంతో ఇసుక తవ్వకాలు చేపడతారు. ప్రస్తుతం ఎగువ నుంచి నీరు రావడం లేదు.. జలాశయంలో 0.750 టీఎంసీ ఉన్నా బోట్ల ద్వారా వెళ్లి ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలవుతుంది. ప్రస్తుతం 0.5 టీఎంసీ మాత్రమే ఉండటంతో తవ్వకాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎగువ నుంచి నీరు రాకపోతే డీసిల్టింగ్ పాయింట్లు మూతపడే పరిస్థితి నెలకొంది.
**అనుమతులకు నిరీక్షణ**
మరళి-1లో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్నప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇక మరళి-2 ఇసుక రీచ్‌లో సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో ఇసుక



తవ్వకాలకు అనుమతులున్నాయి. రీచ్ వరకు ఇసుక రవాణా చేసేందుకు రోడ్డు వేయాల్సి ఉంది. ఈ రెండు రీచ్‌లలో అనుమతులు వచ్చేందుకు, రహదారి నిర్మాణానికి 10-15 రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రీచ్‌ల నుంచి 50 వేల టన్నుల ఇసుక లభ్యత ఉంది.
**అక్కడికెళ్లాలంటే తడిసిమోపెడు**
కర్నూలు నగర ప్రజలు ఇసుక కోసం కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి ఇసుక రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. కౌతాళం మండలం గుడికంబాలి, నదిచాగి ఇసుక రీచ్‌ల్లో ప్రస్తుతం 3 లక్షల టన్నుల నిల్వలున్నాయి. గుడికంబాలిలో ఒక టన్ను రూ.39, నదిచాగిలిలో రూ.40 మాత్రమే.
కర్నూలు నగరవాసులకు ఇసుక కావాలంటే 150 కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాలి.
డీసిల్టింగ్ పాయింట్ల నుంచి నంద్యాలకు నిత్యం సుమారు 2 వేల టన్నుల ఇసుక తరలిస్తున్నారు. బుధవారం నుంచి పూర్తిగా ఆగిపోనుంది. కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి నుంచి నంద్యాలకు 18 టన్నుల ఇసుక లోడు లారీకి రవాణా ఛార్జీలతో కలిసి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రవాణా భారం పడనుంది.
డీసిల్టింగ్ పాయింట్ల నుంచి కర్నూలుకు 18 టన్నుల ఇసుక లారీ వచ్చేందుకు రూ.10 వేలు ఖర్చవుతుంటే.. అదే కౌతాళం మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి కర్నూలుకు ఇసుక రవాణా చేసేందుకు ఒక లారీకి రూ.10 వేల వరకు అదనపు భారం పడుతుంది.

# 'పల్లె'వించని ప్రగతి

నంద్యాల : ఊళ్లను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఉపాధికి దూరం చేశారు. గత పాలకుల స్వార్థంతో 2021 పుర ఎన్నికల ముందు లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు గ్రామాలను కర్నూలు నగర పాలకలో, రైతునగరం, కాంతినగర్, పొన్నాపురం కాలనీ, బీటీ నగర్, పొన్నాపురం, వెంకటేశ్వరపురం, ఉడుమాల్పురం గ్రామాలను నంద్యాల మున్సిపాల్టీలో విలీనం చేశారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు ఉపాధి నిధులు దండిగా వచ్చేవి.. పనులు జరిగేవి.. కూలీలకు ఉపాధి దొరికేది.. మున్సిపాలిటీల్లో విలీనం చేసి పన్నులు పెంచారు.. ప్రగతిని దూరం చేశారు.. నాలుగేళ్లుగా సమస్యల్లో నలిగిపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
**61 వేల మందికి అవస్థలు**
విలీనమైన గ్రామాల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. పది గ్రామాల్లో 61 వేల మంది నివాసం ఉంటున్నారు. విలీనానికి ముందు రైతునగరం పంచాయతీ పరిధిలో 275, కాంతినగర్ 125, ఉడుమాల్పురం 285, పొన్నాపురంలో 450, లక్ష్మీపురంలో 350, పెద్దపాడు 250, పందిపాడులో 320 మంది జాబ్‌కార్డులు ఉండేవి.
ఉపాధి జాబ్‌కార్డులున్న వారంతా ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్తూ సంపాదించుకునే వారు. ఆయా గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన తర్వాత పనులు చేపట్టడం లేదు. జాబ్‌కార్డులు చెల్లుబాటు కావడం లేదు. ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా ఉన్న అన్ని రాయితీ పథకాలను రద్దు చేశారు.
**వేధిస్తున్న అసౌకర్యాలు**
నంద్యాల మున్సిపాల్టీలో విలీనమైన ఉడుమాల్పురం, వెంకటేశ్వరపురం గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కుంట నుంచి మోటార్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటినే ఈ గ్రామాల ప్రజలు తాగుతున్నారు.కాంతినగర్ కాలనీలో ట్యాంకు సిద్ధమైనా మున్సిపాల్టీ నుంచి నీరు సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.పొన్నాపురం, బీటీ.నగర్, పొన్నాపురం కాలనీలు బోరు నీటిపైనే ఆధారపడ్డాయి.
ఒక్కో గ్రామానికి రూ.2 కోట్ల నష్టం
ఒక గ్రామంలో 100 మంది ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నట్లయితే.. ఒక్కో వేతనదారు ఏడాదిలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకుంటే 10 వేల పని దినాలు జరిగినట్లు లెక్క. రోజు కూలి రూ.300 లెక్కన వేసుకుంటే ఏడాదికి రూ.30 లక్షలు కూలి రూపంలో కోల్పోయినట్లే. ఇదే సమయంలో 40 శాతం ఇచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మరో రూ.20 లక్షలు నష్టపోయినట్లే. మొత్తం రూ.50 లక్షలు కోల్పోయినట్లే. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పనులు జరగకపోవడం వల్ల ఒక్కో విలీన గ్రామం రూ.2 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది.
**రాయితీ పథకాలకు దూరం**
ఉపాధిహామీ పథకం గ్రామాలకే పరిమితం. ఈ పథకం కింద కూలి పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 90 శాతం రాయితీతో మినీ గోకులాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.జాబ్‌కార్డులు ఉన్న వారికే పశుగ్రాస క్షేత్రాలను మంజూరు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు విలీన గ్రామాల ప్రజలు దూరమయ్యారు. మరోవైపు చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పంటకుంటలు, ఇళ్ల ముంగిట తవ్వుకునే ఇంకుడు గుంతలనూ వీరికి మంజూరు చేయడం లేదు.

# డిజిటల్ బాట.. అక్రమాలకు అడ్డుకట్ట

ముమ్మిడివరం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే పనులు చివరి దశకు చేరాయి. దస్త్రాలను డిజిటలైజేషన్ చేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులకు అందించే సేవల్లో పారదర్శకత, రుణాల మంజూరు, ఇతర వ్యవహారాల్లో అక్రమాలకు ఆన్‌లైన్ విధానంతో అడ్డుకట్ట వేయవచ్చు.

**అంతా పాత పద్ధతిలో..**

పీఏసీఎస్‌లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కాకినాడ) పరిధిలో పనిచేస్తున్నాయి. రైతులకు రుణాలు, సున్నా వడ్డీ, బంగారం కుదువపెట్టుకుని రుణాలు, డిపాజిట్ల సేకరణ ఇలా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి అన్ని సేవలూ అందిస్తున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నోడల్ ఏజెన్సీలుగా పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయి. వీటన్నిటినీ దస్త్రాల్లో పొందుపర్చడం, రశీదులు చేతిరాతతో ఇవ్వడం మినహా ఆన్‌లైన్ విధానం లేదు. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

**కేంద్రం ఆదేశించినా..**

జాతీయ స్థాయిలో ఒకే విధమైన సహకార వ్యవస్థ అందుబాటులోకి



తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే కార్యాచరణ రూపొందించింది. కేంద్రమే నిధులు సమకూర్చి కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలు అందజేసింది. గత వైకాపా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం 80 శాతానికిపైగా దస్త్రాల కంప్యూటరీకరణ పూర్తయింది.

**పారదర్శకతకు అవకాశం**

పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు వచ్చే ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకురావడానికి డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేశాం. సాంకేతిక సమస్యలు అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాం. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రావడంతో పారదర్శక సేవలకు అవకాశం ఉంటుంది. ఎస్.మురళీకృష్ణ, జిల్లా సహకార అధికారి

జిల్లా సమాచారం ఇలా..

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు: 166

సంఘాల్లో సభ్యులు: 1.30 లక్షలు

లాభాల్లోని సంఘాలు: 117

నష్టాల్లో కొనసాగుతున్నవి: 49

# వసతుల్లేక.. అవస్థలు పట్టక

నిడదవోలు : ఉపాధిహామీ వేతనజీవులకు ఎండల నుంచి ఉపశమనం కోసం గతంలో టెంట్లు సమకూర్చేవారు. పనిచేసే సమయంలో గాయమైతే ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఎండనుంచి ఉపశమనం కలిగించేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ సరఫరా చేసేవారు. ఇవన్నీ గత తెదేపా హయాంలో కల్పించిన సౌకర్యాలు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇవన్నీ దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో మాదిరిగా వసతులు సమకూరుతాయనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సైతం వారి ఇబ్బందులను గుర్తించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులు ఆదేశాలు జారీచేశారు.

గత తెదేపా హయాంలో ఉపాధి పనులు చేసేచోట నీడకోసం టెంట్లు వేసేవారు. తాగడానికి నీరు, గాయమైన ప్రథమ చికిత్స మందులు, వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేవి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవన్నీ కనుమరుగయ్యాయి. పనిచేసే సమయంలో గాయమైతే గట్లపై ఉండే ఆకురసం రాసుకుని, తర్వాత ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాల్సిన పరిస్థితి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీపంలోని ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయి, వాటిని తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సిబ్బంది తీసుకెళుతున్న దాఖలాలు లేవు. వడదెబ్బ తగిలిన కూలీకి ఉపశమనం కలిగించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కూలీలు ఇంటికి వచ్చేసరికి నీరసించిపోతున్నారు. పనిచేసే చోట మజ్జిగ మాట అటుంచి తాగునీటి సదుపాయమైనా లేదు. వెంట తీసుకెళ్లిన నీరే ఒబ్బిడిగా వాడుకోవాల్సిందే. వేసవి నేపథ్యంలో కూడా తీసుకెళ్లిన నీటిసీసాలు ఎండ తీవ్రతకు వేడెక్కిపోతున్నాయి. టెంట్లు లేక చెట్లనీడన సేద తీరాల్సిన దుస్థితి. ఉపాధిహామీ పథకం అమలులో తీసుకొచ్చిన మార్పులు వేతనజీవులపై శరాఘాతంగా మారాయి. రెండు పూటల పనికి దూరంగా వెళ్లి రావడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం..**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం వద్ద ఉన్న మెడికల్ కిట్లు తీసుకుని కూలీలకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. తాగునీటికి అయ్యే ఖర్చును వారి వేతనంలో కలిపి అందిస్తున్నాం. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా, నీరసించిపోకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించాం. ఎక్కువ మంది కూలీలు ఉన్న చోట ప్రత్యామ్నాయంగా నీడ కోసం కొబ్బరి, తాటాకు పందిళ్లు వేయాలని చెబుతున్నాం. మజ్జిగ సరఫరాకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. రామ్‌ప్రసాద్, ఏపీడీ, డ్వామా

జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే...

మండలాలు 18

పంచాయతీలు 300

మొత్తం జాబ్‌కార్డులు 1.68 లక్షలు

మనుగడలో ఉన్నవి 1.28 లక్షలు

మొత్తం కూలీలు 2.59 లక్షలు

ప్రస్తుతం అన్నీ రకాల పనులకు వచ్చేవారు 1.78 లక్షలు

రోజూవారీ కూలీలు 10,428

# 'తూము'తవ్వండి.. మడి తడపండి




కర్నూలు : ఉమ్మడి జిల్లాలో కృష్ణమ్మ పారుతున్నా చేనుకు నీరు చేరడం లేదు.. పదేళ్ల కిందట హంద్రీ కాల్వ తవ్వారు.. చివరికి భూములిచ్చిన రైతు పొలానికీ నీరు అందడం లేదు.. పంట కాల్వలు తవ్వాలని ఏళ్లుగా అన్నదాతలు విన్నవిస్తున్నారు. రూ.660 కోట్లతో విస్తరణ పనులకు 'కూటమి' ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఈ నేపథ్యంలో ప్రధాన కాల్వ వెంట 'తూము'లు నిర్మిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.. మల్యాల నుంచి పత్తికొండ వరకు 18 చోట్ల తూములు ఏర్పాటు చేస్తే 16,670 ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు ఇవ్వొచ్చని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఒక్కో దాని వెంట 5-8 క్యూసెక్కులు ప్రవహించేలా రంధ్రం ఏర్పాటు చేసి గేటు బిగిస్తే అవసరమైన సమయంలో విడుదల చేసుకోవచ్చు.. లేదంటే మూసి వేయొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**విస్తరణకు కూటమి అడుగులు**

హంద్రీనీవా ప్రధాన కాల్వలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 2,200 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచేలా విస్తరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 15 నాటికి పూర్తయ్యేలా శరవే'గంగా' పనులు చేపడుతున్నారు.

రూ.256 కోట్లతో ప్యాకేజీ-1 పనులు, రూ.440 కోట్లతో ప్యాకేజీ-2 పనులను పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-2లో 89వ కి.మీ.ల నుంచి 134 కి.మీ.ల దూరం వరకు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఉంది. విస్తరణ అనంతరం కాల్వ వెడల్పు 10 నుంచి 17 మీటర్ల వరకు ఉండనుంది.

11 మండలాలు.. 124 గ్రామాలు

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును 2012-2013లో చేపట్టారు. శ్రీశైలం జలాశయం నీటిని ఎత్తిపోస్తూ చిత్తూరు జిల్లా వరకు తీసుకెళున్నారు. ప్రధాన కాల్వ నందికొట్కూరు, కర్నూలు గ్రామీణ, కల్లూరు, కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి, దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, పత్తికొండ మండలాల మీదుగా వెళ్తోంది. ప్రధాన కాల్వపై 69.130 కి.మీ.(కృష్ణగిరి) వద్ద 0.164 టీఎంసీలు, 106.100 కి.మీ.(పందికోన) వద్ద 1.126 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా జలాశయాలు నిర్మించారు. మల్యాల, బ్రాహ్మణకొట్కూరు, మల్లేపల్లి, కృష్ణగిరి, కంబాలపాడు, ఆలంకొండ, గుండ్లకొండ వద్ద నీటిని ఎత్తిపోస్తూ ముందుకు తీసుకెళ్తారు.

పనులు నిషేధించిన వైకాపా

హంద్రీనీవా కాల్వను విస్తరిస్తాం.. పంట కాల్వలు తవ్వి ఆయకట్టును స్థిరీకరిస్తామని గత వైకాపా ప్రభుత్వం మాటలు చెప్పింది.. ఇదిగో విస్తరణ అంటూ నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నా పనులు ప్రారంభించలేదు. ఐదేళ్ల కాలంలో పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. తీరా జీవో 365 తీసుకొచ్చి ఐదేళ్ల వరకు పనులు చేయకూడదని నిషేధం విధించారు. ఈ ఏడాది ఆగస్టుతో అది పూర్తవనుండటంతో తిరిగి పనులు చేసేందుకు అవకాశముంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

**చెంతనే నీరు.. చేనుకు చేరని తీరు**

పందికోన జలాశయం కింద 61,400 ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా అతికష్టంగా 18,500 ఎకరాలకు అందిస్తున్నారు. ఈ జలాశయం ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయి పనులు చేపట్టలేదు. ఎడమ, కుడి కాల్వలు అర్ధంతరంగా వదిలేశారు. కృష్ణగిరి జలాశయం కింద 5,090 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు.

ఏటా ఆగస్టు చివరి నుంచి ఫిబ్రవరి వరకు ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం ఉంటుంది. ఎక్కడా పంట కాల్వలు లేవు. రైతులు ప్రధాన కాల్వలో పైపులు వేసి నీటిని తీసుకెళ్తున్నారు. కాల్వ ఒడ్డుపై డీజిల్ ఇంజిన్లు, పైపులకు ఒక్కో రైతు ఏటా రూ.లక్షలు ఖర్చు పెడుతున్నారు. చుక్కనీటి కోసం అన్నదాతలు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

ప్రధాన కాల్వ పొడవు 135 కి.మీ.

మండలాలు: 11

గ్రామాలు: 124

నీటి కేటాయింపు 5.50 టీఎంసీలు

నీరు ఇవ్వాల్సిన ఆయకట్టు 80 వేల ఎకరాలు

సాగు నీరు అందుతోంది 27 వేల ఎకరాలు

# ఓర్వకల్లు.. పరిశ్రమల ఇల్లు



కర్నూలు: ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ (పార్కు) అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రాం' కింద మౌలిక సదుపాయాల కోసం నిధులు విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13,830 ఎకరాలు సేకరించింది. అందులో 9,455.41 ఎకరాల్లో పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2,624.64 ఎకరాల్లో రూ.1771 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 'కూటమి' ప్రభుత్వం 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' (నిక్‌డిట్)తో ఒప్పందం కుదుర్చుకొంది. ఆయా పనులు చేపట్టేందుకు ఏపీఐఐసీ అధికారులు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**దిగ్గజ సంస్థలతో ఒప్పందం**

జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. 130 ఎకరాల్లో నిర్మించబోయే ఈ పరిశ్రమ ద్వారా రెండువేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

1200 ఎకరాల్లో రూ.13వేల కోట్ల పెట్టుబడితో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. ఎలక్ట్రిక్ వాహనాలను ఇక్కడ తయారు చేయనున్నారు. ఈ ఒక్క పార్క్‌లోనే దశలవారీగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. డ్రోన్‌హబ్‌ను 300 ఎకరాలు కేటాయించారు. రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టడం ద్వారా ఐదువేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది

**నిత్యం 74 ఎంఎల్‌డీల నీరు**

ఓర్వకల్లు పారిశ్రామికవాడకు ముచ్చుమర్రి నుంచి నిత్యం 74 ఎంఎల్‌డీల నీరు వచ్చేలా పనులు చేస్తున్నారు. తొలిదశలో రోజుకు 42 ఎంఎల్‌డీలు, తర్వాత దశలో రోజుకు 74 ఎంఎల్‌డీల నీరు తరలించేలా పైపులైన్ పనులు చేపడుతున్నారు. మొత్తం 57 కి.మీ.ల మేర పైపులైన్లు వేయాల్సి ఉండగా 16 కి.మీ. మిగిలింది.

**రైలు మార్గం సుగమం**

సరకు రవాణాకు రైలు మార్గం ఎంతో అవసరం.. ఇదే విషయాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఇటీవల రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు రైల్వేలైను నిర్మాణం చేపడితే అటు ప్రయాణికులు, ఇటు సరకు రవాణాకు వీలుంటుందని సూచించారు. అదేవిధంగా సరకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వీలుగా అన్ని సదుపాయాలతో ఓర్వకల్లులో రైల్వే సైడింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయా అంశాలపై రైల్వే అధికారులు డీపీఆర్ సిద్ధం చేసే పనిలో పడ్డారు.

**విమానాశ్రయం విస్తరణ**

సరకు రవాణాకు వీలుగా కర్నూలు విమానాశ్రయాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రెండు కి.మీ. పొడవున్న రన్‌వేను 2.8 కి.మీ. మేర, 30 మీటర్ల వెడల్పును 45 మీటర్లకు విస్తరించనున్నారు. రాత్రి వేళ విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా వసతులు కల్పించనున్నారు. ఆయా పనులకు రూ.13 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

# తరగని నిధులు.. కదలని పనులు

నంద్యాల : గనుల లీజుదారుల నుంచి జిల్లా ఖనిజాభివృద్ధి నిధికి దండిగా డబ్బులు సమకూరుతున్నాయి. అవి పల్లె ఖాతాకు చేరడం లేదు. 2019-20 నుంచి గత ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఉమ్మడి జిల్లాలో ఈ మొత్తం రూ.162.33 కోట్ల వరకు జమైంది. ఇందులో నంద్యాల జిల్లాలో రూ.109.78 కోట్లు, కర్నూలు జిల్లాలో రూ.52.55 కోట్లు ఉన్నాయి. వీటిని జిల్లా కలెక్టర్, గనుల శాఖ అధికారులు, ఇన్‌ఛార్జి మంత్రి నిర్ణయం మేరకు ఖర్చు చేయాల్సి ఉంది. సమన్వయ లోపంతో వీటిని ఏటా సరిగ్గా వినియోగించడం లేదు. ఫలితంగా రూ.62 కోట్లు మిగిలిపోయింది.

ఏటా 12.50 శాతం జమ గనుల ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ)ను ఏర్పాటు చేశారు. ఏటా వసూలు చేసే సీనరేజ్‌లో 12.50 శాతం మొత్తాన్ని డీఎంఎఫ్‌టీ కింద జమ చేస్తారు. గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఉమ్మడి జిల్లాలో ఐరన్ ఓర్, వైట్‌షెల్, సిలికా శాండ్, గ్రానైట్, గ్రావెల్, ఇసుక, రోడ్ మెటల్, బెరటీస్, సోప్ స్టోన్, క్వార్ట్జ్, ఎల్లో ఓఛర్ తదితర ఖనిజాలు లభిస్తాయి. గనులు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# మోరంపూడి పైవంతెనపై వెలుగులేవీ?

రాజమహేంద్రవరం : మోరంపూడి పైవంతెన(ఫ్లైఓవర్)పై వాహనాల రాకపోకలకు అనుమతించి ఆరు నెలలు దాటినా కొన్ని పనులు నేటికీ పూర్తికాలేదు. గడువు పెంచుకుంటూ పోతున్నారే తప్ప వాటిని పూర్తి చేయడం లేదు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులోన్లూ తీవ్ర జాప్యం చేస్తుండడంతో వాహనచోదకులు రాత్రివేళలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు పూర్తిచేయడంలో గుత్తేదారు సంస్థ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



**ఆది నుంచీ అంతే..**

ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో 1.42 కిలో మీటర్ల మేర రూ.60 కోట్లతో చేపట్టిన మోరంపూడి పై వంతెన పనుల్లో ఆది నుంచి జాప్యం జరుగుతూనే ఉంది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఎట్టకేలకు గతేడాది సెప్టెంబరు 8న పనులు పూర్తికాకుండానే లాంఛనంగా ప్రారంభించి పైనుంచి వాహనాల రాకపోకలకు అనుమతించారు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు, రెండో లేయర్, మార్కింగ్, కింద ఇరువైపులా సర్వీసు రోడ్ల ఏర్పాటు పనులు మాత్రం ఇప్పటికీ పూర్తికాలేదు. గతేడాది డిసెంబరు నెలాఖరు నాటికే వీటిని పూర్తి చేస్తామని చెప్పుకొచ్చినప్పటికీ అది జరగలేదు. వంతెనపై ఇరువైపులా విద్యుత్తు కేబుల్ వేసినా ఇంకా స్తంభాలు ఏర్పాటు చేయలేదు. మార్చి నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పినా నత్తనడకనే సాగుతున్నాయి. కింద సర్వీసు రోడ్లు కూడా అభివృద్ధి కాలేదు. గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మోరంపూడి పైవంతెన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# కాసుల వేటకు కళ్లెం పడేనా?

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తే బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మృతదేహం వచ్చిన దగ్గర నుంచి పోస్టుమార్టం చేసి అంబులెన్సులో పంపేవరకు అవస్థే. ప్రైవేటు ఫ్రీజర్లు.. అంబులెన్సుల దందా.. పోస్టుమార్టం కిట్లకు వసూళ్లు.. ఇలా ఒకటేమిటి అన్నింట్లోనూ దోచేస్తున్న పరిస్థితి ఉండేది. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో నలుగురిపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. మార్చురీ వద్ద పరిస్థితి గతేడాది సెప్టెంబరు 3న 'కన్నీటిలో కాసులవేట' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పలుమార్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సైతం ఈ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లోని పోస్టుమార్టం కిట్‌కు సుమారు రూ.500 ఖర్చవుతుంది. అలాంటిది ఒక్కో మృతదేహానికి బాధితుల వద్ద రూ.3 వేల నుంచి 5 వేలు వసూలు చేస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అడ్డం పెట్టుకుని రేటు మాట్లాడుకుంటున్నారని.. వారు చెప్పిందాంట్లో కొంచెం తక్కువ నగదు ఇచ్చినా పోస్టుమార్టం చేయడానికి గంటల తరబడి ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**వ్యవహారం వెనక ఎవరు?**

కలెక్టర్ చర్యలతో శవాగారం వద్ద దోపిడీ ఆగుతుందా అంటే ప్రశ్నార్థకమే. మార్చురీ వద్ద వసూళ్లు, డబ్బు డిమాండ్ చేయడం తదితర వ్యవహారమంతా ఆసుపత్రి ఉన్నతాధికారులకు తెలియకుండానే జరిగిందా? అనే విమర్శలొస్తున్నాయి. నేరుగా బాధితుల వద్ద ఓ పొరుగు సేవల ఉద్యోగి వసూళ్లకు పాల్పడుతుంటే ఆ విభాగ వైద్యులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలొస్తున్నాయి. ఏదైమైనా లోతైనా విచారణ చేస్తే



మరింత మంది బయటికొచ్చే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

**అంబులెన్సుల దోపిడీ ఆపాలి..**

మృతదేహాలను తరలించేందుకు జీజీహెచ్‌లో రెండు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఒక్కోసారి ఇవి మృతదేహాలను తీసుకెళ్లినప్పుడు మార్చురీ సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది సమాచారంతో కొందరు ప్రైవేటు అంబులెన్సులతో రంగంలోకి దిగిపోతున్నాయి. వారు చెప్పిందే రేటు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బయటి నుంచి తాము వేరే అంబులెన్సు తెచ్చుకుంటామన్నా ఒప్పుకోకుండా ఘర్షణలకు దిగుతుండడం గమనార్హం. దీన్ని పూర్తిగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

**శవపరీక్షలకు డబ్బులు డిమాండ్ చేసిన నలుగురిపై వేటు**

శవపరీక్షలు (పోస్టుమార్టం) కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్న రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుమార్టం అసిస్టెంట్‌గా పని చేస్తున్న పొరుగుసేవల సిబ్బంది పి.భవానీ ప్రసాద్ బాధితుల నుంచి రూ.5 వేలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపగా వాస్తవమేనని ఆయన అంగీకరించారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాబ్జీ, రామ్‌కుమార్, రామకృష్ణలకు కూడా కొంత మొత్తం ఇచ్చినట్లు తేలడంతో ఆ నలుగురిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సేవాభావంతో విధులు సక్రమంగా నిర్వహించాలని, అవినీతికి పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

చురకలు



# ‘పాల’కుల్లేరని బరితెగింపు

ఒంగోలు: ఒంగోలు నగరపాలక సంస్థ నడిమధ్యలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో ఏర్పాటైన ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య స్థలాలపై స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడింది. కంచె తొలగించి.. చిల్లచెట్లు పెకిలించి చదును చేస్తున్నారు. రాత్రి వేళ పనులు చేస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు.జిల్లాలోని 40 వేల మంది గ్రామీణ పాడిరైతుల తలరాతను మార్చి.. ఉద్యోగ, ఉపాధి కల్పించి ఓ వెలుగు వెలిగిన ఘనత ఒంగోలు డెయిరీది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏర్పాటు సమయంలో మొత్తం 78.10 ఎకరాలు సేకరించారు. అందులో పరిశ్రమ స్థాపించి.. ఉద్యోగులు, సిబ్బంది నివాస గృహాలు నిర్మించారు. వాహనాల రాకపోకలు, పశు గ్రాసం పరిశోధన, ఇతర అవసరాలకు కొంత స్థలం కేటాయించారు. కొంత ఖాళీ జాగాలో జామాయిల్ తోట పెంచుతున్నారు. ప్రజల మేలు మరచి.. ఓ కంపెనీకి ద్వారాలు తెరచిన గత వైకాపా పాలకులు.. ఉద్యోగులతో పదవీ విరమణ చేయించి.. డెయిరీని మూసివేశారు. స్థలాల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోలేదు. నగరం మధ్యలో, కర్నూలు రోడ్డులో డెయిరీ ఉండటంతో ఎకరా స్థలం రూ.9 కోట్ల నుంచి రూ.15 కోట్లు పలుకుతోంది. దీంతో ‘కాసు’క్కూర్చున్న కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఈ భూమిపై కన్నేశారు.

**నాటి నుంచే రాజకీయ క్రీడ**

ఒంగోలు డెయిరీ స్థలాన్ని సర్వే చేసి హద్దురాళ్లు పాతించాలని 2011లోనే అప్పటి జేసీ ఆదేశించారు. దీంతో జిల్లా భూమి కొలతలు, రికార్డుల శాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. హద్దురాళ్లు పాతి కంచె ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ స్థానిక ప్రజాప్రతినిధి విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు పేరిట కబ్జాకు యత్నించాడు. అందుకు



అప్పటి ఓ ‘పెద్ద’ ప్రజాప్రతినిధి సిఫార్సు కూడా చేశారు. వీటిని నాటి జేసీ అభిషిక్త్ కిశోర్‌కుమార్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ప్రస్తుతం డెయిరీకి చెందిన విద్యుత్తు ఉపకేంద్రం ఉన్న చోట సుమారు 5.27 ఎకరాలు, మరో చోట ఎనిమిది ఎకరాల్లో చిల్లచెట్లను తొలగించి చదును చేశారు. వీటి విలువ సుమారు రూ. 120 కోట్లు ఉంటుంది. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి విచారిస్తే.. ‘మాకు తెలియదనే’ సమాధానం ఎదురవ్వడంతో మిన్నకుండిపోవడం గమనార్హం.

**స్టాండింగ్ కౌన్సిల్ యత్నాలకు అడ్డంకులు**

కబ్జా యత్నాలు, కోర్టు కేసుల పరిష్కారానికి డెయిరీ నిర్వాహకులు స్టాండింగ్ కౌన్సిల్(న్యాయవాది) నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇంతలో ఓ ప్రజాప్రతినిధి సహాయకుడినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి స్టాండింగ్ కౌన్సిల్ వద్దని చెప్పినట్లు సమాచారం. రోజురోజుకూ రాజకీయ ఒత్తిడి పెరుగుతుండటం, స్థిరాస్తి వ్యాపారులు తమ వద్ద ఆధారాలు లేకున్నా ఫోన్లు చేసి ‘మా భూమి’ అంటూ వేధిస్తుండటంతో అధికారులు సతమతమవుతున్నారు. చదును పనులు చేసిన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం, డెయిరీని పునఃప్రారంభిస్తే ఆక్రమణలు ఆగుతాయని నిర్వాహకులు, రైతులు చెబుతున్నారు. ఈ విషయమై జేసీ, డెయిరీ డైరెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఒంగోలు డెయిరీ స్థలాన్ని దొర్లకాలు చదును చేసిన విషయం మా దృష్టికి రాలేదని, తహసీల్దార్‌తో విచారణ చేయిస్తానని తెలిపారు.

భూ విస్తీర్ణం వివరాలు(ఎకరాల్లో)

డెయిరీకి సేకరించిన స్థలం: 78.10

పరిశ్రమ విస్తరించిన ప్రాంతం: ఏడెకరాలు

జామాయిల్ తోట: 20


డెయిరీ ఎదుటి భాగం: 20

వెనక భాగంలో ఖాళీ స్థలం: 19

క్వార్టర్లు, ఇతర అవసరాలకు కేటాయింపు: 12.10

# వైద్య సేవలు మరింత సూపర్

ఒంగోలు : జిల్లా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జీజీహెచ్)లో సూపర్‌స్పెషాలిటీ సేవలు మరింతగా విస్తరిస్తున్నాయి. ప్రధానంగా గుండె జబ్బుల విభాగంలో మరికొన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ క్రమంలో రూ.6.3 కోట్ల వ్యయంతో సిద్ధం చేసిన క్యాథ్ ల్యాబ్‌ను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ నెల 10న ప్రారంభించనున్నారు. ఆ మేరకు మంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు జీజీహెచ్‌కి వచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులు, విభాగాల వారీగా అవసరాలపై చర్చించారు.ఇక గుంటూరు వెళ్లాల్సింది లేదు: ప్రస్తుతం కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు జీజీహెచ్‌లో సేవలందిస్తున్నారు. కేవలం యాంజియోగ్రాం తీయడానికి మాత్రమే సౌకర్యాలున్నాయి. జనవరిలోనే క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసినా అధికారికంగా ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు 56 మందికి యాంజియోగ్రాం పరీక్ష చేశారు. స్టంట్, యాంజియోప్లాస్టి,



బైపాస్ సర్జరీ అవసరమైతే గుంటూరు జనరల్ ఆసుపత్రికి పంపుతున్నారు. క్యాథ్‌ల్యాబ్‌కు అనుబంధంగా సిద్ధం చేసిన ఐసీసీయూ విభాగాన్ని కూడా మంత్రి ప్రారంభిస్తారు. అక్కడ పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇప్పించి మే నుంచి అవసరమైన వారికి స్టంట్‌లు కూడా ఇక్కడే అమర్చేలా నిర్ణయించారు. మరికొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలను బలోపేతం చేసేందుకు ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ విషయాలపై వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ.. క్యాథ్‌ల్యాబ్, ఐసీసీయూ అందుబాటులోకి వస్తే గుండె చికిత్స విభాగంలో మరికొన్ని సేవలందించవచ్చన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా సేవలు అందుబాటులోకి వస్తాయని, గుండె వైద్యనిపుణుడితో పాటు జనరల్ మెడిసిన్ విభాగం పోస్టు గ్రాడ్యుయేట్లు సేవలందిస్తారని తెలిపారు.

# పొలాల్లోనే మిరప రాశులు.. ధరతో దిగాలు



ఉరవకొండ: ఎండుమిరప ధర గణనీయంగా పడిపోయింది. కొనేవారు లేక మిరప రాశులు పొలాల్లోనే ఉంటున్నాయి. ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోర్లు, బావుల కింద సాగైన మిరప పంట చేతికి వస్తోంది. ఇప్పటికే సింహ భాగం కోతలు పూర్తయ్యాయి. బ్యాడిగ డబ్బీ రకం మిరప నెల క్రితం క్వింటాలు రూ.38వేలు పలుకగా.. ప్రస్తుతం రూ.16 వేలకు పడిపోయింది. ఇక విత్తన రకాల మిరప పంట ధర రూ.6వేల నుంచి రూ.9వేలు దాటడం లేదు. కనీసం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు పంట అమ్ముకుందామనుకున్నా కొనేవారు కరవయ్యారు. విత్తన రకాలను సంబంధిత కంపెనీలు ల్యాబ్‌కు పంపిన తరువాత అనుకూలంగా ఫలితం వస్తే అటుఇటుగా కొంటున్నాయి.

**నిల్వకు నానా తంటాలు** బ్యాడిగ డబ్బీ రకాలను క్వింటాలు రూ.20 వేలకైనా అమ్ముకుందామనుకుంటే అడిగేవారు లేరని రైతులు వాపోతున్నారు. దీంతో ఎక్కడికక్కడ మిరప రాశులు పొలాల్లో పేరుకుపోతున్నాయి. అవకాశం ఉన్న చోట చెట్ల కింద, దేరాల కింద నిల్వ ఉంచుకుంటున్నారు. మరోవైపు అకాల వర్షం పడుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరికొందరు గిట్టుబాటు ధర లేక కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శీతల గోదాముల్లో నిల్వ ఉంచడానికి యత్నిస్తున్నారు. కొన్ని చోట్ల బస్తాకు రూ.250కు అద్దె చెల్లించాల్సి వస్తోంది. వాటిని తరలించడానికి బస్తాకు రూ.150 వరకు రవాణాకు వెచ్చిస్తున్నారు.

**దిక్కుతోచని స్థితిలో ఉన్నాం..**వెంకటరెడ్డి, పొలికి, విడపనకల్లు మండలం పది ఎకరాల్లో మిరప పెట్టాను. రూ.23 లక్షల వరకు పెట్టుబడి అయింది. పంట చేతికి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. పంటను అమ్మితే పెట్టుబడి కూడా రాదు. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప రైతులు గట్టెక్కే పరిస్థితి లేదు.

అనంత జిల్లాలో ఇలా..

సాగైన విస్తీర్ణం: 45వేల ఎకరాలు

మిరప రకాలు: బ్యాడిగ డబ్బీ, 273, 5531, తేజ, 2043

ఎకరాకు పెట్టుబడి: రూ.2.20 లక్షలు

మొత్తం దిగుబడి: 7.92 లక్షల క్వింటాళ్లు

# పాత బిల్లులు.. కొత్త దోపిడీ



చిత్తూరు : చంద్రగిరి మండలంలో గ్రావెల్ అక్రమ రవాణాకు కొందరు సరికొత్త పంథా ఎంచుకున్నారు. గతంలో పర్మిట్లు జారీ చేసిన సంస్థ పేరిట కొత్తవి ముద్రించుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆపితే వాటిని చూపించి అనుమతులు ఉన్నాయని సమాధానమిస్తున్నారు. యాదమరి మండలంలో ఓ గ్రానైట్ క్వారీని వైకాపా హయాంలో ఆ పార్టీ కీలక నేత హస్తగతం చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పాత పర్మిట్లను కలర్ జిరాక్సులు తీయించి పట్టపగలే తమిళనాడుకు తరలించారు. ఆ కీలక ప్రజాప్రతినిధి ఏడు నెలల వ్యవధిలో దాదాపు రూ.4 కోట్లు చెల్లించకుండా దోపిడీకి పాల్పడ్డారు. వైకాపా హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనరేజ్, పర్మిట్ల జారీని అస్మదీయుడైన తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు. అప్పట్లో ఆన్‌లైన్ పర్మిట్లు కాకుండా సొంతంగా పర్మిట్లు ముద్రించి ఇచ్చి ఎడాపెడా అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వానికి సకాలంలో టెండర్ మొత్తం కూడా కట్టకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇళ్లు కట్టుకునేందుకు గ్రావెల్, జల్లి తీసుకుని వెళ్లే సామాన్యులనూ ఇబ్బంది పెట్టారు. ఫలితంగా గృహ నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం పర్మిట్ల జారీ నిలిపేసింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు పాత తేదీలు, కలర్ జిరాక్సులతో పర్మిట్లు ముద్రించుకుని గ్రానైట్, గ్రావెల్‌అక్రమంగా రవాణా చేశారు. ఇప్పటికీ దందా కొనసాగిస్తున్నారు.

చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, కుప్పంలో దందా..

ఎన్డీయే సర్కార్ చేతికి పాలనా పగ్గాలు అందాక సీనరేజ్, పర్మిట్లు జారీ చేసే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు వ్యతిరేకత మొదలైంది. ఈ నేపథ్యంలో కొంతకాలం పర్మిట్ల జారీని నిలిపేశారు. దీంతో అత్యధిక లీజుల కార్యకలాపాలు ఆగిపోయాయి. చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, కుప్పం నియోజకవర్గాల్లో మాత్రం కొందరు అక్రమార్కులు ఎప్పటిలాగానే చెలరేగిపోయారు. వైకాపా హయాంలో నిలిచిన గ్రానైట్ క్వారీలపై పడ్డారు. రాళ్లను ఎటువంటి అనుమతులు లేకుండానే రవాణా చేశారు. చంద్రగిరిలో మాత్రం గ్రావెల్ తరలించారు. అధికారులు దాడులు చేసినప్పుడు పాత తేదీలతో సిద్ధం చేసుకున్న పర్మిట్లు చూపిస్తున్నారు. ఇలా కోట్లాది రూపాయల విలువైన ప్రకృతి సంపదను దోచుకోవడంతోపాటు ప్రభుత్వానికి పర్మిట్ ఫీజునూ ఎగ్గొడుతున్నారు. జగన్ పాలనలో గనుల శాఖ పూర్తిగా నిర్వీర్యమైంది. తెలుగుదేశం, జనసేన, భాజపా నాయకుల క్వారీలపై నాటి పాలకులు వికృత స్వారీ చేశారు. వైకాపాలోని ‘పెద్దాయన’, ఆయన కుమారుడి కనుసన్నల్లోనే అక్రమాలు జరిగాయి. మాట వినని ప్రత్యర్థి లీజుదారులపై దాడులు చేయించి రూ.50 కోట్లు– రూ.150 కోట్ల వరకు డిమాండ్ నోటీసులు పంపి వేధించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లాలోని అధికార యంత్రాంగం మొత్తం అప్పట్లో చేతులెత్తేసింది. ఇదే సమయంలో సీనరేజ్, పర్మిట్ల జారీని గనుల శాఖ కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పరిధిలోకి వెళ్లింది. వైకాపా పెద్దలు విచ్చలవిడిగా అక్రమ రవాణా చేసినా ఆ క్వారీల దరిదాపుల్లోకీ వెళ్లలేదు. చిన్న చిన్న లీజుదారులు, మట్టి, గ్రావెల్ రవాణా చేసే సామాన్యులపై తమ ప్రతాపం చూపారు. ఈ సంస్థ సకాలంలో ప్రభుత్వానికి టెండర్ మొత్తం సైతం చెల్లించకుండా నిబంధనలకు తూట్లు పొడిచింది.

# అతివలకు ఆసరా.. వ్యాపారానికి భరోసా



విశాఖపట్నం : ఆటో నడపడం నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు.. అనేక రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారు. పెళ్లి, పిల్లల పెంపకం, కుటుంబ పరిస్థితులు తదితర కారణాలతో వ్యాపార రంగంలోకి వెళ్తున్న మహిళల సంఖ్య తక్కువేనని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కేంద్రంగా పనిచేస్తున్న వాణిరావు మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో విభిన్న ఆలోచనలున్న యువత, మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.

**మార్గనిర్దేశం.. పెట్టుబడి సహాయం**

1. కేంద్ర ప్రభుత్వానికి చెందిన టైడ్, నిధి ఏక్సలరేటర్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ ఇండియాతోపాటు వివిధ సంస్థల సహకారంతో మహిళల కోసం ప్రత్యేక ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారు.
2. 2018 నుంచి ఇప్పటివరకు ఏడేళ్లలో ఈ కేంద్రం ద్వారా 180 అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయి. అందులో 135కు పైగా మహిళలకు చెందినవే.
3. సహకారం అవసరమైన అభ్యర్థులకు 9 నెలల నుంచి రెండేళ్ల వరకు మార్గనిర్దేశం చేస్తారు.
4. పారిశ్రామికవేత్తలు, ఐఐఎం ప్రొఫెసర్లతో అవగాహన కార్యక్రమాలతోపాటు ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా సలహాలు అందిస్తారు.
5. ‘నారీప్రెన్యూర్ ఫర్ హెర్’ కార్యక్రమంలో భాగంగా ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహేశ్ రామనాథన్, సీనియర్ మేనేజర్ హర్ష వికాస్ ఆధ్వర్యంలో ఇటీవల 27 మంది అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు.
6. శిక్షణ పూర్తిచేసుకున్న అంకురాలకు కేంద్రం ప్రభుత్వంలోని వివిధ విభాగాల నుంచి నిధులు వస్తున్నాయి. కనీసం రూ.2 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడి సహాయం అందిస్తారు.

బలాలపై దృష్టి సారించా– శృతి సాహిని, డిజీవోక్ మీడియా

నేను మాస్టర్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో పీజీ చేశా. ఇంక్యుబేషన్ ప్రోగ్రాంలో చేరడానికి రెండేళ్ల కిత్రం వ్యాపారం ప్రారంభించా. వ్యాపారాన్ని సరైన పద్ధతిలో ఎలా నిర్వహించాలో ఐఐఎంలో నిపుణులు, ప్రొఫెసర్లు వివరించారు. వ్యాపారం వృద్ధి చేసుకోవడానికి గల మార్గాలు, అన్ని రకాల సలహాలు అందించారు. నా బలాలను గుర్తించి.. వాటిపై మరింత దృష్టి సారించాను. తద్వారా ఏడాదిలో రెట్టింపు ఆదాయం పొందాను. మా సంస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. చిన్న సమస్య వచ్చినా సత్వరమే స్పందించి, పరిష్కారానికి మార్గాలు సూచించేవారు.

వ్యవస్థాపకురాలు–ఎండ కీర్తి, శ్రీతులసీరత్నం అగ్రోటెక్, శ్రీకాకుళం పంట వ్యర్థాలతో ఉత్పత్తులు..: నేను ఎమ్మెస్సీ చదివా. మాది వ్యవసాయ కుటుంబం. పంట వ్యర్థాలను కాల్చకుండా పర్యావరణానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాం. 2023 నుంచి ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పంట వ్యర్థాలతో రాఖీలు, ప్లేట్లు, కప్పులు తయారుచేస్తున్నాం. గతేడాది అక్టోబరులో ఇంక్యుబేషన్ ప్రోగ్రాంకు ఎంపికయ్యా. వారి సలహాతో రాఖీలు తయారుచేసి విక్రయించాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉత్పత్తుల మార్కెటింగ్, విక్రయంపై కొత్త విషయాలు తెలుసుకున్నాం. వ్యాపారంలో రాణించడానికి సహకారం అందింది.

# అయిదేళ్లూ అధోగతి.. కూటమితో పురోగతి

బొబ్బిలి : జిల్లాలోని మార్కెట్ కమిటీల పరిధిలో అయిదేళ్లూ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పాలకవర్గాలు లేకపోవడం, నిధుల ఖర్చులపై ఆంక్షలు విధించడం, కొన్నిచోట్ల సొమ్ము ఇతర పనులకు మళ్లించడం తదితర కారణాలతో అభివృద్ధి కుంటుపడింది. కూటమి ప్రభుత్వ వచ్చాక ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి గల్లా పెట్టెలు నిండాయి. ఎనిమిది కమిటీల నుంచి వ్యవసాయ ఉత్పత్తులపై రూ.12.89 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.10.47 కోట్లు సమకూరాయి. ఇప్పటికైనా ప్రగతి పరుగులు పెడుతుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్తవలస, పూసపాటిరేగ, మెరకముడిదాం కమిటీలు శతశాతం చేరుకున్నాయి. గజపతినగరం, రాజాం, విజయనగరం కాస్త వెనుకబడినా గతం కంటే మెరుగుపడ్డాయి. ఈ ఏడాది భారత ఆహార సంస్థ ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా.. ఆయా రుసుములు ఒక్కో కమిటీకి సుమారు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు చేరాల్సి ఉంది. ఈ లెక్కన మరో రూ.2.50 కోట్లు ఖాతాలకు చేరే అవకాశముంది. గతేడాది కంటే రూ.50 లక్షల పైచిలుకు ఆదాయాన్ని ఆర్జించాయి.



**చేపట్టాల్సిన పనులివీ..**

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు చేర్చుకునేందుకు లింకు రహదారులు అవసరం. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో కమిటీ పరిధిలో రూ.50 లక్షల చొప్పున నిధులతో ప్రతిపాదనలు పంపినా పైసా కూడా మంజూరు కాలేదు.

బొబ్బిలి, చీపురుపల్లి, రామభద్రపురం వంటి ప్రాంతాల్లో రైతు బజార్లు నిర్మించాలనుకున్నా ఆయా పనులు ముందుకు సాగలేదు.

8 మార్కెట్ కమిటీల పరిధిలో గోదాముల నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదించినా ప్రగతి లేదు.ఒక్కో కమిటీ పరిధిలో ఏడాదికి పాడి పశువులకు సంబంధించిన ఆరోగ్య శిబిరాలు నాలుగు నిర్వహించేవారు. అయిదేళ్లూ జరగలేదు.పాలకవర్గాల ఆమోదంతోనే..ఈ ఏడాది గతంలో కంటే అదనంగా పన్నులు వసూలయ్యాయి. దీంతో మార్కెట్ కమిటీలు ఆర్థికంగా మరింత పరిపుష్ఠి చెందుతాయి. పాలకవర్గ సభ్యుల ఆమోదంతో ఈ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించుకోవచ్చు. రైతులకు మేలు కలిగే పనులు జరుగుతాయి. రైతు సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించే అవకాశముంది.రవికిరణ్, ఏడీ మార్కెటింగ్‌శాఖ, విజయనగరం

# ‘చల్లని’ విషం

కర్నూలు : ఎండ దెబ్బకు తాళలేక.. చెరకు.. పండ్ల రసాలు.. ఇతర పానీయాల్ని గటగటా తాగేస్తుంటాం.. చల్లదనం కోసం కాసిన్ని ఐస్ ముక్కలు అడిగి మరీ వేయించుకుంటాం.. అలా చేస్తే త్వరలోనే ఆసుపత్రికి వెళ్లడం ఖాయమంటున్నారు వైద్య నిపుణులు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడ చూసినా చల్లని పానీయాలు అమ్మే దుకాణాలు వెలిశాయి. ఇంటి నుంచి బయటకొచ్చిన వారిలో 25 శాతం మంది వీటిని తాగుతున్నారు. వీరిలో ఎక్కువ మంది చల్లదనం కోసం ఐస్ ముక్కలు వేసుకోనిదే ఆ పానీయాలను ముట్టడం లేదు. అయితే అపరిశుభ్ర వాతావరణంలో కలుషిత నీటితో చేసిన ఐస్‌ను శీతల పానీయాల్లో వినియోగించడంతో రోగాలపాలవడం తప్పదంటున్నారు వైద్యులు. **నిత్యం రూ.20 లక్షల వ్యాపారం**

ఐస్‌గడ్డల (క్యూబ్స్) తయారీ సీజనల్ వ్యాపారమే అయినా.. తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలున్నాయి. రెండు టన్నుల్లోపు ఐస్ తయారీకీ రూ.2–4 లక్షలు పెట్టుబడి, 2–3 టన్నులు రూ.5–6 లక్షలు, 4–5 టన్నులకైతే రూ.6–8 లక్షలు పెట్టి రెట్టింపు లాభాలు పొందుతున్నారు. నంద్యాలలో 15, ఆదోనిలో 6, ఎమ్మిగనూరు 2, కర్నూలులో 20–22, ఆళ్లగడ్డలో 3 వరకు ఐస్ తయారీ కర్మాగారాలు ఉన్నాయి. 10–18 కిలోల ఐస్ గడ్డలను రూ.120–160, 40–50 కిలోలవి రూ.300–450 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రూ.18–20 లక్షల వ్యాపారం జరుగుతోందని అంచనా.

పరిశ్రమల శాఖ, స్థానికంగా ట్రేడ్ లైసెన్సు, కాలుష్య నియంత్ర బోర్డు, విద్యుత్తు శాఖ ద్వారా వాణిజ్య విద్యుత్తు కనెక్షన్, భవనానికి సంబంధించి పురపాలక పట్టణ ప్రణాళిక, అగ్ని మాపక శాఖల నుంచి అనుమతులుండాలి.. ఏ ఒక్కరూ ఆయా అనుమతులు తీసుకోవడం లేదు. చాలా వరకు ఇళ్ల మధ్య, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ తయారీ

సాధారణంగా మార్కెట్లో రెండు రకాల ఐస్ దొరుకుతుంది. మొదటిది పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించేది (కమర్షియల్). రెండోది ఎడిబుల్ (తినదగినది).మొదటి రకం.. చేపలు, మాంసాన్ని ఎక్కువ రోజులపాటు నిల్వ ఉంచేందుకు పండ్లు ఇతర వస్తువులు ఎగుమతి చేసేందుకు, ఆసుపత్రుల్లోని మార్చురీల్లో వినియోగిస్తారు. దీన్ని ఏ నీటితోనైనా ఎలాంటి ప్రదేశాల్లోనైనా తయారు చేయొచ్చు.

రెండో రకం.. దీన్ని కచ్చితంగా శుద్ధి చేసిన నీటితో, పరిశుభ్రమైన వాతావరణంలోనే తయారు చేయాలి. దీన్ని పానీయాల్లో వాడితే ఎలాంటి ప్రమాదమూ ఉండదు. రెండో రకం ఐస్‌కు ధర ఎక్కువగా ఉండటంతో చల్లని పానీయాలు విక్రయించే వ్యాపారులు తక్కువ ధరకు దొరికే మొదటి రకం ఐస్‌ను వాడుతున్నారు. “ ఐస్ తయారీకి వినియోగించే నీటిలో టీడీఎస్ 50–150 వరకు ఉండాలి..250 వరకు ఉన్నా వినియోగించొచ్చు. పీపీఎం 300పైన ఉండాలి.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటా మని” ఆహార భద్రతా అధికారి కూర్మనాయకులు పేర్కొన్నారు.ఐస్ క్యూబ్స్ (అచ్చులు) తయారీకి ఇనుప రేకు డబ్బాలు వినియోగిస్తున్నారు. ఇవి తుప్పు పట్టి.. చిన్నచిన్న ముక్కలు ఊడిపోతు న్నాయి. అవి అందులోనే కలిసిపోతున్నాయి. రవాణాలో కచ్చితంగా నైలాన్ సంచులు వాడాలి. కానీ గోనె పట్టాలు, వరి పొట్టు కప్పి తరలిస్తున్నారు.

**రోగాలు కొని తెచ్చుకోవద్దు**–డాక్టర్ శంకర్‌శర్మ, విశ్రాంత ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, నాణ్యత లేని ఐస్‌ను వాడటం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గొంతు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, దగ్గు బారినపడే ప్రమాదముంది. చిన్నపిల్లలకు గవద బిళ్లల వ్యాధి వచ్చే ప్రమాదముంది.

రోటా, అడినో, హెపటైటిస్–ఏ వంటి వైరస్‌ల వల్ల ఊపిరితిత్తులు, పచ్చకామెర్లు సంభవిస్తాయి. ఈ–కోలీ, సిగెల్లా వంటి బ్యాక్టీరియాల వల్ల వాంతులు, విరేచనాలు అవుతాయి.

చురకలు

మంగళవారం 6 మే 2025

# విలువైన స్థలం.. ఆక్రమణల పర్వం

గుంతకల్లు : గుంతకల్లులో రైతుల భూములకు మున్సిపాలిటీ డబ్బు చెల్లించి ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం కోసం సేకరించిన స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుంది. స్థలం విలువ మార్కెట్‌లో రూ.కోట్లు పలుకుతోంది. మున్సిపాలిటీ పట్టణ శివారులో, గుంతకల్లు కొట్టాలకు సమీపంలో రైతుల నుంచి 435 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇందులో 305 ఎకరాల విస్తీర్ణంలో రెండు ట్యాంకులు నిర్మించారు. మిగిలిన 130 ఎకరాల్లో ముస్లింల శ్మశానవాటిక కోసం రెండు ఎకరాలు, మురుగు నీటిని శుభ్రం చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన రైతుకు మరో రెండు ఎకరాలు కేటాయించారు. ఇక మిగిలిన 126 ఎకరాల స్థలం మిగిలి ఉంది. ఈ స్థలంలో కొందరు చొరబడి ప్లాట్లుగా విభజించి ఇతరులకు అమ్ముకునేందుకు తెరవెనక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు అమ్ముకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై తెదేపా నాయకుడు చంద్రశేఖర్ మున్సిపల్



అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయడానికి జిల్లా నుంచి సర్వేయర్లను పంపాలంటూ మున్సిపల్ అధ్యక్షురాలు వారం రోజుల కిందట జిల్లా కలెక్టరుకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ స్థలానికి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయడానికి రెండేళ్ల కిందట రూ.10 లక్షలు కేటాయించారు. పనులు ఇప్పటికీ జరగలేదు.

**పరిశీలించి తగిన చర్యలు చేపడతాం**

నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి మిగిలిపోయిన స్థలాన్ని ఎవరైనా ఆక్రమించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. సమగ్ర సర్వే చేయాలని జిల్లా అధికారులను కోరాం. సర్వే సందర్భంగా ఎవరైనా స్థలాలను అమ్మినట్లు, భవనాలను నిర్మించినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

# ట'మాటా' పడిపోయేలా!

పలమనేరు: టమాటా ధరలు ఎప్పుడెలా ఉంటాయో చెప్పలేకపో తున్నారు. తోట నుంచి మార్కెట్‌కు వచ్చే సరికి మారుతుండటంతో రైతులు ధరల వైకుంఠపాళిలో చిక్కి అల్లాడుతున్నారు. మూడు రోజులుగా 15 కిలోల టమాటా పెట్టె రూ.300 పలికితే శుక్రవారం రూ.130కు పడిపోయింది. రోజు వ్యవధిలో ధరలు సగానికి తగ్గడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం ప్రాంతంలో పంట లేదు. అక్కడికి ప్రభుత్వం టమాటాను కొని మార్కెట్ కమిటీల ద్వారా పంపాలని నిర్ణయించింది. అయితే మార్కెట్ కమిటీ అధికారులు రైతుల నుంచి కాకుండా వ్యాపారుల నుంచి కొంటున్నారు. వ్యాపారులు రైతుల నుంచి కొని



కమిటీలకు ఇస్తున్నారు. ఫలితంగా వ్యాపారులు నిర్ణయించిన ధరే రైతులకు దక్కుతోంది. ఇక్కడి నుంచి నాలుగైదు రోజులుగా 4 నుంచి 5 లోడ్ల టమాటాను పంపారు. అక్కడి ధరలే ఇక్కడా.. ఇక్కడి వ్యాపారులు కర్ణాటక మార్కెట్‌ను అనుసరించి ధరలను నిర్ణయిస్తుంటారు. కర్ణాటకలోని నంగలిలో ఉదయం 8 గంటలకు మార్కెట్ మొదలవుతుంది. తర్వాత పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో వేలం ప్రారంభిస్తారు. దీంతో అక్కడి ధరలే ఇక్కడా పలుకుతున్నాయి. నిలకడగా ధరలు లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నామని రైతులు వాపోతున్నారు.

# ఉపాధి ముంగిట.. శ్రమజీవికి ఊరట

పుత్తూరు : ఎండల తీవ్రత పెరుగుతున్న వేళ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఉపాధి పథకంలో వాటర్ బెల్ విధానం అమలు చేయడంతో పాటు కూలీలు గంటకోసారి నీళ్లు తాగేలా పని ప్రదేశంలో ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నీడ నిచ్చే షెడ్లు, అవి లేకపోతే పందిర్లు వేయాలని సూచించారు.

**వైకాపా పాలనలో కనీస వసతులు కరవే..**

తెదేపా 2014-19 హయాంలో కూలీలకు మంచినీటికి అలవెన్స్ ఇచ్చారు. మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కూలీల నీడ కోసం టెంట్లు సరఫరా చేశారు. వారికి గడ్డపారలు అందించారు. కూలీలకు మెరుగైన వేతనం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. గ్రామం నుంచి దూరంగా వెళ్లి పనులు చేసేవారికి రవాణా భత్యం ఇచ్చారు. 2019-2024 వరకు వైకాపా పాలనలో ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించలేదు. మంచినీరు సైతం ఇవ్వలేదు. ఎండల రక్షణకు నీడ కూడా లేకుండా చేశారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స పెట్టెలు ఇవ్వలేదు. దీంతో కూలీలు, మేట్లు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుతం మళ్లీ ఉపాధి హామీ కూలీలకు రక్షణ చర్యలకు చర్యలు చేపడుతోంది. మరో 20 రోజుల్లో వ్యవసాయ పనులు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ రెండో వారం నుంచి కూలీ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

చిత్తూరు జిల్లాలో జాబ్‌కార్డులు : 2.67 లక్షలు
ఉపాధి పొందుతున్న కూలీలు : 4.7 లక్షల మంది
తిరుపతి జిల్లాలో జాబ్‌కార్డులు : 2.47 లక్షలు
ఉపాధి పొందుతున్న కూలీలు : 1.72 లక్షల మంది

# నదులకు పునరుజ్జీవం వచ్చేనా?



రాయదుర్గం : శతాబ్దాలుగా వర్షాభావ పరిస్థితులు, యథేచ్ఛగా ఇసుక తరలింపుతో చుక్కనీరు లేక ఉనికి కోల్పోయిన వేదవతి, హగరి నదుల పునరుజ్జీవానికి గత తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నదుల్లో సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. మొత్తం నాలుగుచోట్ల వీటిని నిర్మించాల్సి ఉండగా.. ఒకచోట మాత్రమే పూర్తి చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలను గాలికొదిలేసింది. ఫలితంగా వేదవతి, హగరి నదులు బోసిపోయి ఏడారిని తలపిస్తున్నాయి. అడ్డుకట్టలతో భూగర్భజలాల వృద్ధి: నదుల్లో పారే నీటికి అడ్డుకట్టలు కట్టడం ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెంది వ్యవసాయ బోర్లు, తాగునీటి పథకాలకు సమృద్ధిగా నీరు లభిస్తుంది. జుంజురాంపల్లి వద్ద నిర్మించిన సబ్‌సర్ఫేస్ డ్యాంతో ఈ విషయం రుజువయ్యింది. మలకాపురం గ్రామానికి చెందిన రైతుల బోర్లలో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో పుష్కలంగా నీరుండటంతో ఏడాదికి మూడు పంటలు పండిస్తుండటం విశేషం.

**రూ.16.09 కోట్లు మంజూరు**

వేదవతి, హగరి నదుల పునరుజ్జీవానికి 2014లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్‌ను బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూర్ తదితర ప్రాంతాల్లోని ఇసుక దిబ్బలు, భూపసముద్రం వద్ద ఉన్న వేదవతి నదిని చూపించారు. ఆయన సూచనల మేరకు రెండు నదుల్లో పరీక్షలు జరిపి సబ్‌సర్ఫేస్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.16.09 కోట్లు మంజూరు చేసింది. జుంజురాంపల్లి సబ్ సర్ఫేస్‌డ్యామ్ నిర్మాణానికి రూ.5.50 లక్షలు, భూపసముద్రం రూ.89 లక్షలు, కెంచానపల్లి రూ.7 కోట్లు, హగరిలో కూడ్లూరు వద్ద నిర్మాణానికి రూ.2.9 కోట్లు మంజూరు చేసింది. వాటిలో జంజురాంపల్లి ద్ద మాత్రమే నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారటంతో మిగిలిన చోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి.

**ఎలా చేస్తారంటే..**

నదీ గర్భంలో 12 మీటర్ల లోతుకు ఇసుక లేదా మట్టిని తొలగిస్తారు. నదుల మధ్యలో ఇంకా ఎక్కువ లోతుకు తీయాల్సి ఉంటుంది. ఆ తర్వాత చెరువుల్లోని బంక మట్టిని వేస్తూ పైదాకా రోలింగ్ చేస్తారు. దాంతో వరదనీరు, ఇసుక కిందికి కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు. తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయి. నీటి ఆవిరి ఉండదు. వీటి నిర్మాణానికి భూసేకరణ సమస్యలు తలెత్తవు.

రెండుచోట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

బలరాముడు, డీఈ, చిన్న నీటిపారుదల శాఖ, రాయదుర్గం

వేదవతి నదిలో కెంచానపల్లి, భూపసముద్రం వద్ద రెండు సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలకు భూగర్భ జలవనరుల శాఖ(గ్రౌండ్ వాటర్) అధికారులకు నివేదిక కోరాము. వారు ఇవ్వగానే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం. ఆ తర్వాత హగరి నదిలో నిర్మాణాలను పరిశీలిస్తాం.

# అధికారుల నిర్లక్ష్యం.. అసంపూర్తి వారధే సాక్ష్యం



రాయదుర్గం : అనంత నగర శివారులోని రాప్తాడు వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను టెండర్ల పేరుతో కాలయాపన జరుగుతోంది. 42, 44 నంబర్ల జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ 2017-18 సంవత్సరంలో రైల్వేవంతెన పనులు ఆరంభమయ్యాయి. ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. వంతెన పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అప్పట్లో తమిళనాడుకు చెందిన ఓ గుత్తేదారు సంస్థ టెండరు దక్కించుకొని పనులు చేపట్టింది. 2019-20లో వంతెన పనులు ఆగిపోయాయి. గుత్తేదారుడు పనులు చేపట్టకుండా వెళ్లిపోయాడు. వైకాపా ప్రభుత్వం వంతెన గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైల్వే వంతెనపై దృష్టి సారించింది. కేంద్రం రూ.18 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో సుమారు 6 నెలల కిందట టెండర్లు నిర్వహించారు. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి.

**చిన్న పనులపై అలసత్వం**

వంతెనకు ఇరువైపులా రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. వంతెనపై కంకర వేసి వదిలేశారు. తారురోడ్డు నిర్మించాల్సి ఉంది. కందుకూరు రోడ్డు వద్ద కొంత మేర రహదారి, వంతెన పక్కన సర్వీసురోడ్డు, ఇతరత్రా చిన్నచిన్న పనులు చేపట్టాలి. ఈ పనులు పూర్తి చేయడానికి టెండర్లు నిర్వహించారు. కాని అనుమతులు ఇవ్వలేదు.

**వాహనదారుల ఇక్కట్లు**

ఈ మార్గంలో నిత్యం రైళ్లు వెళ్తుంటాయి. ఆ సమయంలో గేటు మూసినప్పుడు వాహనాలు పెద్ద సంఖ్యలో ఆగిపోతాయి. కందుకూరు రోడ్డు సమీపంలో ఈ బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారింది. వంతెన కింద రహదారిపై కూడా గుంతలు పడ్డాయి. వాహనదారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అనుమతి రాగానే పునఃప్రారంభిస్తాం**

సుధాకర్‌రెడ్డి, ఈఈ, జాతీయరహదారులశాఖ

పాత టెండరు రద్దు చేశాం. ఆ గుత్తేదారునికి ఆర్థిక లావాదేవీల సమస్య పరిష్కరించాల్సి ఉంది. కొత్త టెండర్లు పూర్తయ్యాయి. అనుమతి కోసం కేంద్రానికి పంపించాం. అనుమతి రాగానే మళ్లీ పనులు ప్రారంభిస్తాం.

# హంద్రీనీవా.. చెరువులు నిండవా?



పెనుకొండ : కరవు జిల్లాకు వర ప్రదాయిని హంద్రీనీవా కాలువ. అయితే గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా కాలువ అధ్వానంగా మారింది. గొల్లపల్లి జలాశయం నుంచి పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల ద్వారా హిందూపురం, లేపాక్షి మండలాల మీదుగా మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగలి, రొళ్ల, గుడిబండ, అమరాపురం తదితర మండలాల వరకు కాలువ పొడవు 171 కిలోమీటర్లు వ్యాపించి ఉంది. ఈ కాలువ వెంబడి ఇరువైపులా ముళ్లకంప చెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. కాలువ నిండా నీటి సరఫరా కొనసాగుతుండటంతో గట్లు బలహీనంగా మారి నీటి లీకేజీలతో ప్రవాహం సక్రమంగా ముందుకు సాగడం లేదు.

**తవ్విన మట్టితోనే గట్లు..** కాలువ తవ్వకాలతో వచ్చిన మట్టితోనే ఇరువైపులా గట్లుగా వేయడంతో ఆ మట్టి నాణ్యత లేక, పూర్తిస్థాయి నీటిమట్టం ప్రవాహంతో కాలువ కోతలకు గురవుతోంది. గతంలో పెనుకొండ మండలం కోనాపురం, హరిపురం వద్ద మూడు సార్లు, సోమందేపల్లి మండలం పందిపర్తి, మంచేపల్లి వద్ద పలుమార్లు, గత మంగళవారం సోమందేపల్లి సమీపంలో గండి పడి 20 ఎకరాల వరకు వరి పొలాల్లోకి నీరు చేరాయి.

**లక్ష్యం 265..:** పెనుకొండ మండలంలోని గొల్లపల్లి జలాశయం నుంచి పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 265 చెరువులను కృష్ణా జలాలతో నింపాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు మూడు నియోజకవర్గాల్లో కేవలం 40 చెరువులను నింపడమే గగనమైపోతోంది. మొత్తం 42 వేల ఎకరాలను ఈ కృష్ణా జలాలతో రైతుల పొలాలు సస్యశ్యామలం చేయాలనే లక్ష్యం ఎంతో ఘనంగా ఉన్నా.. ఆచరణ మాత్రం అంతంత మాత్రంగానే మారుతోంది. ప్రస్తుతం సోమందేపల్లి మండలంలో 13 చెరువులు, పెనుకొండ-3, రొద్దం మండలం-3 చెరువులు జలాలతో నిండగా.. హిందూపురం మండలంలో 5 చెరువులు సగం మేర నింపడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాంరామసుబ్బయ్య, డీఈ, హెచ్ఎన్ఎస్ఎస్, పెనుకొండ

హంద్రీనీవా కాలువ పటిష్ఠత కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ముళ్లకంప పెరిగిపోవడంతో గట్లు బలహీనంగా మారుతున్నాయి. 15 రోజుల్లో జలాల సరఫరా ఆగిపోనుంది. నిధులు విడుదలైన వెంటనే కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నాం.

# విశాఖ తీరాన.. అగ్రరాజ్య సేన

విశాఖపట్నం: ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతకు దిక్సూచిగా భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయాంఫ్-2025' విన్యాసాల్లో అమెరికా యుద్ధ నౌకలు విశాఖ తీరానికి వచ్చాయి. ఈ నెల ఏడో తేదీ వరకూ హార్బర్ ఫేజ్ విన్యాసాలు ఉంటాయి. శుక్రవారం అమెరికా యుద్ధ నౌకల సందర్శనకు వివిధ రంగాల ప్రతినిధులను అనుమతించారు. విశాఖ పోర్టు వద్ద అగ్రరాజ్యానికి చెందిన యూఎస్ఎస్-కంస్టాక్‌తో పాటు యూఎస్ఎస్ రాల్ఫ్ జాన్సన్ -144 నౌకల ప్రత్యేకతలను కమాండర్లు బైరాన్‌స్టాక్స్, జాక్ సీజర్ వివరించారు. అవి ఏవిధంగా పనిచేస్తాయి, గతంలో అందించిన సేవల గురించి విశదీకరించారు. ఆయా నౌకల్లో నేవిగేషన్, రాడార్ వ్యవస్థ, కెప్టెన్ ఛాంబర్, క్యాంటీన్, వసతిగదులు, యుద్ధ విభాగాలపై సమగ్రంగా వివరించారు. మరో వైపు ఈఎన్‌సీలో ఇరు దేశాల ప్రతినిధులు పలు



అంశాలపై చర్చించారు. కంస్టాక్ నౌక యుద్ధ సమయంలోనే కాకుండా విపత్తుల సమయంలో ఎలా సహాయ కార్యక్రమాలు చేపడుతుందో వివరించారు. ఈ నౌకలో భారీ హెూవర్‌క్రాఫ్ట్‌లు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ హెలికాప్టర్ల నిర్వహణ ఎలా ఉంటుందో పేర్కొన్నారు. అత్యాధునిక ఆయుధాలను వినియోగించి శత్రువులను ఎలా ఎదుర్కొంటారో ఓ నమూనా ప్రదర్శనలో చూపించారు. సుదూర లక్ష్యాల మీద దాడి చేసే లాంచర్లు గురించి వివరించారు. అమెరికా నౌకాదళంలో రాల్ఫ్ జాన్సన్-144కు విధ్వంసకర యుద్ధ నౌకగా పేరుంది. సముద్రం, వాయుమార్గం, భూభాగంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను కలిగుండడం దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు.

# తీర్మానమా..? ప్రతిపాదనా?

భీమిలి : జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారిపై కూటమి నాయకులు అవిశ్వాసం నోటీసు అందజేసిన తర్వాత... ఈనెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి కలెక్టర్ హరేంధిరప్రసాద్ పేరిట జీవీఎంసీ కార్పొరేటర్లకు నోటీసులు అందాయి. ఆ నోటీసుల్లో... "మహా విశాఖ నగర పాలక సంస్థ, కౌన్సిల్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తుంది" అని రాయడంతో పాటు, తీర్మానంగా పేర్కొన్నారు. మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో...ఆ అంశంపై చర్చించడానికి వీలుగా నోటీసులో చర్చనీయాంశంగా మాత్రమే పేర్కొనాల్సి ఉండగా, నేరుగా తీర్మానం అంటూ ముద్రించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రత్యేక అవిశ్వాస సమావేశానికి 74 మంది కార్పొరేటర్లు హాజరై, వారి అభిప్రాయాన్ని మేయర్‌కు వ్యతిరేకంగా చెబితే, అప్పుడు కలెక్టర్ ప్రత్యేకాధికారి



హెూదాలో తీర్మానం చేయాల్సి ఉంటుంది. అప్పటి వరకు మేయర్‌పై అవిశ్వాస ప్రతిపాదన లేక చర్చనీయాంశంగా మాత్రమే నోటీసులో పేర్కొనాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ తీర్మానం అనే పదం ఉపయోగించకూడదని నిపుణులు చెబుతున్నారు.

భీమిలిలో తెదేపా కార్పొరేటర్లు...?: మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధి తెదేపా కార్పొరేటర్లకు భీమిలిలో క్యాంపు ఏర్పాటు చేసినట్టు సమాచారం. అవిశ్వాసం నేపథ్యంలో వారిని విదేశాలకు తీసుకెళ్లేందుకు పాస్‌పోర్టులు సేకరించిన నాయకులు, తదనంతర పరిణామాలతో భీమిలిలోనే క్యాంపు నిర్వహిస్తున్నారు. తెదేపాతో పాటు, వైకాపా నుంచి తెదేపాలో చేరిన వారు భీమిలి వెళ్లారు. నగరానికి దగ్గరగా ఉండటంతో... రోజూ సాయంత్రం ఇళ్లకు చేరుకుని, సొంత పనులు చూసుకుని తిరిగి భీమిలి వెళ్లేలా నిర్ణయించారు.

# అంత యూరియా.. అవసరం లేదయా!

అనకాపల్లి : దేశవ్యాప్తంగా 2023-24లో ఎకరా పొలానికి సగటున 56 కేజీల యూరియా వాడారు. ఇదే అనకాపల్లి జిల్లా వరకు చూస్తే దాదాపు మూడురెట్లు ఎక్కువగా 145 కేజీలు వాడారని తేలింది. అన్నదాతలు అవగాహన లోపంతో పరిమితికి మించి మోతాదులో నత్రజన ఎరువు వాడుతుండటం వారికి పెట్టుబడుల భారం పెంచుతోంది. ఇది భూమి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

జిల్లాలో రబీలో 15,662 హెక్టార్లు, ఖరీఫ్‌లో 85,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో ప్రకృతి వ్యవసాయం 22 వేల హెక్టార్లలో చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నా వాస్తవానికి చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుంది. చాలామంది రైతులు కషాయాలతోపాటు అప్పుడప్పుడు యూరియా వినియోగిస్తున్నారు. నత్రజని అధికంగా ఉపయోగిస్తే పంట విపరీతంగా పెరిగి.. చిన్న గాలి వీచినా పడిపోతుందని శాస్త్రవేత్త డాక్టరు ఉమామహేశ్వరరావు తెలిపారు. పూతకు ఆలస్యంగా వస్తుందని దీనివల్ల పంట కాలం పెరుతుందన్నారు. తాలు గింజలు పెరుగుతాయని తెలిపారు. చీడపీడలు సులభంగా సోకుతాయన్నారు. ఫలితంగా దిగుబడులు తగ్గిపోతాయని వివరించారు. జీవన ఎరువులైన అజోల్లా, అజటోబాక్టర్, రైజోబియం వంటి వాటిని వేయడం ద్వారా యూరియా వాడకం తగ్గించవచ్చని తెలిపారు.

జిల్లాలో అన్ని పంటల కంటే ఎక్కువగా సాగు చేసేది వరి. దీని తర్వాత చెరకు. వరి పంటకు ఎకరాకు 69 కేజీలు యూరియా వేయాల్సి ఉండగా 145 కేజీలు వేస్తున్నారు. చెరకు పంటకు 97 కేజీలకు 219 కేజీలు వేస్తున్నారు. భూసారానికి అనువుగా ఎరువులు... రైతులు భూసార పరీక్షలను పరిగణనలోకి తీసుకోకుండా ఎరువులు వినియోగిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా పంటలకు పురుగులు, తెగుళు త్వరగా సోకి దిగుబడులు తగ్గిపోతాయి. సేంద్రియ ఎరువులు ఎకరాకు టన్నుకు మించి వేయడం లేదు. భూసార పరీక్షల ఫలితాల్లో భూమిలో సహజంగా లభించే పోషకాల స్థాయి తెలుస్తుంది. దాన్ని బట్టి ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాషియం వేసుకోవాలో తెలుస్తుంది.

జి.ప్రసాద్, జిల్లా భూసార పరీక్ష కేంద్రం అధికారి

చురకలు



## నెవ్వర్ బిఫోర్ అనేలా స్టై పాప గ్లామర్ ఎటాక్..

తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఐశ్వర్య మెనన్ సోషల్ మీడియాలో మళ్లీ హాట్ టాపిక్ అవుతోంది. తెల్లటి టాప్, షార్ట్ ప్యాంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో పోజులిచ్చిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 'గ్రేస్ ఇన్ ఎవరీ గ్లాన్స్, పీస్ ఇన్ ఎవరీ బ్రీత్' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ స్టిల్స్‌కి అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఐశ్వర్య మెనన్ కెరీర్ విషయానికి వస్తే.. 2012లో తమిళ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తరువాత కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, ప్రామాణికమైన పాత్రలతోనూ మెప్పిస్తోంది. కన్నడ తెలుగులో నటించి ఆకట్టుకుంది. తెలుగులో ఆమధ్య స్పై, భజే వాయు వేగం వంటి సినిమాలలో మంచి పాత్రలు



చేసింది. అయితే ఆమెకు భారీ మార్కెట్ ఉండకపోయినా, తన సొగసుతో, హావభావాలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో ఆమె చూపించిన స్టైలింగ్, హేర్‌స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండటమే కాకుండా, యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి కాస్ట్యూమ్‌లో ఆమె చూపించిన క్యాషువల్ యెట్ గ్లామరస్ లుక్‌కి వావ్ అంటున్నారు నెటిజన్లు. నేచురల్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఐశ్వర్య మెనన్ అందాన్ని మరో లెవెల్‌లో చూపిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు చిత్రాలతో పాటు ఓ వెబ్ సిరీస్ ప్రాజెక్ట్‌లోనూ బిజీగా ఉంది. కొంతకాలంగా సరైన హిట్ లేక పోయినా.. సోషల్ మీడియా పాపులారిటీతో మళ్లీ అవకాశాలు అందుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ప్రతి ఫోటోకి వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు రావడం గమనించదగ్గ విషయం. ఐశ్వర్య మెనన్ కెరీర్ పుంజుకోవడం కోసం మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తోంది. ఇక ఫ్యాషన్, ఫొటోషూట్‌లతో యూత్‌ను కట్టిపడేస్తోంది.

## అప్పటికీ ఇప్పటికీ అమ్మడు అదే డిమాండ్..!

వారానికో సినిమా రిలీజ్ అవుతుంది. అందులో నటించేందుకు హీరోయిన్స్ వస్తున్నారు. కానీ వారిలో సక్సెస్ అయ్యే హీరోయిన్స్ మాత్రం చాలా తక్కువ. అలాంటి పరిశ్రమలో తమకంటూ ఒక స్టార్ స్టేటస్ తెచ్చుకుని మెప్పించడం అంటే మామూలు విషయం కాదు. అంతేకాదు ఆ స్టార్ డం ని దశాబ్దాలుగా కొనసాగించడం మరీ కష్టం. అలా స్టార్స్ కి ఏమాత్రం తగ్గని విధంగా తన సత్తా చాటుతూ హీరోయిన్స్ లో చాలా ప్రత్యేకంగా ఉంటుంది కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార. ఓ పక్క కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మరోపక్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో అదరగొట్టేస్తుంది. కోలీవుడ్ లో ఒకదశలో నయనతార సినిమా వస్తుంది అంటే స్టార్ హీరోలు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా నయనతార సినిమాలు చేస్తూ వచ్చింది. తెలుగులో స్టార్ హీరోలతో నటిస్తూ అదరగొట్టేస్తుంది. ఐతే కొన్నాళ్లుగా తమిళ



సినిమాలకే పరిమితమైంది నయనతార. ఈమధ్యనే బాలీవుడ్ లో కూడా తన మార్క్ చూపించే ప్రయత్నం చేసింది. షారుఖ్ ఖాన్ జవాన్ లో నటించి బీ టౌన్ ఆడియన్స్ ని మెప్పించింది నయనతార. ఇక ఈమధ్యలోనే ఒక తెలుగు సినిమా కోసం నయనతారని కలిశారట మేకర్స్. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో చిరంజీవి చేస్తున్న సినిమాలో హీరోయిన్ గా నయన్ ని తీసుకునే ప్లాన్ లో ఉన్నారట. చిరుతో ఆల్రెడీ సైరా నరసింహా రెడ్డి, గాడ్ ఫాదర్ సినిమాల్లో నటించింది నయనతార. ఇప్పుడు అనిల్ తో చేసే సినిమాలో కూడా నయన్ నటిస్తుందని టాక్. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు 18 కోట్ల దాకా డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. రెమ్యునరేషన్ విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ అవ్వని నయన్ అంత ఇస్తేనే సినిమా చేస్తానని అంటుందట. ఐతే నయన్ ఉంటే సినిమాకు మంచి బజ్ వస్తుందని ఆమెతో చర్చిస్తున్నారని తెలుస్తుంది. మెగా మూవీలో నయన్ కన్ఫర్మ్ అయితే తప్పకుండా సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. చిరుతో నయనతార నటించడం గురించి త్వరలోనే అఫీషియల్ అప్డేట్ వస్తుంది. ఈ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తో 300 కోట్లు కొట్టిన అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఈ సినిమా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.




## అమెరికాలో 'కన్నప్ప' బిగ్ ప్లాన్!




పౌరాణిక నేపథ్యంతో తెరకెక్కిన సినిమాలకు తెలుగు ప్రేక్షకుల్లో ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. ఈసారి అలాంటి ఓ మైథలాజికల్ ఎపిక్‌గా 'కన్నప్ప' మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న 'కన్నప్ప'ను జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు స్వయంగా నిర్మాణ బాధ్యతలు వహించగా, మంచు విష్ణు కథ, స్క్రీన్‌ప్లేను అందించారు. దాదాపు 100 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా విజువల్స్, గ్రాఫిక్స్ పరంగా కొత్త స్థాయిలో ప్రేక్షకులకు అనుభూతి అందించనుంది. ఇక సినిమా ప్రమోషన్ పనులలో కూడా స్పీడ్ పెంచారు. లేటెస్ట్ గా మంచు విష్ణు వేసిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, మొదటి దశ ప్రచార కార్యక్రమాల్ని అమెరికాలో నిర్వహించబోతున్నారు. మే 8 నుంచి అమెరికాలో వరుసగా ఈవెంట్లు, రోడ్ షోలు ప్లాన్ చేశారు. న్యూజెర్సీలో మొదలుపెట్టి, డల్లాస్, లాస్ ఏంజిల్స్ వంటి ప్రధాన నగరాల్లో 'కన్నప్ప' స్పెషల్ ప్రమోషన్స్ జరుగనున్నాయి. అమెరికాలో తెలుగు సినిమాలకు మంచి మార్కెట్ పెరిగిన నేపథ్యంలో, అక్కడ ప్రత్యేకంగా ఫ్యాన్స్‌ని టార్గెట్ చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇక మే నెలలో అమెరికాలో ప్రమోషన్ కార్యక్రమాల్ని పూర్తి చేసి, తిరిగి భారత్‌కు వచ్చి, ఇక్కడ దేశవ్యాప్తంగా మిగిలిన ఈవెంట్లు చేయబోతున్నారు. జూన్ 27 విడుదల తేది వరకు నెల రోజుల పాటు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరుగనున్నాయి. ముఖ్యంగా భారతీయ ప్రధాన నగరాల్లో, ప్రత్యేకమైన ఈవెంట్లు, మీడియా ఇంటర్వ్యూలు కూడా ప్లాన్ చేస్తున్నారు. విదేశీ ప్రచారానికి మద్దతుగా అక్కడి తెలుగు సంఘాలతో కలిసి కార్యక్రమాలు కూడా నిర్వహించేలా సన్నాహాలు సాగుతున్నాయి. 'కన్నప్ప' సినిమాలో నటీనటుల లిస్టు కూడా భారీగానే ఉంది. మోహన్‌బాబు, శరత్‌కుమార్, ముకేశ్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం వంటి టాప్ యాక్టర్స్ కీలక పాత్రలు పోషించారు. అంతేకాదు, ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్, అక్షయ్ కుమార్ వంటి స్టార్ సెలబ్రిటీస్ గెస్ట్ రోల్స్‌లో కనిపించనున్నారు. వీరి హైప్ సినిమాకు భారీ ఓపెనింగ్స్ తీసుకురాబోతోంది. ఇది తెలుగు ఇండస్ట్రీలో విభిన్నమైన స్థాయిలో ప్లాన్ చేసిన పాన్ ఇండియా ఎఫర్ట్ అని చెప్పొచ్చు.

## ఫ్యాక్ట్ చెక్ : శ్రీలీల మూడో దత్త కూతురు కాదు






అందంతో పాటు మంచి మనసున్న హీరోయిన్ శ్రీలీల. ఈమె ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న విషయం తెల్సిందే. వారి సంరక్షణ బాధ్యతలు చూసుకుంటూ, వారితో ఉన్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ ఉండే శ్రీలీల ఇటీవల ఒక చిన్న పాపతో ఉన్న ఫోటోను షేర్ చేసింది. ఈ పాప రాకతో తమ ఫ్యామిలీ మరింత పెరిగింది. మా కుటుంబంలోకి కొత్త వ్యక్తి వచ్చింది అంటూ శ్రీలీల సోషల్ మీడియా ద్వారా లవ్ ఈమోజీలను షేర్ చేసి మరీ పోస్ట్ చేసింది. దాంతో చాలా మంది శ్రీలీల మరో పాపను దత్తత తీసుకుంది అనుకున్నారు. పలు మీడియా సంస్థలు కూడా అదే విషయాన్ని ధృవీకరించాయి. ఇండస్ట్రీకి చెందిన వారు కూడా సోషల్ మీడియా ద్వారా శ్రీలీల మూడో దత్త కూతురు అన్నట్లుగా ప్రచారం చేశారు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అంతా ఇంతా కాదు. శ్రీలీల గొప్పతనం గురించి మరోసారి, ఆమె మంచితనం గురించి మరోసారి ప్రముఖంగా చర్చ జరిగింది. శ్రీలీల ఇటీవల షేర్ చేసిన పాప ఫోటోల గురించి ఫ్యాక్ట్ చెక్ చేసిన సమయంలో అసలు విషయం బయటకు వచ్చింది. శ్రీలీల ఇటీవల షేర్ చేసిన ఫోటోలో ఉన్న పాప ఎవరో కాదు తన సోదరి కూతురు. అంతే తప్ప ఆ పాపను శ్రీలీల దత్తత తీసుకోలేదు. తన సోదరి కూతురు రాకతో పిన్నిగా శ్రీలీల చాలా సంతోషంగా ఉందట. అందుకే తమ ఫ్యామిలీ పెరిగింది, మా ఆనందానికి అవధులు లేవు అన్నట్లుగా కాస్త భారమైన, బలమైన పదాలతో శ్రీలీల తన సంతోషంను వ్యక్తం చేసింది. శ్రీలీల ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని వారి బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పుడు మరో పాపను దత్తత తీసుకోవడం అంటే నిజంగా గొప్ప విషయం అని అంతా అనుకున్నారు. కానీ ఆమె దత్తత తీసుకోలేదు. ఆమె సినిమాలతో చాలా బిజీగా ఉండటం వల్ల ఆమె ఎక్కువ సమయం కేటాయించే పరిస్థితి లేదు. అందుకే ఆమె ఈ సమయంలో దత్తత ఆలోచన చేయక పోవచ్చు. ప్రస్తుతం తన ఆధ్వర్యంలో ఉన్న ఇద్దరు పిల్లలను సాధ్యం అయినంత వరకు ఆనందంగా చూసుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. శ్రీలీల ఆ ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవడం కూడా చిన్న విషయం ఏమీ కాదు. కోట్ల పారితోషికాలు తీసుకునే వారు చిన్న సాయం చేసేందుకు ముందుకు రారు. అలాంటిది శ్రీలీల ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవడం గొప్ప విషయం. ఇక శ్రీలీల సినిమాల విషయానికి వస్తే పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ ఐటెం సాంగ్ చేయడంతో ఒక్కసారిగా పాన్ ఇండియా రేంజ్ పాపులారిటీని సొంతం చేసుకుంది. దాంతో హిందీ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. కేవలం హిందీ సినిమా మాత్రమే కాకుండా తమిళ్ సినిమాలోనూ ఈమెకు నటించే అవకాశం దక్కింది. ఇక తెలుగులో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. రవితేజ తో ధమాకా సినిమా తర్వాత మరో సినిమాను చేసేందుకు ఈమె రెడీ అయింది. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మరో వైపు కన్నడ సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఆఫర్‌లను కూడా ఈమె తిరస్కరించకుండా ఓకే చెప్పేందుకు రెడీగా ఉంది. ఒక్క భాషలో అని కాకుండా అన్ని భాషల్లోనూ ఈ అమ్మడు నటిస్తూ దూసుకు పోతుంది.

## ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో

తెలుగు అమ్మాయిలు టాలీవుడ్‌లో హీరోయిన్స్‌గా రాణించడం సాధ్యం కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. నిజంగానే తెలుగు మాట్లాడే హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాల్లో నటించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. అయితే కొద్ది మంది అమ్మాయిలు మాత్రం ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏ మాత్రం తీసి పోకుండా అందంగా కనిపించడంతో పాటు, స్కిన్ షో చేయడం ద్వారా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకుంటారు. ఏపీకి చెందిన డింపుల్ హయతి టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించింది. రవితేజతో కలిసి 'ఖిలాడీ' సినిమాలో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాల్లో నటించిన డింపుల్ తమిళ్ సినిమాల్లోనూ నటించి మెప్పించేందుకు ప్రయత్నించింది. 19 ఏళ్ల వయసులోనే 'గల్ఫ్' అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. 2017లో విడుదల అయిన ఆ సినిమా డింపుల్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. 2019లో ఈమె నటించిన మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ముఖ్యంగా వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గద్దలకొండ గణేష్ సినిమాలో చేసిన ఐటెం సాంగ్‌తో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. జర్రా



జర్రా... అంటూ సాగే ఆ పాటకు మంచి రెస్పాన్స్ దక్కింది. దాంతో డింపుల్ హయతి కెరీర్ స్పీడ్ అందుకుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఈమె అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా బ్లాక్ అండ్ వైట్ సింపుల్ అండ్ గ్లామర్ ఔట్ ఫిట్‌ను ధరించింది. చూపు తిప్పుకోనివ్వకుండా హొయలు పోతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. అందమైన ఈ ఖిలాడీ బ్యూటీని ఈ ఫోటోల్లో చూస్తూ ఉంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో చేస్తున్నా కూడా టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. డీ గ్లామర్ పాత్రలతో పాటు, గ్లామర్ పాత్రలకు రెడీ అంటూ అన్ని రకాలుగా నటించేందుకు సిద్ధ పడే ఈ అమ్మడు ముందు ముందు టాలీవుడ్‌లో పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తమిళ తండ్రి, తెలుగు తల్లికి 1998లో ఆగస్టు 21న డింపుల్ హయతి జన్మించింది. పుట్టడం ఏపీలో అయినా పెరగడం మాత్రం హైదరాబాద్‌లోనే జరిగింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం కొన్ని జాతకాలు, ఇతర విషయాల ను పరిగణలోకి తీసుకుని తన పేరుకు ముందు హయతిని జత చేసుకుంది. టాలీవుడ్‌లో ఈమెకు చాలా ప్రయత్నాల తర్వాత అవకాశం దక్కింది. మొదటి సినిమా విజయం దక్కించుకోక పోవడంతో ఆఫర్ల కోసం ఎక్కువ రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. ఐటెం సాంగ్స్‌కి, వెబ్ సిరీస్‌లకు ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్‌గా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాస్త సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తే తమిళనాట ఈ అమ్మడికి వరుస ఆఫర్లు దక్కవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## రష్మిక మందన్న రిప్లైకి అర్థం అదేనా?

వెండితెరపై కొన్ని జంటలకున్న క్రేజ్ మరే జంటకూ ఉండదు. కారణం వారిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీనే. ఆ కెమిస్ట్రీ కారణంగానే ప్రేక్షకులు హిట్ పెయిర్ మళ్లీ మళ్లీ కలిసి నటిస్తే చూడాలని ముచ్చటపడుతుంటారు. ఇప్పుడు అలాంటి ఓ క్రేజీ జోడీ కలిసి నటించే చూడాలని అభిమానులు, సినీలవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జోడీ మరెవరో కాదు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరు కలిసి 'గీత గోవిందం'లో తొలిసారి నటించారు. వీరి కెమిస్ట్రీ వర్కవుట్ కావడంతో సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరి రికార్డు సృష్టించింది. ఇక ఆ తరువాత కలిసి చేసిన మూవీ 'డియర్ కామ్రేడ్'. ఇది కేవలం రష్మిక కోసమే విజయ్ చేసినట్టుగా ఉంటుంది. 'గీత గోవిందం' అంత కాకపోయినా ఆడియన్స్‌ని మాత్రం విశేషంగా ఆకట్టుకుని ఈ జంటకు హిట్ పెయిర్ అనే ముద్ర వేసింది. 2019లో ఈ మూవీ విడుదలైంది. ఆ తరువాత నుంచి వీరిద్దరు కలిసి మరో సినిమాలో నటించలేదు. మళ్లీ ఇన్నేళ్లకు వీరిద్దరు కలిసి నటించబోతున్నారనే వార్తలు తాజాగా వినిపిస్తున్నాయి. తాజాగా మైత్రీ మూవీమేకర్స్ వారు పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై



ఇవ్వడంతో ఆ వార్తలు నిజమేనని క్లారిటీ వచ్చేసింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో రూపొందుతున్న 'కింగ్‌డమ్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. దీని తరువాత రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ డ్రామాలో నటించనున్నాడు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించబోతున్నారు. ఈ భారీ మూవీ వచ్చే నెల హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. ఇందులో విజయ్‌కి జోడీగా రష్మిక నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నిర్మాణ సంస్థ తాజాగా 'వేచి చూద్దాం' అని అర్థం వచ్చేలా ఓ పోస్ట్ పెట్టింది. దానికి రష్మికను ట్యాగ్ చేసింది. దీనికి రష్మిక రిప్లైగా 'ఓకే' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేసింది. దీంతో చాలా గ్యాప్ తరువాత రౌడీ, రష్మికల జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. రష్మిక ఇదే విషయాన్ని తాజాగా కన్ఫర్మ్ చేసిందని చెబుతున్నారు. ఇదే నిజమైతే మరో సారి క్రేజీ జోడీ స్క్రీన్‌పై సందడి చేయడం ఇక లాంఛనమే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536